


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

ఆ న్యాయవాదిని వదిలేయడం న్యాయవ్యవస్థకు నష్టం 06
ఫిలిప్పీన్స్‌లో భూకంపం 02
విద్యుత్‌రంగ ప్రైవేటీకరణ తక్షణం విరమించాలి 05

సంపుటి 28, సంచిక: 111 | శనివారం | 11-10-2025 | హైదరాబాద్   Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar   పేజీలు: 12 | వెల రూ. 5.00



## నక్సల్స్ లొంగుబాటు

- డిజిపి ఎదుట లొంగిపోయిన ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు
- ఈ ఏడాది 412కు చేరిన సంఖ్య
- ఇంకా అజ్ఞాతంలో 72 మంది మావోయిస్టులు
- పునరావాస ప్రయోజనాలు కల్పిస్తాం: డిజిపి శివధర్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీకి చెందిన ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు శుక్రవారం తెలంగాణ డిజిపి శివధర్‌రెడ్డి ఎదుట లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలిశారు. లొంగిపోయిన వారిలో సిద్ధిపేట జిల్లాలోని మద్దూర్ మండలం, కూటిగల్ గ్రామ వాస్తవ్యుడు కుంకటి వెంకటయ్య అలియాస్ రమేష్ అలియాస్ వికాస్ (52), హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం, తాటికాయల గ్రామంకు చెందిన మొగిలిచెర్ల వెంకటరాజు అలియాస్ ఎర్ర రాజు అలియస్ చందు చంద్ర పున్నం చంద్ర్ అలియాస్ సట్ల బాలరాజు (45), ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా ధర్మపేట గ్రామానికి చెందిన చెందు భార్య తోడెం గంగ అలియాస్ గంగవ్వ అలియాస్ సోనీ (42)లు ఉన్నారు. ఈ సందర్భంగా తన కార్యాయలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐబి చీఫ్ తరువాయి 2లో



# నేరం బిజెపిదే


- ఆ పార్టీ తగినమూల్యం చెల్లించుకోవాల్సిందే
- బిసి రిజర్వేషన్లపై అన్ని రాజకీయ పార్టీలను రాష్ట్రపతి, ప్రధాని వద్దకు తీసుకువెళ్లాలి
- జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఐ సూచన
- బిసి రిజర్వేషన్ బిల్లును గవర్నర్ ఆమోదించలేదంటే బిజెపి వ్యతిరేకించినట్టే : కూనంనేని
- ప్రజాభిప్రాయాన్ని కేంద్రానికి తెలిపి ఆమోదింపచేయాల్సిన బాధ్యత గవర్నర్‌దే : పల్లా వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

వెనుకబడిన తరగతుల (బిసి) రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలను ఢిల్లీలోని ప్రధానమంత్రి, రాష్ట్రపతి వద్దకు తీసుకెళ్లాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. రిజర్వేషన్ల అంశంపై ఢిల్లీలోని జంతర్ వద్ద ధర్నా నిర్వహించాలన్నారు. బిసి రిజర్వేషన్ల విషయంలో కేంద్రంలోని బిజెపిదే పూర్తి బాధ్యత అని, బిసి రిజర్వేషన్ల బిల్లును గవర్నర్ ఆమోదించలేదంటే, ఈ రిజర్వేషన్లను బిజెపి కూడా వ్యతిరేకించినట్టేనని విమర్శించారు. హైదరాబాద్ మఖ్దూంభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నర్సింహ, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పాల్గొన్నారు. 'బిసిల రిజర్వేషన్ల' నేరం బిజెపిదేనని, దీనికి తగిన మూల్యాన్ని ఆ పార్టీ చెల్లించుకోవాల్సిందేనని కూనంనేని సాంబశివరావు అన్నారు. ఈ నేరానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా బిఆర్ ఎస్ మద్దతునిస్తుందని,ఇందుకు బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలే బాధ్యత వహించాలన్నారు. రిజర్వేషన్ల విషయంలో రాజకీయ పార్టీలు చిత్ర విచిత్రంగా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిసి రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడం విచారకరమని, కోట్లాది మంది ఆవేదనను, బాధను, ఆకాంక్షలను పరిగణలోకి తీసుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గవర్నర్ వద్ద మూడు నెలలుగా బిల్లులు పెండింగ్ ఉంటే, వాటిని నోటిఫై చేసినట్టేనని తమిళనాడు కేసులో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన తరువాయి 2లో

### స్టే బిసిల హక్కులకు విఘాతం

సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి



బిసి రిజర్వేషన్ల బిల్లుకు శాసనసభలోని అన్ని రాజకీయ పార్టీలూ మద్దతు ఇచ్చాయంటేనే, ఆ బిల్లులకు రాష్ట్రంలోని ప్రజలందరి మద్దతు ఉన్నట్టని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి చెప్పారు. ప్రజల అభిప్రాయాన్ని ఆమోదించే బాధ్యత గవర్నర్‌పైన ఉన్నదని, కానీ గవర్నర్ తరువాయి 2లో

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌పై హైకోర్టు ఆగ్రహం

ప్రజాపక్షం/హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలో భూదాన్ భూములపై తామిచ్చిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా చర్యలు ఉన్నాయో లేదో నివేదిక ఇవ్వమంటే ఎందుకు సమర్పించలేదని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను హైకోర్టు ప్రశ్నించింది. మూడు నెలలుగా నివేదిక ఎందుకు ఇవ్వలేదంటూ కలెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. వారంలోగా నివేదిక ఇవ్వాలని జస్టిస్ వేణుగోపాల్ ఆదేశించారు. వివిధ సర్వే నెంబర్స్‌లోని భూదాన్ భూములను ఐఏఎస్/ఐపిఎస్ అధికారులు, వారి బంధువులు అన్యాక్రాంతం చేశారని గతంలో పిటిషన్ పడింది. ఆ భూములను అన్యాక్రాంతం కారాదని, భూముల్ని నిషేధిత జాబితాలో పెట్టాలని ఆదేశించినప్పటికీ నిర్మాణం జరిగిందని బి.మల్లేష్ కోర్టు ధిక్కరణ పిటిషన్ వేశారు. ఈ కేసులో కలెక్టర్ రిపోర్టు ఇవ్వకపోవడంపై న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు.



### రూ.10వేలు లంచం

ఎసిబికి చిక్కిన మధురానగర్ పంచాయతీ కార్యదర్శి

ప్రజాపక్షం/గంగాధర

కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని మధురానగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి అనిల్‌పై అవినీతి నిరోధక శాఖ(ఏసిబి) డిఎస్పీ విజయ్ కుమార్ అధికారులతో దాడులు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి లంచం తీసుకుంటున్నట్లు ఫిర్యాదు రావడంతో ఏసిబి బృందం వల పన్ని రెడ్ హ్యాండెడ్‌గా తరువాయి 12లో

## కార్మిక నేతలపై కక్ష సాధింపా?

మహదేవయ్యను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి

అమర్‌జీత్ కౌర్ డిమాండ్ : జ్యోతిరాదిత్య సింధియాకు లేఖ



న్యూఢిల్లీ: కార్మికుల తరపున పోరాడే ట్రేడ్ యూనియన్ నాయకులపై కక్షసాధింపు ఆమోదయోగ్యం కాదని ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ నొక్కిచెప్పారు. ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ (ఎఐజిడిఎస్‌యు) ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ మహదేవయ్యను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరుతూ కేంద్ర సమాచార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు శుక్రవారం ఒక లేఖ రాశారు. మహదేవయ్య సీనియారిటీ పోకుండా, ముందు లభించిన అన్ని ప్రయోజనాలు కల్పిస్తూ గతంలో పనిచేసిన స్థానంలోనే తిరిగి నియమించాలని కోరారు. అన్ని సమస్యలను యూనియన్‌తో చర్చించి పరిష్కరించుకోవచ్చని అన్నారు. మహదేవయ్య విషయంలో సానుకూల స్పందనను ఆశిస్తున్నట్లు అమర్‌జిత్ కౌర్ పేర్కొన్నారు. తమ డిమాండ్లు పరిష్కరించని పక్షంలో ప్రజాస్వామిక, న్యాయపరంగా ఉన్న అన్ని అవకాశాలను అన్వేషిస్తామని, న్యాయం జరిగే వరకు పోరాడతామని తేల్చిచెప్పారు. 'మీరు తక్షణమే జోక్యం చేసుకుంటారని, న్యాయ సూత్రాలు, కార్మికుల హక్కులకు కట్టుబడి సమస్యను పరిష్కరిస్తారని భావిస్తున్నాం. కార్మిక సంఘాల కార్యకలాపాలు సాగించినందుకే తరువాయి 2లో




### డ్రగ్స్ ముఠా డబ్బు బదిలీ నెట్‌వర్క్‌పై ఈగల్ ఆపరేషన్

ముంబయిలో రూ.3 కోట్లు స్వాధీనం

రూ.కోటి విలువ చేసే డ్రగ్స్‌ను పట్టుకున్న రాచకొండ పోలీసులు

ప్రజాపక్షం/ హైదరాబాద్/ మల్కాజిగిరి

రాష్ట్రంలో డ్రగ్స్‌ను కట్టడి చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈగల్ టీమ్ మరో ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించింది. నైజీరియా డ్రగ్స్ ముఠా డబ్బు బదిలీ నెట్‌వర్క్‌ను ఛేదించింది. డ్రగ్స్ దందాకు సంబంధించి రూ.3 కోట్ల హవాలా డబ్బును ముంబయిలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ ముఠాల డబ్బు బదిలీ చేస్తున్న దగ్గారం ప్రజాపతి అనే వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటి వరకు 25 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు తరువాయి 2లో



## ఎఐతో జరభద్రం

మనిషిని పోలిన మనుషులతో డబ్బు వసూళ్లు

సర్వత్రా చర్చనీయాంశంగా ఖమ్మం జిల్లా ఘటన

ఆశకు పోతే నష్టపోక తప్పదు

ప్రజాపక్షం/ఖమ్మం

పెరిగిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం మానవ జీవితంలో అనేక మార్పులకు కారణమైంది. వ్యవసాయ రంగ యాంత్రీకరణ మొదలు ఇప్పుడు ప్రతిచోట ఆధునీకరణ ఒక కొత్త యుగానికి బాటలు వేస్తుంది. కృత్రిమ మేధా (అర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ) సరికొత్త సాంకేతిక విప్లవానికి నాంది పలుకుతుంది. మనిషిని పోలిన మనిషిని సృష్టించి సోషల్ మీడియా ద్వారా పేక్ ప్రచారాలను చేస్తున్న విషయం అందరికీ విధితమే. ముఖ్యంగా సోషల్ మీడియాలో అందమైన యువతులను సృష్టించి అసభ్యకర పోస్టింగులు పెడుతున్నారన్న ఆరోపణల నేపథ్యంలోనే రాజకీయ నాయకులను పోలిన ఫోటోలతో సమావేశాలు, సభలు అంటూ పిలుపులు రావడం , అవసరాలంటూ డబ్బులు వసూలు చేస్తున్న ఘటనలు ఒక్కొక్కటిగా తరువాయి 2లో

### మరియా కొరీనాకు నోబెల్ శాంతి పురస్కారం

05

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు నిరాశ





### కేరళ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచండి

వయనాడ్‌లో పునర్మిర్మాణ పనులకు రూ. 2,220 కోట్లు కేటాయించండి

ప్రధాని మోదీతో ముఖ్యమంత్రి పినరయి విజయన్ భేటీ

**న్యూఢిల్లీ :** కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. వయనాడ్ కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో ధ్వంసమైన వాటి పునర్నిర్మాణ పనులకు రూ.2,220 కోట్లకు పైగా వెంటనే విడుదల, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవడం వంటి వివిధ అంశాలపై కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరారు. సమావేశం అనంతరం విజయన్ మీడియాతో మాట్లాడుతూ ప్రధానమంత్రితో కీలక అంశాలను లేవనెత్తినట్లు చెప్పారు. వయనాడ్ సహాయ పనులకు నిధులతో పాటు, ఎయిమ్స్ ఏర్పాటుకు, రాష్ట్ర రుణ పరిమితులను పెంచడానికి కేంద్ర ప్రభుత్వ అనుమతిని కోరినట్లు చెప్పారు. గత సంవత్సరం వయనాడ్‌లో సంభవించిన ప్రకృతి వైపరీత్యం కారణంగా చాలా మంది మరణించారు, భారీ నష్టం జరిగింది. కోజికోడ్‌లోని కినలూర్‌లో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ఏర్పాటుకు తరువాయి 2లో

## దశల వారీగా దేశంలో ఓటరు జాబితా సవరణ

వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలుసహా, కొన్ని రాష్ట్రాలతో ప్రారంభం

సమాయత్తమవుతున్న ఎన్నికల సంఘం



**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా ఓటరు జాబితా ప్రత్యేక సవరణకు ఎన్నికల సంఘం సమాయత్తమవుతోంది. ఈ క్రమంలో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలతో సహా, కొన్ని రాష్ట్రాలతో ప్రారంభించి, దశలవారీగా దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణను ఎన్నికల కమిషన్ చేపట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అదే సమయంలో, స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న లేదా జరగనున్న రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా శుభ్రపరిచే కార్యక్రమాన్ని నిర్వహించబోమని, ఎందుకంటే గ్రాస్ రూట్స్ పోల్ యంత్రాంగం దానితో బిజీగా ఉండడంతో ఎస్ఐఆర్‌పై దృష్టి పెట్టలేకపోవచ్చని వారు చెప్పారు. అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లలో అసెంబ్లీ ఎన్నికలు 2026లో జరగనున్నాయి. ఈ ఐదు రాష్ట్రాలతో పాటు, మొదటి దశలో మరికొన్ని రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ నిర్వహించే అవకాశముంది. బిహార్‌లో ఓటర్ల జాబితా శుభ్రపరిచే కార్యక్రమం ముగియగా, దాదాపు 7.42 కోట్ల ఓటర్లతో తుది జాబితా సెప్టెంబర్ 30న ప్రచురించబడింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ సోమవారం మాట్లాడుతూ అన్ని రాష్ట్రాలలో ఓటర్ల జాబితాల తరువాయి 12లో

## మళ్లీ చిగురిస్తున్న భారత్–ఆఫ్గాన్ బంధం

కాబూల్ మిషన్‌ను పూర్తి రాయబార కార్యాలయ హోదాతో అప్‌గ్రేడ్ చేసిన భారత్



**న్యూఢిల్లీ :** ఏళ్ల ప్రతిష్ఠంభన తర్వాత భారత్–అఫ్గానిస్థాన్ బంధం చిగురిస్తోంది. వాణిజ్యం, మానవతా సహాయం కోసం అఫ్గాన్‌లో నిర్వహిస్తున్న టెక్నికల్ మిషన్‌ను భారత్ పూర్తిస్థాయి దౌత్య కార్యాలయానికి అప్‌గ్రేడ్ చేయనుంది. ఈ విషయాన్ని అఫ్గాన్ విదేశాంగ మంత్రి ముత్తాఖీతో భేటీలో భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ప్రకటించారు. అఫ్గానిస్థాన్‌లో ఆరు కొత్త ప్రాజెక్టులకు నిబద్ధతతో ముందుకు సాగడానికి భారత్ సిద్ధంగా ఉందని జైశంకర్ తెలిపారు. సీమాంతర ఉగ్రవాదాన్ని ఉమ్మడిగా ఎదుర్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. అఫ్గానిస్థాన్ రాజధాని కాబూల్‌లోని భారత సాంకేతిక మిషన్‌ను రాయబార కార్యాలయం హోదాకు అపగ్రేడ్ చేస్తున్నట్లు విదేశాంగ మంత్రి ఎస్‌జైశంకర్ ప్రకటించారు. అఫ్గానిస్థాన్ సార్వభౌమత్వం, భౌగోళిక సమగ్రత, స్వాతంత్ర్యానికి భారత్ పూర్తిగా కట్టుబడి ఉందని చెప్పారు. భారత పర్యటనకు వచ్చిన అఫ్గానిస్థాన్ విదేశాంగ మంత్రి ఆమీర్ ఖాన్ ముత్తాఖీతో జైశంకర్ సమావేశమయ్యారు. 20 అంబులెన్స్‌లను అఫ్గాన్‌కు బహుమతిగా అందజేయనున్నట్లు ప్రకటించారు. ఎంఆర్ఐ, సీటీ స్కాన్ తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## అమల్లోకి యుద్ధ విరమణ ఒప్పందం
### వెనక్కు తగ్గుతున్న ఇజ్రాయెల్ బలగాలు

**టెల్ అవీవ్:** ఇజ్రాయెల్, హమాస్ మధ్య గాజా పట్టణానికి సంబంధించిన యుద్ధ విరమణ ఒప్పందం స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం నుంచి అమల్లోకి వచ్చింది, ఇజ్రాయెల్ సైన్యం ఈ విషయాన్ని అధికారికంగా శుక్రవారం ప్రకటించింది. ముందుగా అంగీకరించిన సరిహద్దువైపు ఇజ్రాయెల్ బలగాలు వెనక్కు తగ్గుతున్నాయి. గాజాలో యుద్ధ విరమణ, పరస్పర బందీలను అప్పగింత వంటి 20 సూత్రాలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రతిపాదనకు ఇజ్రాయెల్ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆ వెంటనే యుద్ధ విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చినట్టు సైన్యం ప్రకటించింది. ఇజ్రాయెల్ కేబినెట్ తీర్మానంతో, మధ్యప్రాచ్యంలో రెండు సంవత్సరాలుగా సాగుతున్న యుద్ధానికి తెరపడింది. బందీల విడుదల ఒప్పందం వంటి అంశాలను ఆమోదించినట్టు బెంజిమిన్ నెతన్యాహు నేతృత్వంలో సమావేశమైన కేబినెట్ ప్రకటించింది. అయితే, అనేక వివాదాస్పద అంశాలపై స్పష్టత ఇవ్వలేదు.

# ఫిలిప్పీన్స్‌లో భూకంపం

## రిక్టర్ స్కేల్‌పై 7.6గా నమోదు.. సునామీ హెచ్చరిక



**మనీలా :** ఫిలిప్పీన్స్‌లో శుక్రవారం తెల్లవారుజామున భారీ భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలు ప్రకారం 7.6 మాగ్నిట్యూడ్‌గా నమోదైంది. ఒకరు మృతి చెందగా, అధికారులు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. మిండనావో ద్వీపంలోని దావో ఓరియెంటల్ ప్రావిన్స్ సమీప సముద్ర ప్రాంతంలో, భూమి 10 కిలోమీటర్ల లోతులో కదలికలు ప్రారంభమయ్యాయి. ఈ భూకంపం వల్ల సమీప తీర ప్రాంత ప్రాంతాలలో భారీ సునామీ అలలు రావచ్చని ఫిలిప్పైన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ వోల్కనాలజీ అండ్ సీస్మాలజీ అధికారులు హెచ్చరించారు. వెంటనే ఎత్తయిన, సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాల్సిందిగా ప్రజలకు సూచించారు. కాగా, భూకంపం ప్రభావంతో అనేక భవనాలు పాక్షికంగా లేదా పూర్తిగా ధ్వంసమయ్యాయి. సోషల్ మీడియాలో భవనాల కుప్పకూలడం, ప్రజలు పరుగు తీయడం వంటి షాకింగ్ వీడియోలు వైరల్ అయ్యాయి. సునామీ హెచ్చరిక సమాచారాన్ని ఫిలిప్పీన్స్ తీర ప్రాంతాలు, పొరుగు దేశాలకు కూడా అందించినట్టు అధికారులు తెలిపారు. 3 మీటర్ల ఎత్తు ఉన్న సునామీ అలలు వచ్చే అవకాశం ఉందని, ఇండోనేషియా, పలౌ తీరాల్లో కూడా కొద్దిసేపటి సునామీ అలలు ఉంటాయని పేర్కొన్నారు. ఇలా వుంటే, రెండు వారాల్లో ఫిలిప్పీన్స్ భూకంపానికి గురికావడం ఇది రెండోసారి. ముందుగా సెబులో 6.9 తీవ్రతతో జరిగిన భూకంపంలో 72 మంది మరణించారు. ఈ కొత్త భూకంపం తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ, అది భూగర్భంలో సుమారు 10 కిలోమీటర్ల లోతులో ఏర్పడడం వల్ల పెనుప్రమాదం తప్పినట్టు భావిస్తున్నారు. ఈ ఘటన పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్ అనే భూభాగంలో వత్తిడిగా ఉండే ప్రాంతంలో జరిగినందున, భూకంపాలు తరచుగా సంభవిస్తుంటాయని నిపుణులు చెప్పారు.

సునామీపై ముందస్తు హెచ్చరికలు జారీ కావడంతో, ప్రధాన ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వం, రెస్క్యూ బృందాలు సురక్షిత చర్యలు తీసుకుంటున్నాయి. ధ్వంసమైన భవన శిథిలాల కింద కొంత మంది చిక్కుకొని ఉండవచ్చని భావిస్తున్నారు. ఇప్పటికే ఒకరు మృతి చెందగా, ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. ఆఫ్టర్ శాక్స్ (అదనపు ప్రకంపనలు) వచ్చే అవకాశం ఉందని, ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధికారుల సూచనలు ఖచ్చితంగా పాటించాలని ప్రభుత్వం ఆదేసించింది.

# మీ 'బహిష్కృతులు' మాకొద్దు

## అమెరికాకు స్పష్టం చేసిన బుర్కినా ఫాసో

**డకార్:** అక్రమ వలసదారుల పేరుతో అమెరికా బహిష్కరిస్తున్న వారిని స్వస్థలాలకు పంపే వరకూ తాత్కాలిక శిబిరాల్లో ఉంచుకునేందుకు బుర్కినా ఫాసో నిరాకరించింది. డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను తిరస్కరించింది. వలసలను అనైతికంగా పేర్కొన్న మొరాకో విదేశాంగ మంత్రి కరమొకో జీన్‌మెరీ ట్రావోర్, అమెరికా ఒత్తిళ్లకు లొంగబోమని స్పష్టం చేశారు. దేశాన్ని పాలిస్తున్న సైన్యాధ్యక్షుడు కెప్టెన్ ఇబ్రహీం ట్రావోర్ సిద్ధాంతాలకు అమెరికా అనుసరిస్తున్న విధానాలు విరుద్ధమని వ్యాఖ్యానించారు. అక్రమంగా తమ దేశంలో నివసిస్తున్న వారిని వారివారి స్వస్థలాలకు పంపేందుకు వీలుగా, 'థర్డ్ పార్టీ డిపోర్షన్' ఒప్పందం మేరకు కొన్ని ఆఫ్రికన్ దేశాలకు తరలిస్తున్నది. అమెరికాతో ఈ విధమైన ఒప్పందం కుదుర్చుకున్న దేశాల్లో ఎస్వాటిని, దక్షిణ సుడాన్, రువాండ్, ఘనా వంటి దేశాలు ఉన్నాయి. ఈ దేశాలకు ఇప్పటికే సుమారు 40 బహిష్కృతులు అమెరికా తరలించింది. ఉగాండాతో ఒప్పందం ఉన్నప్పటికీ, ఇంకా అక్కడికి ఎవరినీ పంపలేదు. ఇలావుంటే, బుర్కినా ఫాసోను కూడా తమ ఒప్పందంలో భాగస్వాములను చేసుకునేందుకు అమెరికా ప్రయత్నిస్తున్నది. ఈ క్రమంలోనే వైట్ హౌస్ అధికారిక ప్రతిపాదన కూడా చేసింది. అయితే, బుర్కినా ఫాసో ఈ అభ్యర్థనను తిరస్కరిస్తూ, తమ దేశం ఎన్నటికీ బహిష్కృతులను తరలించే కేంద్రం కాబోదని తెల్చిచెప్పింది. ఇటీవల బుర్కినా ఫాసో నుంచి వచ్చిన వీసా ధరఖాస్తులను అమెరికా తిరస్కరించింది. ఇప్పుడు అమెరికా ప్రతిపాదనను అంగీకరించకపోవడానికి ఇదే ప్రధాన కారణమై ఉండవచ్చని అంటున్నారు.

# ఫ్రాన్స్‌లో రాజకీయ అనిశ్చితి

**పారిస్ :** ఫ్రాన్స్‌లో గత కొన్ని సంవత్సరాలుగా రాజకీయ అనిశ్చితి కొనసాగుతున్నది. అధ్యక్షుడు ఎమాన్యుయెల్ మాక్రాన్ నేతృత్వంలోని రినసెన్స్ పార్టీకి పార్లమెంటులో మెజారిటీ లేకపోవడమే సంక్షోభానికి ప్రధాన కారణం. గత మూడు సంవత్సరాలలో ఏకంగా ఐదుగురు ప్రధానులు రాజీనామా చేయడమే ఈ సమస్య తీవ్రతకు అద్దం పడుతున్నది. 2024 సాధారణ ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో, హంగ్ పార్లమెంట్ ఏర్పడింది. దీనితో, పార్లమెంటులో తప్పక బలాన్ని నిరూపించుకోవాల్సిన ప్రధాని ఎప్పటికప్పుడు బల పరీక్షను ఎదుర్కోక తప్పడం లేదు. ఒకవైపు మెజారిటీ లేకపోవడం, మరోవైపు సొంత పార్టీలోనే అసంతృప్తులు మాక్రాన్ పార్టీకి సవాళ్లు విసురుతున్నాయి. ఆ పార్టీ నుంచి ఎంపికైన ప్రధాన మంత్రులు రాజీనామా చేసే పరిస్థితులు ఏర్పడి, రాజకీయ అనిశ్చితికి ఆజ్యం పోతున్నాయి. ప్రభుత్వం ఖర్చులు తగ్గించడం నుంచి పన్నుల పెంపు వరకూ... నియామకాల్లో ఆంక్షల నుంచి ఉద్యోగుల వేతనం, పింఛన్ వరకూ దాదాపు ప్రతి విషయంలోనూ అధికార, ప్రతిపక్ష వర్గాల మధ్య వాదోపవాదాలు జరుగుతునే ఉన్నాయి. దీనితో ద్రవ్యోల్బణం పెరిగింది. ధరలు ఆకాశానికి అంటుతున్నాయి. ఉద్యోగ అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. విస్తృతగా ఉన్న సామాజిక వర్గాలకు సరైన ప్రాతినిథ్యం లభించడం లేదు. ఇలాంటి సమస్యలన్నీ రాజకీయంగా ప్రభుత్వంపై తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నాయి. ప్రజల్లో అసంతృప్తి రోజురోజుకూ పెరుగుతున్నది. ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన వారు, పరిస్థితి చక్కబడేందుకు నిర్ణయాలు తీసుకొని, అమలు చేయకముందే పదవి నుంచి తొలగాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రధానులు తరచుగా మారుతుండటం వల్ల నిత్యం అనిశ్చితి ఉంటున్నది. నిధుల నిర్వహణ, సంక్షేమ విధానాలు, స్థూల ఆర్థిక నిర్ణయాలు తీసుకునేందుకు తగినంత సమయం లభించడం లేదు. ప్రధానిగా ఉన్న జాన్ కస్టెక్స్ 2022లో మాక్రోన్ మొదటి కాలం ముగిశాక రాజీనామా చేశారు. 2022–2024 మధ్యకాలంలో ప్రధానిగా పనిచేసిన ఎలిజబెత్ బోర్న్ పార్లమెంట్ మద్దతు లేకపోవడంతో తప్పుకోవాల్సి వచ్చింది. గత ఏడాది రాజకీయ విభేదాలు, యువత నిరసనలు వల్ల గాబ్రియెల్ అటాల్ ప్రధాన మంత్రి పదవికి రాజీనామా చేశారు. తర్వాత మిచెల్ బార్నియర్ తాత్కాలిక ప్రధానిగా నియమితులయ్యారు. కానీ బడ్జెట్ ఓటింగ్‌లోనే విఫలం కావడంతో, తక్కువ కాలంలోనే రాజీనామా సమర్పించారు. సెబాస్టియన్ లెకొర్నూ ఈ ఏడాది జులైలో నియమితులయ్యారు.



మొరాకోలో మొదలైన 'జెన్ జెడ్ 212' ఉద్యమం తీవ్రస్థాయికి చేరింది. ప్రధాన మంత్రి అజీజ్ అఖనౌచ్ అవినీతికి పాల్పడుతున్నాడని ఆరోపిస్తూ మొదలైన ఈ ఉద్యమం, ఆయన రాజీనామాను డిమాండ్ చేస్తున్నది. రాజు మహమ్మద్ VI జాతిని ఉద్దేశించి ప్రసంగించనున్నట్టు వార్తలు వచ్చిన నేపథ్యంలో, శుక్రవారం నిరసనకారులు భారీ ప్రదర్శనలు నిర్వహించారు. అవినీతి అంతమే తమ పంతమని స్పష్టం చేశారు. అఖనౌచ్ రాజీనామా చేయాల్సిందేనని పట్టుబడుతున్నారు.

# నేరం బిజెపిదే
(మొదటి పేజీ తరువాయి)

విషయాన్ని కూనంనేని సాంబశివరావు గుర్తు చేశారు. రిజర్వేషన్ల విషయంలో కోర్టు ఆరు వారాలు స్టే విధించడం 'అటు ఇటు' కాకుండా ఉన్నదని, ఇందులో ఏదో మతలబు ఉన్నదని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. న్యాయ వ్యవస్థ కూడా పేద ప్రజలను పరిహాసం చేస్తోందన్నారు. రిజర్వేషన్ల అంశాన్ని న్యాయవ్యవస్థ పునర్ పరిశీలించాలని కోరారు. బిసి రిజర్వేషన్ల బిల్లును ఆమోదించని గవర్నర్‌ది తప్పా?, లేదా బిల్లును ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వానిదే తప్పా అని కూనంనేని విమర్శలు చేస్తున్న రాజకీయ పార్టీలను నిలదీశారు. రిజర్వేషన్లపై స్టే ఇస్తే బిజెపి, బిఆర్‌ఎస్ సంబురాలు జరుపుకుంటున్నాయని, బిసిలకు అన్యాయం జరిగిందనే బాధ వారిలో కనిపించడం లేదని విమర్శించారు. తాము అప్పుడే చెప్పామని చెబుతున్న పార్టీలు అసెంబ్లీలో జరిగిన బిసి బిల్లు ఆమోదంలో ఎందుకు పాల్గొన్నారని ప్రశ్నించారు. బిజెపి నాయకులు తెలంగాణ రాష్ట్రంలో విమర్శలు చేయడం కాకుండా ఢిల్లీకి వెళ్లి బిసి రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందేలా చూడాలని హితువు పలికారు. బిసి రిజర్వేషన్ల బిల్లులపైన రాహుల్‌గాంధీ మాట్లాడలేదని చెబుతున్న బిజెపి నేతలు, రాహుల్ గాంధీ మాట్లాడకపోతే, బాధ్యతకలిగిన ప్రధాని మోదీ మాట్లాడరా?, ఆయన బిసిలు, ఎస్సి ఎస్టి చెందిన సమస్యల పరిష్కారానికి, వారి హక్కులు, జరుగుతున్న నష్టాలపై ఆలోచించరా అని ప్రశ్నించారు. ఈ రెండు పార్టీలు 'శల్య సారథ్యం' తరహా వ్యవహరిస్తున్నాయన్నారు. బిసిలకు రిజర్వేషన్లు అమలు కావాలనే చిత్తశుద్ధి ఉంటే బిఆర్ ఎస్ బిజెపి హైకోర్టుకేసులో ఎందుకు ఇంప్లీడ్ కాలేదని ప్రశ్నించారు. బిసి జన గణను తప్పు పడుతున్న కేంద్రం అధికారంలో ఉన్న బిజెపి, తప్పులు లేకుండా దేశ వ్యాప్తంగా జనగణను చేపట్టాల్సిందని, పార్లమెంట్ బిల్లును సవరించాల్సిందని, కేంద్రంలో బిజెపికి పూర్తి మెజార్టీ ఉన్నది కదా? అని కూనంనేని నిలదీశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు సాధ్యం కాదని చాలా మంది చెప్పారని, కానీ అన్ని రకాల ప్రయత్నాలూ సాగాయని, అదే తరహాలో బిసి రిజర్వేషన్ల బిల్లులో ఎందుకు ప్రయత్నించడంలేదని రాజకీయ పార్టీలను ప్రశ్నించారు. ఒక వైపు స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని హైకోర్టు చెబుతోందని, మరోవైపు బిసి రిజర్వేషన్ల బిల్లులు పెండింగ్ ఉన్నాయన్నారు. ఇలాంటి తరుణంలో రాజకీయ పార్టీలు డొంక తీరుకుడు పద్ధతిని అనుసరిస్తూ ప్రజలను ఆయోమయానికి గురిచేస్తున్నాయని కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కోర్టు తీర్పు బిసిల ఆర్థిక, రాజకీయ, విద్య అవకాశాలకు విఘాతం : నెల్లికంటి సత్యం**

నెల్లికంటి సత్యం మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల విషయంలో గతంలో మండల్ కమిషన్ కూడా బిజెపి అడ్డుకున్నదని గుర్తు చేశారు. ప్రస్తుతం గవర్నర్ వ్యవస్థను బిజెపి అడ్డంపెట్టుకుని బిసి రిజర్వేషన్లను ఆమోదిచడంలేదని విమర్శించారు. ఇడబ్లుఎస్ రిజర్వేషన్ల ద్వారా 50 శాతం రిజర్వేషన్ల పరిమితి దాటిందన్నారు. రిజర్వేషన్ల విషయంలో కోర్టు తీర్పు బిసిల ఆర్థిక, రాజకీయ, విద్య అవకాశాలకు విఘాతంగా మారిందని, తద్వారా బిసి హక్కులను హరించే విధంగా మారిందని సత్యం ఆవేదన వ్యక్తం చేశారు.

# ఎఐతో జరభద్రం
(మొదటి పేజీ తరువాయి)

వెలుగు చూస్తున్నాయి. ఖమ్మం జిల్లాకు సంబంధించి ఒక ఘటన ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది. ఆంధ్రప్రదేశ్‌లోని ఇద్దరు తెలుగుదేశం నాయకులను పోలిన మనుషులను కృత్రిమ మేధా ద్వారా సృష్టించి వారి ద్వారా జిల్లాలోని తెలుగుదేశం నాయకులకు వీడియో కాల్ చేయించారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తుందని మీరు సిద్దంగా ఉండాలంటూ కొద్ది రోజుల క్రితం మాజీ మంత్రి ఫోటోతో ఒక వీడియో కాల్ వచ్చింది. దానికి తెలుగుదేశం కార్యకర్తలు, గ్రామస్థాయి నాయకులు సంబురపడిపోయారు. ఆ తర్వాత కొద్ది రోజులకు వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సహయం కోసం అంటూ కొంత డబ్బును ఖాతాకు పంపాలంటూ మొదట పేర్కొన్న మాజీ మంత్రి పేరుతో మరో వీడియో కాల్ రావడంతో కొంత డబ్బును జమ చేశారు. మూడు రోజుల క్రితం మీరు కొంత మంది కలిసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వీడియో కాల్ చేసినట్లు ఏఐ ద్వారా సృష్టించారు. ఖమ్మం జిల్లాకు చెందిన తెలుగుదేశం నాయకులు సుమారు 15 మంది విజయవాడ చేరుకున్నారు. మీ దగ్గరకు వచ్చి చంద్రబాబు నాయుడు మాట్లాడతారని మీరు ఒక మంచి హోటల్‌లో బస చేస్తే ఆ ఖర్చు కూడా పార్టీయే భరిస్తుందని చెప్పడంతో విజయవాడలో ఒక ఫైవ్ స్టార్ హోటల్‌లో బస చేశారు. మొదటి నుంచి వీరికి టచ్‌లో ఉన్న మాజీ మంత్రి పేరుతో వస్తున్న వీడియోకాల్ మరోసారి వచ్చింది. మీలో కొంత మందికి మాత్రమే అనుమతి వచ్చిందని మిగిలిన వారికి అనుమతి కోసం ఒక్కొక్కరు రూ. 10వేలు చెల్లించాలని తెలపడంతో తెలుగుదేశం నాయకులు అవాక్కయ్యారు. ఈలోపు హోటల్ యాజమాన్యం బిల్లు కోసం ఒత్తిడి తెచ్చింది. తెలుగుదేశం పార్టీ చెల్లిస్తుందని నాయకులు బుకాయించడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. మాజీ మంత్రిని కలిసేందుకు ప్రయత్నం చేయడంతో అసలు ఈ ఘటనతో మాజీ మంత్రికి ఎటువంటి సంబంధం లేదని ఆ వీడియోలు మొత్తం కృత్రిమ మేధా ద్వారా సృష్టించబడ్డాయని తెలుసుకుని అవాక్కయ్యారు. ప్రస్తుతానికి ఇది రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. నమ్మి వెళ్లిన తెలుగుదేశం నాయకులపై విజయవాడలో హోటల్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇప్పుడు ఏది అసలో ఏది నకిలీనో తెలుసుకోలేని పరిస్థితి ఏర్పడింది. కృత్రిమ మేధా మంచికి ఉపయోగపడాల్సి ఉండగా అక్రమార్కుల చేతికి కూడా ఒక ఆయుధంగా మారింది. ఈ కృత్రిమ మేధా అటు పోలీసులను ఇటు అధికారులను, సామాన్యులను సైతం ఇబ్బందులు పెడుతుంది. తగు పరిశీలన లేకుండా నమ్మితే మోసపోక తప్పదు. కృత్రిమ మేధాతో భద్రంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# భారత్- ఆఫ్గాన్ బంధం
(మొదటి పేజీ తరువాయి)

మెషీన్లను సమకూర్చడంతో పాటు, రోగనిరోధక వ్యాక్సిన్లను కూడా భారత్ సరఫరా చేయనుందని జైశంకర్ వెల్లడించారు. ఇరుదేశాల మధ్య చారిత్రాత్మక బంధం రెండు దేశాల మధ్య చారిత్రక సంబంధాలు ఉన్నాయని ఈ భేటీలో జైశంకర్ వ్యాఖ్యానించారు. అఫ్గాన్ ప్రజలు ప్రకృతి వైపరీత్యాలు వంటి ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడల్లా భారత్ ఆపన్నహస్తం అందించిందని గుర్తు చేశారు. వృద్ధి, శ్రేయస్సు పట్ల భారత్–అఫ్గానిస్థాన్ ఉమ్మడి నిబద్ధతను కలిగి ఉన్నాయని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. అయితే రెండు దేశాలు ఎదుర్కొంటున్న సీమాంతర ఉగ్రవాదం ముప్పు వల్ల ఇవి ప్రమాదంలో పడినట్టు పేర్కొంది. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి ప్రయత్నాలను సమన్వయం చేసుకోవాలని సూచించింది. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత అఫ్గాన్ సంఘీభావం తెలిపిందని పేర్కొంది. మరోవైపు భారత్ ఒక కీలక దేశమని ముత్తాఖీ అభివర్ణించారు. అఫ్గాన్ ప్రజలకు ఎప్పుడూ అండగా నిలుస్తూ అనేక రంగాలలో సహాయం చేసిందని గుర్తు చేశారు.

**మా దేశంలో మైనింగ్ చేయండి**

తమ దేశంలో మైనింగ్ చేయడానికి భారతీయ కంపెనీలను అఫ్గాన్ ఆహ్వానించింది. దీనిని భారత్ స్వాగతించింది. ముత్తాకితో భేటీ సందర్భంగా జైశంకర్, అభివృద్ధి భాగస్వామ్యం నుంచి క్రికెట్ వరకు ఇరుదేశాల ఉన్న అనేక సంబంధాల గురించి ప్రస్తావించారు. అలాగే వాణిజ్యపరంగా ఢిల్లీ, కాబూల్ మధ్య అదనపు విమానాల ప్రారంభం గురించి మాట్లాడారు. అఫ్గన్ విద్యార్థులు భారత విశ్వవిద్యాలయాల్లో చదువుకోవడానికి మార్గాలను విస్తరిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా 2025 ఏప్రిల్‌లో అఫ్గన్ ప్రజల కోసం కొత్త వీసా మాడ్యూల్ ప్రవేశపెట్టిన విషయాన్ని గుర్తు చేశారు.ఈ విషయంలో అఫ్గాన్‌పై జైశంకర్ ప్రశంసలు కురిపించారు. 2021లో అమెరికా సైన్యం వైదొలగడంతో అఫ్గాన్‌ను తాలిబన్లు స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో అఫ్గాన్‌లో భారత్ తన రాయబార కార్యాలయంతో పాటు కాన్సులేట్‌లను మూసివేసింది. 2022లో అఫ్గాన్‌లో టెక్నికల్ మిషన్‌ను ఏర్పాటు చేసింది. తాజా చర్చల్లో దీన్ని ఎంబసీగా అప్‌గ్రేడ్ చేసేందుకు భారత్ సిద్ధమైనట్టు జైశంకర్ ప్రకటించారు.

# జోర్డాన్‌లో చిక్కుకున్న గల్ఫ్ కార్మికులను వెంటనే స్వదేశానికి తీసుకురండి: హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జోర్డాన్‌లో చిక్కుకున్న గల్ఫ్ కార్మికులను వెంటనే స్వదేశానికి తీసుకురావాలని సిఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఉపాధి కోసం వెళ్లి జోర్డాన్‌లో చిక్కుకున్న 12 మంది వలస కార్మికుల ఆవేదనను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చి 22 నెలలు గడిచినప్పటికీ 'గల్ఫ్ పాలసీ, ఎన్‌ఆర్‌ఐ' పాలసీకి అతిగతి లేదని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కనీసం టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటుకు దిక్కులేదన్నారు.బిఆర్‌ఎస్ పాలనలో వలసలు వాపస్ అని, కాంగ్రెస్ పాలనలో వలసలు మొదలయ్యాయని ఆరోపించారు. నిర్మల్,కామారెడ్డి, నిజామాబాద్, జగిత్యాల, సిద్దిపేటకు చెందిన గల్ఫ్ కార్మికులు దేశం కాని దేశంలో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# విఘాతం
(మొదటి పేజీ తరువాయి)

ఆ బిల్లులను ఆమోదించకుండానే రాష్ట్రపతి వద్దకు పంపించారని గుర్తు చేశారు. బిసి రిజర్వేషన్ల విషయంలో రాజకీయ పార్టీలు తమ రాజకీయ లబ్ది కోసం కాకుండా చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. బిసి రిజర్వేషన్లపై బిజెపికి చిత్తశుద్ధి ఉంటే ఆ బిల్లులను గవర్నర్ ఆమోదించేలా చేసేవారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోడంతో కేంద్రం నుంచి స్థానిక సంస్థలకు రావాల్సిన రూ.3 వేల కోట్ల నిధులు రాలేదని పల్లా వెంకట రెడ్డి అన్నారు.

# కక్ష సాధింపా?
(మొదటి పేజీ తరువాయి)

మహదేవయ్యను విధుల్లో నుంచి తొలగించాలని ఏఐటీయూసీ నమ్ముతోంది. ఉద్యోగుల వ్యతిరేక ప్రభుత్వ విధానాలకు నిరసనగా గ్రామీణ డాక్ సేవక్‌ల సమ్మెకు మహదేవయ్య నాయకత్వం వహించారు.దీర్ఘకాలంగా పెండింగ్ ఉన్న డాక్ సేవల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం పోరాడారు. ఈ కారణంగా ఆయనను తొలగించారు. ఇది అన్యాయం. యూనియన్లు ఏర్పాటు చేసుకోవడం, సంబంధిత కార్యక్రమాల్లో పాల్గొనడం కార్మికుల హక్కు. ఇందుకోసం కక్షసాధింపుకు పాల్పడటం తగదు. ఈ చర్య మొత్తం పోస్టల్ కార్మికవర్గాన్ని కలవరపెట్టింది' అని అమర్‌జిత్ కౌర్ పేర్కొన్నారు. కార్మిక సంఘం కార్యకలాపాల్లో పాల్గొన్నందుకు మహదేవయ్యపై ఎటువంటి క్రమశిక్షణ చర్యలు తీసుకోవద్దని ఏఐటీయూసీ డిమాండ్ చేస్తోందన్నారు. మహదేవయ్యను తిరిగి విధుల్లోకి తీసుకోవడంపై హామీని ఆశిస్తున్నట్లు తన లేఖలో అమర్‌జిత్ కౌర్ పేర్కొన్నారు.

# ఈగల్ ఆపరేషన్
(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. నకిలీ పాస్‌పోర్ట్‌లతో విదేశీయులు భారత్‌లోకి ప్రవేశిస్తున్నట్లు గుర్తించారు. మరోవైపు రూ.కోటి విలువ చేసే డ్రగ్స్‌ను రాచకొండ పోలీసులు పట్టుకున్నారు. మల్కాజిగిరి ఎస్ఒటి, కీసర పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. నిందితుల నుంచి 7 కిలోల ఓపిఎం, 2 కిలోల పాపిస్ట్రా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ కేసులో రాజస్థాన్‌కు చెందిన లోకేశ్ భరత్ అరెస్టు చేసిన పోలీసులు, పరారీలో ఉన్న రాజస్థాన్ వాసి జగదీష్ గుజ్జర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మత్తు పదార్థాలు మనిషిని నేరాల వైపు మళ్లిస్తాయని, డ్రగ్స్ తీసుకుంటే శరీరంలో కూడా పలు అవయవాలు దెబ్బతింటాయని రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు తెలిపారు. ఎంతో భవిష్యత్ ఉన్న యువత మత్తు బారినపడటం దురదృష్టకరమని ఆయన విచారం వ్యక్తం చేశారు.

**ఇతర రాష్ట్రాల నుంచి ఆపరేటింగ్**

రాష్ట్రాన్ని డ్రగ్ ఫ్రీ తెలంగాణగా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖకు సూచించిందని సిపి సుధీర్ బాబు తెలిపారు. అందులో భాగంగా డ్రగ్స్ కట్టడి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నామన్నారు. ఇప్పటివరకు రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఇప్పటివరకు 403 మంది డ్రగ్ పెడ్లర్లు, సరఫరాదారులు, విక్రయదారులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఇతర రాష్ట్రాల్లో ఉండి డ్రగ్ ముఠాలను నడిపించే కొంత మంది నేరస్థులను తమ బృందాల ద్వారా అరెస్టు చేయించినట్లు చెప్పారు. ఇప్పుడు రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు నడిపిస్తున్న డ్రగ్ రాకెట్‌ను ఛేదించినట్లు తెలిపారు. ఈ కేసులో తప్పించుకున్న గుజ్జర్ కోసం తీవ్రంగా గాలిస్తున్నట్లు కమిషనర్ సుధీర్ బాబు ప్రకటించారు. 'రాజస్థాన్‌కు చెందిన లోకేష్ భరత్ అనే నిందితుడి నుంచి రూ. కోటి విలువ చేసే 7 కేజీల ఓపిఎం, 2 కేజీల పాపి స్ట్రా స్వాధీనం చేసుకున్నాం. నిందితుడిని కుందన్ పల్లి ఓఆర్ఆర్ దగ్గర పట్టుకున్నాం. పరారీలో ఉన్న మరో నిందితుడు జగదీష్ గుజ్జర్ కోసం గాలిస్తున్నాం. నిందితుడు లోకేష్ భరత్ ఆగస్టులో 2 కేజీల ఓపిఎం కాచిగూడ రైల్వే స్టేషన్ దగ్గర విక్రయించాడు. లోకేష్ భరత్ ఓ హోటల్‌లో మేనేజర్‌గా పని చేసేవాడు. అతను పని చేసే హోటల్ ముసివేయడంతో అతని ఉద్యోగం పోయింది. అప్పటి నుంచి ఈజీ మనీకి అలవాటు పడి ఈ దందాలోకి దిగాడు' అని రాజకొండ సిపి సుధీర్ బాబు వెల్లడించారు.

# నక్సల్స్ లొంగుబాటు
(మొదటి పేజీ తరువాయి)

సుమతితో కలిసి డిజిపి బి.శివధర్‌రెడ్డి మాట్లాడుతూ..జన జీవన స్రవంతిలోకి రావాలని ప్రజా ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు మావోయిస్టు పార్టీకి చెందిన రాష్ట్ర కమిటి సభ్యులు ఈ ముగ్గురు లొంగిపోయారన్నారు. ఒక్కొక్కరిపై ఉన్న రూ.20 లక్షల రివార్డును వారికి అందిస్తున్నామన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు భద్రత ఇవ్వడంతో పాటు ఎలాంటి వేధింపులు ఉండవని స్పష్టం చేశారు. లొంగిపోయిన కుంకటి వెంకటయ్య 36 ఏళ్లు, మొగిలిచెర్ల వెంకట్రాజు 35 ఏళ్లు, గంగవ్వ 21 ఏళ్లు అజ్ఞాతంలో గడిపారన్నారు.

**రాష్ట్రానికి చెందిన ఇంకా 72 మంది అజ్ఞాతంలోనే...**

తెలంగాణకు చెందిన 72 మంది మావోయిస్టులు ఇంకా అజ్ఞాతంలోనే ఉన్నారని, వీరిలో 8 మంది కేంద్ర కమిటి సభ్యులు ఉన్నారని డిజిపి శివధర్‌రెడ్డి తెలిపారు. ఈ ఏడాది మొత్తం 412 మంది పోలీసుల ముందు లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలిసిపోయారని అన్నారు. ఆయుధాలు విడిచి లొంగిపోవాలని ఆయన మరో సారి మావోయిస్టులకు పిలుపునిచ్చారు. లొంగిపోవాలనుకుంటున్న మావోయిస్టులు తమ కుటుంబ సభ్యులతోనైనా, రెవెన్యూ అధికారులతోనైనా, పోలీసునైనా సంప్రదించవచ్చన్నారు. ఈ సమావేశంలో సీనియర్ ఐపిఎస్ అధికారులు స్వాతిలక్రా, విజయ్‌కుమార్, సుమతి పాల్గొన్నారు.

**పార్టీలో బేదాభిప్రాయాలు ఉన్నాయి..**

కొంత పంథాను అందుకోలేక..పాత పంథాలో ప్రయాణించలేక లొంగిపోవడమే శ్రేయస్కారమని మావోయిస్టు రాష్ట్ర కమిటి సభ్యుడు వెంకటయ్య మీడియాకు వివరించారు.మావోయిస్టు పార్టీ నాయకత్వంలో రాజకీయ, ఆర్థిక, సామాజిక మార్పుల విషయంలో విబేధాలు వచ్చాయన్నారు. సమాచార వ్యవస్థ కుప్పకూలడంతో పార్టీ నష్టపోయిందని, ఈ తరుణంలో ప్రభుత్వం నుంచి సానుకూల వాతావరణం లభించడంలో లొంగిపోయామన్నారు.

# మెరుగుపరచండి
(మొదటి పేజీ తరువాయి)

తక్షణ అనుమతి కోరినట్లు విజయన్ చెప్పారు. కేరళలో ఎయిమ్స్ ఏర్పాటు చేయాలనేది చాలా కాలంగా ఉన్న డిమాండ్ ఉన్నది. రుణ పరిమితులను తగ్గించడం, రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులకు సంబంధించిన అంశాలను కూడా సిఎం ప్రధానమంత్రితో చర్చించారు. ప్రధానితో జరిగిన సమావేశం ఫోటోను విజయన్ తన ఎక్స్ హ్యాండిల్‌లో పంచుకున్నారు. దేశ రాజధాని పర్యటన సందర్భంగా విజయన్ గురువారం కేంద్ర మంత్రులు అమిత్ షా, జెపి నడ్డా, నిర్మలా సీతారామన్, నితిన్ గడ్కరీలతో సమావేశాలు నిర్వహించారు.

శుక్రవారం కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ మాట్లాడుతూ, శబరిమల వివాదం వెనుక కుట్ర ఉందని ఆరోపించారు మరియు కొండ ఆలయం నుండి బంగారం దుర్వినియోగంలో పాల్గొన్న వారందరూ చట్టం చేతుల్లోకి వస్తారని అన్నారు.

**టిడిబి వైపు లోపాలు కనుగొనలేదు**

శబరిమల బంగారం విషయంలో ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టిడిబి) వైపు నుండి ఇప్పటివరకు ఎటువంటి లోపాలు కనుగొనలేదని విజయన్ చెప్పారు. బంగార్ చోరీపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కేరళ హైకోర్టు రాష్ట్ర పోలీసులను ఆదేశించిన అనంతరం దేశ రాజధానిలో సిఎంపై వ్యాఖ్యలు చేయడం గమనార్హం. బంగారం దుర్వినియోగంపై దర్యాప్తు చేయడానికి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేశామని, ఇటీవల జరిగిన శబరిమల సమ్మేళనాన్ని దెబ్బతీసేందుకు కుట్ర జరిగిందని ఆరోపించారు. ఆలయం చోరీకి గురైన బంగారు పనుల గురించి వెల్లడించిన ఉన్నికృష్ణన్ పొట్టిని ప్రస్తావిస్తూ, అన్ని కుట్ర కోణాలను పరిశీలించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. వివాదానికి ఉన్నికృష్ణన్‌కు సంబంధం ఉందని, ఆయన బంధువుల నివాసంలో చోరీకి గురైన బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్న విషయాన్ని ఉదహరించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## అధికారిని వేధించిన వారిపై కఠిన చర్యలు
సిపిఐ నేత డాక్టర్ కె.నారాయణ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హర్యానా ఐపిఎస్ అధికారి వై.పూరణ్‌కుమార్ ఆత్మహత్య చేసుకోవడం దారుణమని, ఆయనను వేధించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ సెంట్రల్ కంట్రోల్ కమిషన్ అధ్యక్షులు డాక్టర్ కె.నారాయణ అన్నారు. హర్యానాలో ఐపిఎస్ అధికారి వై.పూరణకుమార్ ఆత్మహత్య సంఘటన దేశవ్యాప్తంగా ఆవేదన కలిగించిందన్నారు. పూరణ కుమార్ తన పైఅధికారుల నిరంతర వేధింపులు, అవమానాలు తట్టుకోలేక ప్రాణాలు తీసుకున్నారని వార్తల ద్వారా తెలియవస్తున్నదన్నారు. హర్యానా డిజిపి శత్రుజిత్ కుమార్ సహా బాధ్యులపై రోహిత్ వేముల చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని డాక్టర్ నారాయణ డిమాండ్ చేశారు. అధికార వ్యవస్థలో ఉన్న వివక్షాత్మక ధోరణులు ఈ ఘటనతో మరోసారి బయటపడ్డాయని చెప్పారు. బాధ్యులపై రోహిత్ వేముల చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవడం ద్వారానే న్యాయం సాధ్యమవుతుందన్నారు. వై.పూరణకుమార్ ఘటనపై కమిటీ ఏర్పాటు చేసి, న్యాయ విచారణ జరిపించాలని కోరారు. ఐపిఎస్ అధికారి పూరణ్‌మార్ కుటుంబానికి తగిన పరిహారం అందజేయాలని డాక్టర్ నారాయణ ప్రభుత్వాన్ని కోరారు.

## బిసిల రిజర్వేషన్లపై బిజెపి, బిఆర్ఎస్ వైఖరి
# స్పష్టం చేయకపోవడం దుర్మార్గం

సిపిఐ మాజీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/చిగురుమామిడి :** బిసి రిజర్వేషన్లపై బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు స్పష్టమైన వైఖరి ప్రదర్శించకపోవడం దుర్మార్గమని, అణగారిన బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి అడ్డుపడుతూ వారిని కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించు కుంటున్నారని సిపిఐ మాజీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడం మూలంగా కేంద్రం నుంచి రావాల్సిన రూ.3వేల కోట్లకు పైగా నిధులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. శుక్రవారం చిగురుమామిడి మండల కేంద్రంలోని అమరజీవి ముస్కు రాజిరెడ్డి స్మారక భవన్‌లో సిపిఐ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం అందె చిన్న స్వామి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం సిద్ధమై ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ బిసి రిజర్వేషన్లపై కొంతమంది కోర్టుకు వెళ్లడంతో ఎన్నికలు జరుగుతాయా? లేదా? అనే ఉత్కంఠ ఉండేదని, కోర్టు స్టే ఇవ్వడం వల్ల ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు నిధులు, అధికారాలు ఇస్తున్న తరహాలో తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయాలని గతంలో అనేకసార్లు ప్రభుత్వాలకు సూచించామన్నారు. ఇప్పటికైనా కేంద్రం బిసి రిజర్వేషన్లపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధం కావాలని, అందుకు తగిన కార్యచరణను రూపొందించుకోవాలని, తిరిగి చిగురుమామిడి మండలంలో ఎర్రజెండా ఎగురవేయడానికి సిపిఐ శ్రేణు లు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సిపిఐకి కంచుకోటగా నిలిచిన చిగురుమామిడి మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక ఎంపిటిసి, సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకోవడంతో పాటు ఎంపిపి, జడ్పిటిసిని గెలుచుకునే దిశగా పార్టీ నాయకులు, కార్యకర్తలు శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. బిసి రిజర్వేషన్లపై కోర్టు స్టే ఇచ్చినందున ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా సిద్ధం కావాలని, గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజల మధ్య ఉండి పనిచేయాలన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్రకౌన్సిల్ సభ్యులు అందె స్వామి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, గూడెం లక్ష్మి, జిల్లా కౌన్సిల్ సభ్యులు అందె చిన్న స్వామి, చాడ శ్రీధర్‌రెడ్డి, తేరాల సత్యనారాయణ, సహాయ కార్యదర్శులు బూడిద సదాశివ, పైడిపల్లి వెంకటేష్, మాజీ మండల కార్యదర్శి ఎలగందుల రాజయ్య, నాయకులు తదితరులున్నారు.

## 'ధర్నా చౌక్'ను పునరుద్ధరించాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ 'ధర్నా చౌక్'ను పునరుద్ధరించాలని చేసిన పోరాటంలో ధర్నా చౌక్ పరిరక్షణ కమిటీ సభ్యులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన టిఆర్ఎస్ ప్రభుత్వం ఇందిరా పార్కు వద్ద ధర్నాలు నిర్వహించవద్దని నగర శివారులో ధర్నాలు చేసుకోవాలని ఇచ్చిన ఆదేశాలకు వ్యతిరేకంగా సిపిఐ, సిపి(ఎం), టిజెఎసి, ఇతర వామపక్ష, ప్రజాసంఘాలు ఒక వేదికపైకి వచ్చి ఇందిరా పార్కు ధర్నా చౌక్ పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేసి ఆందోళన నిర్వహించారని, ఇందులో భాగంగానే తమపై కేసులు పెట్టారని చాడ వెంకట రెడ్డి ఒక ప్రకటనలో వివరించారు. ప్రజల సమస్యలను ప్రభుత్వానికి వినిపించడానికి, ప్రజల గొంతుకకు వేదిక అయిన ఇందిరా పార్కు ధర్నా చౌక్‌ను ఎత్తివేయడంతో దానికి వ్యతిరేకంగా సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో ఆనాడు 30 రోజుల పాటు వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు ధర్నాలు నిర్వహించి, కోర్టుకు వెళ్ళామన్నారు. కోర్టు ప్రజా సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయాలంటే పట్టణం నడిబొడ్డున ధర్నా చౌక్ ఉండాలి కానీ, సెల్‌టవర్ లేని నగర శివారులో ఎందుకు ధర్నాలు నిర్వహించాలనే కోర్టు ఆదేశాలతో ధర్నా చౌక్ పునరుద్ధరణ జరిగిందన్నారు. ఆనాడు తనపై, పరిరక్షణ కమిటీ సభ్యులపై కేసులు పెట్టారని, అవి ఇప్పటికి కూడా కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాటంలో పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని చాడ వెంకట రెడ్డి డిమాండ్ చేశారు.

## హైదరాబాద్ సమగ్ర అభివృద్ధికి
# ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది

నారెడ్కో ప్రాపర్టీ షోలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ మహానగరం సమగ్ర అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం హైటెక్స్‌లో జరిగిన నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నారెడ్కో) 15వ ప్రాపర్టీ షోను మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిల్డర్లు మధ్య, దిగువ మధ్యతరగతి వర్గాలను దృష్టిలో పెట్టుకొని ఫ్లాట్స్ నిర్మించాలని సూచించారు. తెలంగాణ ప్రజలు ఆతిథ్యానికి ఇచ్చినంత ప్రాధాన్యత దేశంలోని ఏ రాష్ట్రంలో కనబడదు, స్నేహితులు, బంధువులు ఇంటికి వస్తే ఆ రోజు పండుగ జరుపుకునే మనస్తత్వం తెలంగాణ ప్రజలది అన్నారు. రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధిలో బిల్డర్లు, రియల్టర్లు భాగస్వాములు కావాలని డిప్యూటీ సిఎం పిలుపునిచ్చారు. హైదరాబాదులో అంతర్జాతీయ విమానాశ్రయం, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి రియల్టర్లు వివిధ వర్గాలను ఆ ప్రాంతాలకు విరివిగా తీసుకువెళ్లాలని డిప్యూటీ సిఎం కోరారు. రెండు సంవత్సరాల్లో 20 వేల కోట్లు కేటాయించి చేపట్టిన పనుల ఫలితాలు ఇప్పుడు ఇప్పుడే కనిపిస్తున్నాయి, ఈ పనులు హైదరాబాద్ రూపురేఖలను మారుస్తాయి అన్నారు. ఇటీవల 39 ఎస్‌టిపి ట్రీట్‌మెంట్ ప్లాంట్స్ పనులకు ఆమోదం తెలిపారన్నారు. సీవరేజి ప్లాంట్లు, తాగునీటి అవసరాల కోసం సుమారు రూ.11,927 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. రూ.13,704 కోట్ల వ్యయంతో మరికొన్ని తాగునీటి, సీవరేజీ ప్లాంట్ పనులు ప్రతిపాదనలో ఉన్నాయని వివరించారు. మొత్తంగా సీవరేజీ, తాగునీటి సరఫరా కోసం రూ.25,631 కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వ వేలంలో ఎకరం రూ.177 కోట్లు పలికిందంటే హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ ఎంత వేగంగా దూసుకు వెళ్తుందో అర్థమవుతుంది అన్నారు. ఈ వేలంలో పాల్గొన్న 25 మంది బిల్డర్లు ఎకరాకు రూ.150 కోట్ల వరకు ధరను కోట్ చేశారని డిప్యూటీ సిఎం వివరించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఆసుపత్రులను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. నరెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షోలో తెలంగాణ పర్యాటక శాఖ స్టాల్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. దేశంలోనే అత్యధిక వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం తెలంగాణ అని, హైదరాబాద్ అభివృద్ధిలో రియలేస్టేట్ రంగం కీలక భూమిక పోషిస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం తీసుకొస్తున్న పురోగమక విధానాలు, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు హైదరాబాద్‌ను అగ్రస్థానంలో నిలబెట్టాయని తెలిపారు. ఐటీ, ఫార్మా, ఏరోస్పేస్, ఎలక్ట్రిక్ వెహికిల్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి రంగాల విస్తరణకు రియల్ ఎస్టేట్ కీలక మౌలిక సదుపాయాలను అందిస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి భాను ప్రసాద్, నారెడ్కో అధ్యక్షులు విజయ్‌సాయి మేక, జనరల్ సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి, జాతీయ వైస్ ప్రెసిడెంట్ పిఎస్‌రెడ్డి, ప్రతినిధులు ఎం.వెకయ్య చౌదరి, పి.రవిరెడ్డి, స్వామినాథన్, కాళీప్రసాద్, వెకంటేష్, హరిబాబు, దశరథ్ రెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

# రేకులపల్లి లక్ష్మీనర్సమ్మకు సిఎం నివాళి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాతృమూర్తి రేకులపల్లి లక్ష్మి నర్సమ్మ గతనెల 29న స్వర్గస్తులవ్వగా శుక్రవారం నిర్వహించిన ద్వాదశ దినకర్మలో సిఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో నిజామాబాద్ చేరుకున్న సిఎంను సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం హెలిప్యాడ్ వద్ద కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య, ఇతర జిల్లా అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అక్కడి నుండి పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య కాన్వాయ్ ద్వారా సిఎం రేవంత్‌రెడ్డి బోర్గాం(పి) శివారులోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్‌కు చేరుకుని ద్వాదశ దినకర్మలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డిని, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించిన సిఎం రేవంత్‌రెడ్డి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సిఎంతో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, శాసనమండలి సభ్యులు మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, రాకేష్‌రెడ్డి అధికారులు అనధికార ప్రముఖులు, ఆయా పార్టీల నాయకులు ద్వాదశ దినకర్మలో పాల్గొన్నారు. అనంతరం సిఎం కాన్వాయ్ ద్వారా కలెక్టరేట్‌కు చేరకుని హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. సిఎం పర్యటన నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయగా విస్తృతస్థాయిలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

**ఫారం - VI**

(సెక్షన్- నియమం-19 యొక్క ఉప నియమం (1)) మరియు సెక్షన్-11(1) యొక్క చట్టం -30/2013)

**తెలంగాణ ప్రభుత్వం**
**రెవిన్యూ (భూ సేకరణ) శాఖ**
**ప్రాథమిక ప్రకటన**

గెజిట్ నెం. 134/2025 తేదీ : 27.09.2025
నెం. ఎఫ్/12665/2025 తేదీ : 25.09.2025
నెం: జీ/ 1250/2025 తేదీ : 27.09.2025

ప్రజాప్రయోజనము నిమిత్తం అనగా నారాయణపేట కొండంగల్ లిఫ్టు ఇరిగేషన్ నిర్మాణంలో భాగంగా ఉట్కూర్ చెరువు పునరుద్ధరణ కొరకు నారాయణపేట జిల్లా, ఉట్కూర్ మండలం, బాపూర్ గ్రామం పరిదిలో మొత్తం **ఎ.2.37 గుంటలు** భూమి అవసరమై ఉన్నదని తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్ నారాయణపేట వారు భావించుచున్నారు.

తెలంగాణ ప్రభుత్వం నారాయణపేట - కోడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయే భూ నిర్వాసితులకు 2013 భూసేకరణ, పునరావాసం మరియు పునస్తాపనలో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత హక్కు చట్టంలోని అధ్యాయం 2 మరియు 3 యొక్క వర్తింపు నుండి మినహాయించడానికి తేది: 12.02.2025 నాడు G.O,Ms.No.3 Irrigation & CAD(LA) Department జారీచేసింది. అందువలన ఆ చట్టంలోని 4(1) సెక్షన్ ప్రకారం సామాజిక ప్రభావ అంచనా నిర్వహించబడలేదు. బాధిత కుటుంబాల పునరావాసం మరియు పునస్తాపన కోసం నారాయణపేట అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నిర్వాహకుడిగా నియమితులయ్యారు.

అందువలన పై తెల్పిన సదరు ప్రాజెక్టు కొరకు నారాయణపేట జిల్లా, ఉట్కూరు మండలం, బాపూర్ గ్రామం యొక్క మొత్తం **ఎ.2.37 గుంటలు** విస్తీర్ణం గల భూమి ఈ దిగువ తెల్పిన విధంగా వివరణాత్మక వివరం ప్రకారం స్వాధీనత కొరకు ప్రతిపాదించడమైనదని తెలుపడమైనది.

| క్ర. సం. | సర్వే నెం. | [illegible] | [illegible] | [illegible] | ఆసక్తిగల వ్యక్తి పేరు | సరిహద్దులు | | | | చెట్లు | | కట్టడాలు | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | ఉ | ద | తూ | ప | రకం | సంఖ్య | రకం | విస్తీర్ణం |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 156/1 | [illegible] | [illegible] | 0.31 | బాలప్ప తండ్రి కిష్టప్ప | [illegible] | 157 | 156 | 157 | - | - | - | - |
| 2 | 156/2 | [illegible] | [illegible] | 0.35 | గిరిగెలి బాలరాజు తండ్రి గిరిగెలి నర్సప్ప | [illegible] | 157 | 156 | 157 | - | - | - | - |
| 3 | 156/3 | [illegible] | [illegible] | 0.21 | పి.నర్సింహ తండ్రి పూజారి కన్నప్ప | [illegible] | 157 | 156 | 157 | చింత | - | - | - |
| 4 | 157/8 | [illegible] | [illegible] | 0.30 | ప్రభుత్వ భూమి | 157 | 157 | 157 | 157 | - | - | - | - |
| మొత్తం | | ఎ.2.37 గుంటలు | | | | | | | | | | | |

భూసేకరణ, పునరావాసం మరియు పునరావాస చట్టం 2013 (కేంద్ర చట్టము నెం. 30/2013) లో న్యాయమైన సక్రమ పరిహారం మరియు పారదర్శక హక్కు యొక్క సెక్షన్ 11 (1) యొక్క నిబందనల ప్రకారం వారందరికి ఈ ప్రకటన రూపొందించబడింది.

భూమి యొక్క ప్లాన్ జిల్లా కలెక్టర్, నారాయణపేట మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, నారాయణపేట భూ సేకరణ వారి కార్యాలయములో ఏదైనా పని దినములలో పరిశీలించుకొనవచ్చును. తెలంగాణ ప్రభుత్వం/ కలెక్టర్ కం సరియైన ప్రభుత్వము సదరు చట్టం యొక్క సెక్షన్ 12లో తెలిపిన మరియు నిర్దేశిత విధంగా వారి పనిని సరిగా చేపట్టుట కొరకు అవసరమైన అన్ని ఇతర చట్టాలను చేయుటకు &భూమిలోనికి ప్రవేశించుటకు మరియు సరిగా చేయుటకు ఏదేని భూమి యొక్క ఎత్తుపల్లాలు తీసుకొనుటకు సబ్ సాయిల్ త్రావ్వుటకు లేదా బోర్ వేయుటకు రెవిన్యూ డివిజనల్ అధికారి మరియు అతని సిబ్బందిని అధికారిగా అధికారమిచ్చుటకు.

చట్టం సెక్షన్ 11 (4) క్రింద కలెక్టర్ యొక్క ముందస్తు ఆమోదాలు లేకుండా ఈ ప్రకటన ప్రచురించిన తేది నుండి భూమి యొక్క ఏదేని లావాదేవీలు అనగా అమ్మకాలు / కొనుగోలు మొదలైనవి లేదా అటువంటి భూముల పై ఏవేని ఋణభారములు సృష్టించుటకు కారణమగుట లేదా ఏదేని లావాదేవి ఏ వ్యక్తి చేయరాదు.

పరిహారం యొక్క సంప్రదింపుల ద్వారా సెటిల్మెంట్ కొరకు ఆసక్తి / ప్రభావితమయే వ్యక్తులందరి నుండి క్లెయింలు మరియు సేకరణకు అభ్యంతరాలు ఏమైనా ఉంటె భూమిలో ఆసక్తి గల వ్యక్తులు చట్టం యొక్క సెక్షన్ 15 క్రింద ఏర్పాటు ప్రకారం ఈ నోటిఫికేషన్ ప్రచురించిన తేది. నుండి 60 (అరువది) రోజుల లోపల భూమిలో ఆసక్తి గల వ్యక్తులచే జిల్లా కల్లెక్టర్ / అధికృత సమక్షంలో సమర్పించవచ్చు.

సం/- భూసేకరణ అధికారి & రాజస్వ మండలాధికారి నారాయణపేట
సం/- అదనపు కలెక్టర్(రెవిన్యూ) నారాయణపేట
సం/- జిల్లా కలెక్టర్ నారాయణపేట

DIPR RO NO. 687/LA/PP/Advt/Pub/2025-26

## రిజర్వేషన్ల విషయంలో బిఆర్ఎస్
# చిత్తశుద్ధిని శంకించలేరు

మాజీ ఎంపి వినోద్‌కుమార్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసి రిజర్వేషన్ల అంశంపైన గతంలోనే కెసిఆర్ అసెంబ్లీలో బిల్లును ఆమోదింపజేసి కేంద్రం వద్దకు పంపించిన బిల్లు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నదని, రిజర్వేషన్ల విషయంలో బిఆర్ఎస్ చిత్తశుద్ధిని శంకించేందుకు వీలు లేదని బిఆర్ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. ఇప్పటికైనా ఢిల్లీలో కాంగ్రెస్, బిజెపిలు కలిసి బిసి రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చేందుకు ప్రయత్నించాలని, ఇందు కు బిఆర్ఎస్ సహకరిస్తుందని సూచించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వినోద్‌కుమార్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ, రాహుల్ గాంధీ తలచుకుంటే బిసి రిజర్వేషన్లు పెరగవా? అని ప్రశ్నించారు. వోడాఫోన్ రూ.40వేల కోట్ల ఆదాయ పన్నును చెల్లించాలని సుప్రీం కోర్టు తీర్పునిస్తే, దీనిని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చట్ట సవరణ ద్వారా తిరస్కరించి, వోడాఫోన్‌కు లబ్ధి చేకూర్చిందని గుర్తు చేశారు. ఒక సంస్థ కోసం చట్ట సవరణ చేసిన కేంద్రంలోని బిజెపి, ప్రస్తుతం బిసిలకు చెందిన రిజర్వేషన్ల విషయంలో ఎందుకు రాజ్యాంగ సవరణ చేయబోదని ప్రశ్నించారు. హైకోర్టులో బిఆర్ఎస్ ఎందుకు ఇంప్లీడ్ కాలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నిస్తున్నారని, బిఆర్ఎస్ డ్రామా కంపెనీ కాదని వివరించారు. డ్రామా లు ఇప్పటికైనా కట్టిపెట్టి, బిసిలను మోసం చేయాలనే వైఖరిని కాంగ్రెస్ విడాలని వినోద్ కుమార్ సూచించారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమా భరత్ కుమార్, లీగల్ సెల్ ప్రతినిధి సి.కళ్యాణ్ రావు పాల్గొన్నారు.

# రూ.220 కోట్ల బకాయిలు చెల్లించాలి

తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'ఎస్‌సి, ఎస్‌టి బెస్ట్ అవైలబుల్ స్కీమ్' కింద ప్రభుత్వం బకాయిపడిన రూ.220 కోట్లను చెల్లించేంతవరకు పాఠశాలల్లోకి పిల్లలను రానివ్వబోమని ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు సమ్మె చేపట్టాయని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి ఆ నిధులను విడుదల చేయాలని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ నాయక్ కోరారు. ఎస్‌సి, ఎస్‌టి కులాలకు చెందిన విద్యార్థులకు ఉచితంగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యను అందించేం దుకు గత 25 ఏళ్ల కింద ప్రవేశపెట్టిన బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌కు సంబంధించిన నిధులను గత రెండేళ్ల నుంచి విడుదల చేయకపోవడంతో రూ.220 కోట్ల బకాయిలు పేరుకుపోయాయన్నారు. ఫలితంగా ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు దసరా సెలవుల అనంతరం పాఠశాలల్లోకి దళిత, గిరిజన విద్యార్థులను అనుమతించలేదని, పాఠశాల గేట్ల బయటనే నిలబెట్టాయని, ప్రభుత్వం నిధులను విడుదల చేసే వరకూ పిల్లలను పాఠశాలల్లోకి తీసుకురావొద్దంటూ తల్లిదండ్రులకు తెగేసి చెప్పాయని ఆయన ఒక ప్రకటనలో వివరించారు. నిధులను విడుదల చేయాలని తెలంగాణ గిరిజన సమాఖ్య అనేక దఫాలుగా ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినా, రాష్ట్రంలోని దళిత, గిరిజన సంఘాలు, బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల యాజమాన్యాలు సుదీర్ఘకాలంగా మొరపెట్టుకుంటున్నప్పటికీ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని తెలిపారు. ఈ స్కీమ్ చరిత్రలోనే ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు ఇలాంటి అవమానం ఎదురుకావడం రాష్ట్రంలో ఇదే మొదటిసారి అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌లో బకాయిపడ్డ నిధులను యాజమాన్యాలకు విడుదల చేసి గిరిజన విద్యార్థులను ఆదుకోవాలని కోరారు.

# సిజెఐపై దాడి అనాగరికం




**ప్రజాపక్షం/హైదరాబాద్:** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌పైన జరిగిన దాడి అనాగరికమని ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ అన్నారు. తక్షణమే నిందితుల పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 42 శాతం బిసి రిజర్వేషన్ల అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకుని అఖిల పక్షాన్ని వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ దళితుడు కావడం వల్లనే దాడి జరిగిందన్నారు. జస్టిస్ గవాయ్‌పైన జరిగిన దాడి ని నిరసిస్తూ, నిందితులను కఠినంగా శిక్షించాలని, సమగ్రమైన విచారణ చేపట్టాలని,ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేస్తూ జాతీయస్థాయిలో ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడుతున్నామని తెలిపారు. ఈ నెల 13న కలెక్టర్ కార్యాలయాల ముందు, 17న అన్ని మండల కేంద్రా ల్లో నల్లజెండాలతో నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామని, ఈనెల 22న చలో హైదరాబాద్ పేరుతో తెలంగాణ రాష్ట్రంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఆ తర్వాత 23న చలో అమరావతి పేరు తో ఆంధ్రప్రదేశ్, 24వ తేదీన చలో చెన్నై పేరుతో తమిళనాడులో, ఈ నెల 25న చలో బెంగళూరు పేరుతో కర్నాటకలో భారీ నిరసన ర్యాలీలను నిర్వహించనున్నట్టు మంద కృష్ణ తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి చేసిన కృషి వల్లనే బిసి రిజర్వేషన్ల అంశం ప్రధాన చర్చల్లోకి రావడానికి కారణమని అన్నారు. రాజకీయ పార్టీలు రిజర్వేషన్ల అంశాన్ని రాజకీయ వైరుధ్యంతో, ఓటు బ్యాంకు రాజకీయంగా చూడకుండా బిసిలకు న్యాయం జరిగేలా అందరూ ముందుకు రావాలని ఆయన కోరా రు. 42 శాతం రిజర్వేషన్ల పట్ల హైకో ర్టు స్టే విధించడం పట్ల కొన్ని రాజకీయ పార్టీలు సంబురాలు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. బిసి రిజర్వేషన్ల అంశంపైన ఎస్‌సి, ఎస్‌టి సంఘాలను కలుపుకుని ఎంఆర్‌పిఎస్ 'పండగ పోరాటం' చేస్తామని మందకృష్ణ మాదిగ అన్నారు.

## లడ్డూ ఘటనపై వివరాలు ఇవ్వండి
ఆలయ ఇఒకి మంత్రి ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వేములవాడ లడ్డూ ఘటనపై సమగ్ర విషయాలు అందజేయాలని టెంపుల్ అధికారులకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుక్రవారం ఆదేశించారు. లడ్డూపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో టెంపుల్ ఇఒ రమాదేవి... ఫుడ్ సేఫ్టీ అధికారులకు లేఖ రాసినట్టు మంత్రికి వివరించారు. ఎక్కడా ఎటువంటి లోపం జరగలేదని వెల్లడైందని... అయినా, భక్తుల మనోభావాలను గౌరవించే ప్రక్రియలో భాగంగా కీలక చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి వెల్లడించారు. ఎటువంటి తప్పిదాలు జరగొద్దని... జాగ్రత్తగా ఉండాలని మంత్రి కొండా సురేఖ కీలక సూచనలు చేశారు. ఆలయ ప్రతిష్టకు సంబంధించిన వ్యవహారాల్లో తప్పుడు ప్రచారం చేసేవారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.


**డాక్యుమెంట్స్ పోయినవి**

నేను అనగా **కామళ్ళ లక్ష్మయ్య తండ్రి పిచ్చయ్య,** ఇంటి నెం. 6-35/1ఎ, మారుతీనగర్, వరంగల్ 'x' రోడ్, ఖమ్మం రూరల్ మం॥ ఖమ్మం జిల్లా. నాయొక్క సర్వే నెం.304, ప్లాట్ నెం.115గల **Plot Mother Document No. 1247/2002, Date: 13/8/2002,** Register Office-Kusumanchi. ఇట్టి డాక్యుమెంట్స్ ఇ-సేవలో EC కొరకు పెద్దతండాకు వెళ్లినప్పుడు నా యొక్క పేపర్స్ ఎక్కడో పడిపోవడం జరిగింది. ఇట్టి పేపర్స్‌ని నాకు ఇప్పించగలరని మనవి.

ఇట్లు
**కామళ్ళ లక్ష్మయ్య తండ్రి పిచ్చయ్య**
మారుతీనగర్, ఖమ్మం.



**శ్రీ గండిమైసమ్మ దేవస్థానం**
తెలంగాణ ప్రభుత్వము - దేవాదాయ ధర్మాదాయ శాఖ
గండిపేట గ్రా॥, మం॥, రంగారెడ్డి జిల్లా.

లేఖ నెం. SGMD/2025 **సీల్డ్ టెండర్ - కమ్ - బహిరంగ వేలం ప్రకటన** తేదీ: 10.10.2025

ఇందుమూలముగా సమస్త వ్యాపారులకు, స్థానికులకు, భక్తులకు తెలియజేయునది ఏమనగా శ్రీ గండిమైసమ్మ దేవస్థానమునకు చెందిన పడమరి దిక్కున ఉన్న ఖాళీ స్థలములో క్రింది పట్టికలో చూపిన బిట్స్ ప్రకారముగా టిన్స్ షెడ్డు సొంత ఖర్చులతో నిర్మించుకొని గోదాము / సామాను భద్రపరచుటకొరకు మాత్రమే వాడుకొనుటకు సీల్డ్ టెండర్-కమ్- బహిరంగ వేలము తేది: 25-10-2025 శనివారము రోజున ఉ. 11 గం॥లకు ఆలయ ప్రాంగణములో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో హాజరు అయిన వారి సమక్షంలో మూడు (3) సంవత్సరాల కాలపరిమితికి బహిరంగ వేలం ప్రక్రియ నిర్వహించబడును. ఆసక్తిగల వారు సదరు సమయమునకు హాజరుఅయి సీల్డ్ టెంగర్ - కమ్ బహిరంగ వేలం ప్రక్రియలో పాల్గొనగలరని కోరుచున్నాము.

| క్ర. సం. | బిట్ నెం. | స్థలము కొలతలు | వేలం పాట కాలపరిమితి | టెండరు ధర | ప్రతి బిట్ కి డిపాజిట్ రూపాయలు |
|---|---|---|---|---|---|
| 1 | నెం.1&2 | 36/75 | 3 సంవత్సరములు 05.11.2025 నుండి 04.11.2028 | రూ. 1000/- | రూ. 50,000/- |
| 2 | నెం. 3, 4, 5, & 6 | 18/50 | 3 సంవత్సరములు 05.11.2025 నుండి 04.11.2028 | రూ. 1000/- | రూ. 50,000/- |
| 3 | పార్కింగ్ నిర్వహణ వసూలు చేసుకునే హక్కు | | 1 సంవత్సరము 05.11.2025 నుండి 04.11.2026 | రూ. 500/- | రూ. 50,000/- |

బహిరంగవేలము లో పాల్గొను వారు నిర్ణీత డిపాజిట్‌ను డిమాండ్ డ్రాఫ్ట్ కమ్ నగదు రూపంములో దేవస్థాన కార్యలయములో చెల్లించవలెను. షరతులు ఇతర పూర్తి వివరములకు దేవస్థాన కార్యనిర్వాహణాధికారి కార్యాలయములో సంప్రదించగలరు.

సం/- కార్యనిర్వాహణాధికారి
సెల్ నెం. 9912186517

DIPR R.O. No. : 8997-PP/CL/ADVT/1/2025-26, Date: 10-10-2025



**మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం**
**I.P. No. 16/2024**

*Between:*
Vattam Sai Kumar ...*Petitioner*
AND
Guni Vinay and Others ...*Respondents*

1. Gunti Vinay, S/o. not known, Hindu, aged 33 years, behind APR Praveen's Crystal Avenue, RTC Colony, Saheb Nagar, Hyderabad, Telangana.
7. Kondaveti Venkateswarlu, S/o. not known, Hindu, aged 30 years, Plot No. 701/A, 4th Floor, Road No.36, Jubli Hills, Hyderabad, Telangana.
10. Nanini Suresh, S/o. not known, Hindu, aged 30 years, Plot No. 701/A, 4th Floor, Road No.36, Jubli Hills, Hyderabad, Telangana.
11. Chalumuri Satish Kumar, S/o not known, Hindu, aged 30 years, D.No. 9-2-65/A, Hasmathpet, Old Bowenpally, Hyderabad, Telangana.
12. Thommandru Abhisheik, S/o. not known, Hindu, aged 26 years, Beside Axix Bank Street, Dead end house, 2nd Floor, SR Nagar, Hyderabad.
13. Arasavalli Yashoda Krishna, S/o. not known, Hindu, aged 27 years, beside Axis Bank Street, Dead end house 2nd Floor, SR Nagar, Hyderabad.
14. Nalla Dinesh, S/o not known, Hindu, aged 31 years, D.No. 9-2-65/A, Hasmathpet, Old Bowenpally, Hyderabad, Telangana.
15. Pola Bhagawan, S/o not known, Hindu, aged 29 years, D.No. 9-2-65/A, Hasmathpet, Old Bowenpally, Hyderabad, Telangana.
16. N.Chandana, D/o not known, Hindu, aged 26 years, beside Axis Bank Street, Dead end house 2nd Floor, SR Nagar, Hyderabad.
17. Bandaru Shiva Kumar, S/o not known, Hindu, aged 29 years, beside Axis Bank Street, Dead end house 2nd Floor, SR Nagar, Hyderabad.

*...1, 7, 10, 11, 12, 13, 14, 15, 16, 17 Respondents*

పై నెంబరు పిటిషనులో 1, 7, 10, 11, 13, 14, 15, 16, 17 రెస్పాండెంట్లు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 15-10-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటీషనులో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషనును మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి **ఎ.సునీల్**
10-10-2025 అడ్వకేట్, రాజమండ్రి



# జనరల్
STATE & REGIONAL NEWS

## నేడు మద్యం షాపుల దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మద్యం షాపులకు దరఖాస్తులు చేసుకోవడానికి.. శనివారం పంచమి మంచి రోజు కావడంతో దరఖాస్తుల స్వీకరణకు అనుమతి ఇవ్వాలని వస్తున్న అభ్యర్థనలకు స్పందించిన ఎక్సైజ్ శాఖ రెండో శనివారం సెలవు ఉన్నప్పటికి దరఖాస్తులను తెలంగాణ వ్యాప్తంగా తీసుకోవడానికి ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి నెలలో రెండోవ శనివారం తెలంగాణలో ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు. అయితే హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు వినాయక చవితి సందర్భంగా సెలవు ఇచ్చారు. ఈనెల 11 శనివారం ఈ జిల్లాల వారికి వర్కింగ్ డేగా వర్తింప చేశారు. కాని మిగిలిన జిల్లాలకు మాత్రం రెండో శనివారం సెలవుగా ఉంది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 11 శనివారం వర్కింగ్ డేగా ఉంది. ఈ మూడు జిల్లాల్లో మద్యం షాపులకు దరఖాస్తులు వేయడానికి అవకాశాలు ఉన్నాయి. కానీ తెలంగాణలోని మిగిలిన జిల్లాల్లో రెండవ శని వారం సెలవు కావడంతో దరఖాస్తులు తీసుకునే అవకాశం లేదు. దీంతో చాల మంది మద్యం షాపులకు దరఖాస్తులను శనివారం మంచి రోజు పంచమి కావడంతో వివిధ జిల్లాల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఎక్సైజ్ శాఖ అన్ని జిల్లాలో మద్యం దుకాణాలకు దరఖాస్తులు తీసుకునే విధంగా ఉత్తర్వులు వెలువరించారు.



## అత్యుత్తమ ప్రమాణాలతో అవసరమైన ప్రాథమిక సదుపాయాలు కల్పించాలి

మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని అన్ని సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు అత్యుత్తమ ప్రమాణాలతో అవసరమైన ప్రాథమిక సదుపాయాలు ఉండాలని రాష్ట్ర ఎస్‌సి,ఎస్‌టి, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హైదరాబాద్‌లోని సచివాలయంలోని తన ఛాంబర్‌లో సంక్షేమ హాస్టల్ పరిస్థితులపైన శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సభ్య సాచి ఘోష్, సాంఘీక సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి బుద్ధప్రకాశ్, కమిషనర్ క్షితిజా, ఎస్‌సి,ఎస్‌టి, మైనారిటీ గురుకుల సొసైటీ కార్యదర్శులు కృష్ణఆదిత్య, సీతాలక్ష్మి, షఫీయుల్లా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ బలహీన వర్గాల విద్యార్థుల కోసం శుభ్రమైన వసతి, పోషకాహార భోజనం, పరిశుభ్రమైన వంట గదులు, సురక్షితమైన తాగునీటి సదుపాయం తప్పనిసరిగా ఉండాలన్నారు. సంక్షేమ హాస్టళ్లలో ఆహార నాణ్యత, సరఫరా, క్వాలిటీ కంట్రోల్‌పై అధికారుల నిరంతర పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా అధికారులు తరచూ ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని, విద్యార్థుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటిని సాధ్యమనంతా మేరకు వెనువెంటనే పరిష్కరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం దళిత గిరిజన బలహీన వర్గాల అభివృద్ధికి అభ్యున్నతికి కట్టుబడి ఉందని, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల విద్య, సంక్షేమం, సాధికారతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. హాస్టళ్ల ఆధునికీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, సిసి కెమెరాలను, బయోమెట్రిక్ హాజరు వ్యవస్థలు, డిజిటల్ మానిటరింగ్ మెకానిజమును ఏర్పాటు చేయాలన్నారు.

## ఓటు హక్కు వినియోగానికి..
## 12 ప్రత్యామ్నాయ ఫొటో గుర్తింపు కార్డులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికలో ఓటు హక్కు వినియోగానికి ఓటరు జాబితాలో పేరు ఉన్న వారు తప్పనిసరిగా ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్) లేని పక్షంలో దాని బదులుగా 12 రకాల గుర్తింపు కార్డులు చూపిస్తే సరిపోతుంది. వీటిలో ఫొటో గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి చూపినప్పటికీ ఓటు వేయవచ్చని జిహెచ్ఎంసి కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్ తెలిపారు. నవంబర్ 11న జరగనున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఓటర్లు ఈ క్రింది గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపించవచ్చని ఆయన వివరించారు. ఆధార్ కార్డు, ఉపాధిహామీ జాబ్ కార్డు, బ్యాంకు లేదా తపాల కార్యాలయం జారీ చేసిన ఫోటో పాస్‌బుక్, కేంద్ర కార్మికశాఖ జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు లేదా ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డ్ డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ (ఎన్‌పిఆర్) కింద ఆర్‌జిఐ జారీ చేసిన స్మార్ట్ కార్డు, భారతీయ పాస్‌పోర్ట్, ఫొటోతో కూడిన పెన్షన్ పత్రం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పిఎస్‌లు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఉద్యోగ గుర్తింపు కార్డు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జారీ చేసిన అధికారిక ఐడి కార్డు, కేంద్ర సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వ శాఖ జారీ చేసిన యూనిక్ డిజేబుల్ ఐడి కార్డు (యుడిఐడి), ఓటరు జాబితాలో పేరు ఉన్నప్పటికీ, ఎపిక్ కార్డు లేకపోయినా పై 12 గుర్తింపు పత్రాల్లో ఏదో ఒకటి చూపి తమ ఓటు హక్కు వినియోగించుకోవచ్చని ఆర్.వి. కర్ణన్ స్పష్టం చేశారు.

**బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌ల విషయంలో..**
## కాంగ్రెస్ బాధ్యత వహించాలి

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసిలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్‌ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. బిజెపి బిసిలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తోందన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్ రావు అధ్యక్షతన, జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికలకు సంబంధించి భాగ్యనగరంలోని 8 జిల్లాల ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిలను కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌లు మోసం చేశాయని విమర్శించారు. బిజెపితోనే బిసిలకు న్యాయం జరుగుతుందనే నిర్ణయానికి ప్రజలు కూడా వచ్చారన్నారు.

**జూబ్లీహిల్స్ గెలిపించి ప్రధాని మోదీకి గిఫ్ట్ ఇవ్వాలి..**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బిజెపి విజయం సాధిస్తుందని, ప్రజలు బిజెపిని ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బిజెపిని గెలిపించి, ప్రధాని నరేంద్ర మోదీకి గిఫ్ట్ ఇవ్వాలని రాంచందర్ రావు అన్నారు. గత బిఆర్‌ఎస్ పాలనలో హైదరాబాద్ నగరాన్ని వరల్డ్ సిటీగా తీర్చిదిద్దుతామని చెప్పి, విషాదనగరంగా మార్చిందని విమర్శించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నగర అభివృద్ధిని కనుమరుగు చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీలు హైదరాబాద్ నగరాన్ని నిర్లక్ష్యం చేశాయన్నారు. మజ్లిస్‌తో చీకటి ఒప్పందాలు కుదుర్చుకుని ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయని రాంచందర్ రావు విమర్శించారు. ఇటీవల ముస్లిం ఖబ్రస్తాన్ ఏర్పాటుకు రక్షణ శాఖ భూములను వినియోగించే ప్రయత్నం, మరోవైపు హిందూ దేవాలయాలను కూల్చడం బాధాకరమన్నారు. మరో రెండు మూడు రోజుల్లో జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు బిజెపి అభ్యర్థిని ప్రకటిస్తామని వెల్లడించారు.

## నిరుద్యోగులతో కవిత ఆడుకుంటోంది

ఎంఎల్‌సి బల్మూర్ వెంకట్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎంఎల్‌సి కవిత తన రాజకీయ జీవితం కోసం.. నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటోందని ఎంఎల్‌సి బల్మూర్ వెంకట్ ఆరోపించారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వంటా వార్పు క్రాస్ రోడ్డులో కాదు, మీ బాపు ఉన్న ఫామ్ హౌజ్ ముందు చేయని ఆయన కవితకు సలహా ఇచ్చారు. పేపర్లు అమ్ముకుని నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్న వాళ్ల ఇంటి ముందు చేయాలని కూడా తెలిపారు. ఆనాడు నిరుద్యోగులకు అన్యాయం జరిగినప్పుడు కవిత ఏం చేసింది, ఎక్కడుంది అని దుయ్యబట్టారు. కనీసం నిరుద్యోగుల కోసం ఒక్క మాట మాట్లాడని కవిత..ఇప్పుడు వారికోసం దీక్షలు చేస్తాననడం విడ్డూరంగా ఉందని అన్నారు. నిరుద్యోగుల కోసం ఆనాడు పోరాడింది మేమే..ఈనాడు వారికి న్యాయం చేస్తున్నది మేమే అని బల్మూర్ వెంకట్ స్పష్టం చేశారు. నోటిఫికేషన్లు రాకా, వేసిన నోటిఫికేషన్లను కోర్టు కేసుల్లో ఇరికించి, నిరుద్యోగులతో చెలగాటం ఆడినప్పుడు కవిత ఎక్కడుందని ప్రశ్నించారు. కవిత మాయలో నిరుద్యోగులు పడొద్దని ఆయన తెలిపారు. కోచింగ్ సెంటర్ల యజమానులు కొందరు కవితతో కలిసి రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికే 60 వేలకుపైగా పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసిందని గుర్తు చేశారు.

# జూబ్లీహిల్స్ ఆశావహులకు కాంగ్రెస్ బుజ్జగింపులు

రంగంలోకి దిగిన రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్

మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల అభ్యర్థిగా నవీన్ యాదవ్‌ను కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన విషయం తెల్సిందే. అయితే టికెట్ కోసం ప్రయత్నించిన ఇతర నేతలను బుజ్జగించే పనిని కాంగ్రెస్ అధిష్టానం మంత్రులకు అప్పగించింది. టికెట్ ప్రయత్నించిన పలువురు నేతల ఇళ్లకు నేరుగా వెళ్లి బుజ్జగింపు ప్రయత్నాలను మంత్రులు చేశారు. టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపి ఎం.అంజన్‌కుమార్ యాదవ్ నివాసానికి ఎఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, ఎఐసిసి కార్యదర్శి విశ్వనాథన్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిలు వెళ్లారు. అంజన్ కుమార్ యాదవ్‌తో వారు చర్చించారు. భవిష్యత్‌లో మంచి అవకాశాలు కల్పిస్తామని మీనాక్షి నటరాజన్, మంత్రులు అంజన్ కుమార్ యాదవ్‌కు హామీనిచ్చారు. అలాగే జూబ్లీహిల్స్ కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నించిన మాజీ కార్పొరేటర్ మురళి గౌడ్, కార్పొరేటర్లు బాబా ఫసియుద్దీన్, సి.ఎన్.రెడ్డిల నివాసాలకు మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, ఎఐసిసి కార్యదర్శి విశ్వనాథన్‌లు వెళ్లారు. వారికి భవిష్యత్‌లో సముచిత స్థానం కల్పిస్తామని, జూబ్లీహిల్స్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయానికి తమవంతు సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపిక విషయమై పార్టీ అధిష్ఠానం అందరిని సంప్రదించిన తర్వాతనే నిర్ణయం తీసుకుంటుందన్నారు. జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేయాలన్న ఆలోచన మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్‌కు ఉన్నప్పటికీ, ప్రస్తుత రాజకీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పార్టీ టికెట్‌ను మరో అభ్యర్థికి కేటాయించిందని తెలిపారు. ఎఐసిసి ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రి వివేక్ కలిసి అంజన్‌కుమార్ యాదవ్ నివాసానికి వచ్చి, ఆయనతో భవిష్యత్ రాజకీయాలపై చర్చించామన్నారు. అంజన్ కుమార్ యాదవ్ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడని, రెండుసార్లు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, రెండు సార్లు పార్లమెంట్ సభ్యుడిగా విశేష సేవలు అందించారని ఆయన గుర్తుచేశారు. కరోనా కాలంలో ఆయన చేసిన సేవా కార్యక్రమాలను మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీకి అంజన్ కుమార్ యాదవ్ పెద్ద దిక్కుగా నిలిచారన్నారు. ఆయన నాయకత్వంలో నగరంలో పార్టీ మరింత బలపడిందన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పార్టీ నిర్ణయాలు తీసుకుంటుందని మంత్రి ప్రభాకర్ అన్నారు. ఎన్నికల్లో అంజన్ కుమార్ యాదవ్ నేతృత్వంలో అందరం కలిసి పనిచేస్తామన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అంజన్ కుమార్ యాదవ్ ముషీరాబాద్‌లో గెలిచి నట్లయితే మంత్రి అయ్యేవారన్నారు.



## బీహార్‌లో రాజకీయ లబ్ధికోసమే

కాంగ్రెస్ బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌ల డ్రామా

బిజెపి రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బీహార్ ఎన్నికల్లో రాజకీయ లాభం కోసం రాహుల్ గాంధీ ఒత్తిడికి లొంగి బిసి రిజర్వేషన్‌ల పేరుతో డ్రామాలు ఆడారని, తుదింగా బిసి వర్గాలను వంచారని బిజెపి రాజ్యసభ సభ్యుడు, ఒబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ విమర్శించారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ అసలు ముఖం బయటపడిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బిసి సమస్యల పట్ల చిత్తశుద్ధి లేకుండా ఉన్నదన్నారు. రాజ్యాంగపరమైన, శాస్త్రీయమైన ప్రక్రియను విస్మరించి ఆర్డినెన్స్, జిఓల పేరుతో కాలయాపన చేస్తూ, కులాల మధ్య వివక్షను రెచ్చగొట్టే దిశగా పని సాగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వే డేటాను పబ్లిక్ డొమెన్‌లో ఎందుకు విడుదల చేయకపోతున్నదో, ప్రజల సూచనలు ఎందుకు తీసుకోలేదో అనే అంశాలను కాంగ్రెస్ సమాధానం ఇవ్వాలన్నారు. ట్రిపుల్ టెస్ట్, ఎంపిరికల్ డేటా విధానాల్లో ప్రభుత్వం విఫలమైందని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలు కూడా విస్మరించిందని విమర్శించారు. బిసి సంఘాలు, నాయకులు, యువత ఐకమత్యంతో తమ హక్కుల కోసం ఒకటై పోరాడాలని, బిజెపి బిసి వర్గాలకు అండగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు వీరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్‌ల కోసం..
# 13న జాతీయ రహదారుల దిగ్బంధం

బిసి రిజర్వేషన్లపై నేడు అఖిలపక్ష..

బిసి సంఘాల సంయుక్త సమావేశం

బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఓ నెంబర్ 9 ద్వారా పెంచిన బిసి రిజర్వేషన్‌లపై రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన స్టే ఆదేశాలను నిరసిస్తూ ఈ నెల 13న రాష్ట్రవ్యాప్తంగా జాతీయ రహదారుల దిగ్బంధం చేపట్టనున్నట్లు బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రకటించారు. హైదరాబాద్ సచివాలయం మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ బిసి రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ కల్పించాలన్న ప్రధాన డిమాండ్‌తో రాష్ట్రవ్యాప్తంగా బిసి ఉద్యమాన్ని ఉధృతం చేయనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో 11వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లోని కళింగ భవన్‌లో అఖిలపక్ష పార్టీలు, బిసి సంఘాలు, కుల సంఘాలు, మేధావులు, సామాజిక తత్వవేత్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. బిసి రిజర్వేషన్ల రక్షణ కోసం, తదుపరి ఉద్యమ దిశలో కార్యాచరణను ఈ సమావేశంలో నిర్ణయించి, ప్రకటిస్తామని తెలిపారు. బిసి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న వారిని ఎండగడుతూ, హైకోర్టు స్టేను తీవ్రంగా నిరసిస్తున్నామని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో, నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు, రాస్తారోకోలు, దిష్టిబొమ్మల దహనాలు వంటి ఆందోళనలు నిర్వహించామన్నారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద, ఉస్మానియా యూనివర్సిటీలో కూడా పెద్దఎత్తున నిరసనలు జరిపినట్లు తెలిపారు. ఇది ఆరంభం మాత్రమేనని, శనివారం నుంచి బిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి, బిసిల శక్తిని చూపిస్తామ శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు, బిసి మహిళా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బర్ల మని మంజరి సాగర్, బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గౌడుగు మహేష్ యాదవ్, గూడూరు భాస్కర్ మేరు, నరసింహ, తారకేశ్వరి, సమత యాదవ్, సంధ్యారాణి, గౌతమి, శారద, లావన్య పాల్గొన్నారు.



## 14న రాష్ట్ర బంద్

హైకోర్టు స్టేతో బిసిలకు అన్యాయం

42శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలకెళ్లాలి

మీడియా సమావేశంలో బిసి నేతలు

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** బిసిలకు 'స్థానికం'లో 42శాతం రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జి.ఒ.9పై హైకోర్టు స్టే విధించడాన్ని నిరసిస్తూ మిలియన్‌మార్చ్ తరహాలో ఈనెల 14న నిర్వహించ తలపెట్టిన రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని బిసి సంక్షేమ, ఉద్యోగ, మహిళా సంఘాలు, రాజకీయ నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బిసి ఉద్యమానికి ఒక స్వరూపం వచ్చే సమయం ఆసన్నమైందన్నారు. బిసి రిజర్వేషన్ వ్యతిరేకులు కోర్టులను వేదికగా చేసుకొని బిసిల నోటికాడి ముద్దను అడ్డుకొంటున్నారని మండిపడ్డారు. కోర్టులు కూడా బిసిలకు న్యాయం చేయడం లేదని వాపోయారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు స్టేపై రివ్యూ కోరాలని కోరారు. శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి మాట్లాడుతూ గత 75 ఏళ్లుగా బిసిల రాజ్యాధికారానికి ఆధిపత్య కులాలు, పాలకవర్గాలు అడ్డుపడటం దుర్మార్గమన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని, అవసరమైతే ఢిల్లీలో పోరాటాలకు సిద్ధంగా ఉండాలని కోరారు. సమావేశంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్, రామ్మూర్తిగౌడ్, వేముల రామకృష్ణ, నందగోపాల్, మోదీ రామ్ దేవ్, పగిళ్ల సతీశ్, జిల్లపల్లి అంజి, భూపేష్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.




## కల్తీ లేని 'నయా భారత్'ను నిర్మిద్దాం

'రూపాంతరన్ యాత్ర'లో వినియోగదారులకు ఆర్‌సిఎం ఎండి ప్రియాంక

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కల్తీ ఆహార పదార్థాల వల్ల ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని, కల్తీ లేని 'నయా భారత్'ను నిర్మించాలని ఆర్‌సిఎం మేనేజింగ్ డైరెక్టర్ ప్రియాంక అగర్వాల్ వినియోగదారులకు పిలుపునిచ్చారు. ఆర్‌సిఎం రజతోత్సవాల సందర్భంగా కల్తీ లేని దేశీయ ఉత్పత్తులపై వినియోగదారులలో అవగాహన కల్పించే లక్ష్యంతో గత నెల 16న ప్రారంభించిన 'రూపాంతరన్ యాత్ర' శుక్రవారం హైదరాబాద్ చేరుకుంది. ఈ యాత్రకు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఆర్‌సిఎం తెలంగాణ ఇన్‌చార్జీ దిలీప్‌కుమార్ కర్ణి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రియాంక అగర్వాల్ మాట్లాడుతూ 'రూపాంతరన్ యాత్ర' 100 రోజుల పాటు దేశ వ్యాప్తంగా 25 పట్టణాల ద్వారా 17 వేల కిలోమీటర్లు కొనసాగుతుందని తెలిపారు. కల్తీ ఆహారాల వల్ల ప్రజలు ఆరోగ్యాలను పాడుచేసుకుంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఆర్‌సిఎం కల్తీలేని దేశవాళి ఆహార పదార్థాలను తయారు చేస్తుందన్నారు. వీటిపై ప్రతి మహిళను చైతన్యవంతం చేస్తామన్నారు. బిస్కెట్స్ నుంచి వంట నూనె వరకు అన్ని సరుకులు కల్తీ లేకుండా తమ వద్ద లభిస్తాయన్నారు. తమ సంస్థ సిల్వర్‌జుబ్లీ ఉత్సవాల సందర్భంగా రక్తదాన శిబిరం కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. దేశ వ్యాప్తంగడా తమ సంస్థకు 10 వేల విక్రయ కేంద్రాలు ఉన్నాయని రానున్న రోజుల్లో వీటిని పెంచుతామన్నారు. మహిళా సాధికారత కోసం కూడా తమ సంస్థ పాటుపడుతుందన్నారు. తెలంగాణలో తమ కంపెనీ విస్తరిస్తుందని, సంస్థ అందిస్తున్న అధిక నాణ్యత గల ఉత్పత్తులకు మంచి డిమాండ్ పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌సిఎం ప్రతినిధులు ముఖేష్ కొటారీ, అత్రి తదితరులు పాల్గొన్నారు. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన ఆర్‌సిఎం స్టాల్స్ సభికులను ఆకట్టుకున్నాయి.



## దేశవ్యాప్తంగా కార్నివల్స్‌కు శ్రీకారం

శ్రేయాస్ మీడియా ఫౌండర్ గండ్ర శ్రీనివాస్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచంలోనే అతిపెద్ద ఫెస్టివల్ కార్నివల్‌గా 'విజయవాడ ఉత్సవ్' గిన్నిస్ బుక్ రికార్డును నమోదు చేయడమే కాకుండా అంతర్జాతీయంగా అందరి దృష్టిని ఆకర్షించింది. లక్షలాది మందిని ఒకే వేదికపైకి తెచ్చిన ఈ అపురూప వేడుక ద్వారా శ్రేయాస్ మీడియా తన సత్తా చాటిందని శ్రేయాస్ మీడియా ఫౌండర్ గండ్ర శ్రీనివాస్ రావు తెలిపారు. ఈసారి విజయవాడ ఉత్సవ్ ద్వారా బ్రాండ్ క్రియేట్ అయిందని, దాదాపు 50 లక్షల మంది విజయవాడకు వచ్చారని, స్థానికంగా రూ.1,000 కోట్ల వ్యాపారం జరిగిందని అంచనా. విజయవాడ ఉత్సవ్లో 15 లక్షల మందికిపైగా ప్రజలు పాల్గొన్నారని ఆయన వివరించారు. మూవీ ప్రమోషన్స్, ఈవెంట్స్ కంపెనీగా 3,000 లకు పైగా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించి భారత్‌తో పాటు అమెరికా, కెనడా, యుఎఈ విస్తరించిన ఈ సంస్థ కార్నివల్స్ ద్వారా బిహు, ఓనం, గణేష్ చతుర్థి, పొంగల్, లోహ్రి, దుర్గా పూజ, సంక్రాంతి లాంటి ప్రాంతీయ పండగలకు కొత్త శోభ తేవాలని నిర్ణయించిందని తెలిపారు.




## కబడ్డీలో ఛాపియన్‌గా నిలిచిన దక్షిణ మధ్య రైల్వే


**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆల్ ఇండియా 47వ రైల్వే కబడ్డీ (మహిళల) ఛాంపియన్‌షిప్ పోటీలో దక్షిణ మధ్య రైల్వే మహిళల కబడ్డీ జట్టు విజేతగా నిలిచింది. దక్షిణ మధ్య రైల్వే జట్టు 2519 తేడాతో సౌత్ ఈస్టర్న్ రైల్వేను ఓడించి ఛాపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. ఈనెల 10 నుంచి సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో దక్షిణ మధ్య రైల్వే మహిళల జట్టు సౌత్ ఈస్టర్న్ రైల్వేను ఓడించి 47వ ఆల్ ఇండియా రైల్వే మహిళా కబడ్డీ టోర్నమెంట్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది. ఈ పోటీలో చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ 3వ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ముఖ్య అతిథిగా హాజరై దక్షిణ మధ్య రైల్వే మహిళా జట్టుకు ఛాంపియన్‌షిప్ ట్రోఫీని అందజేశారు. జట్లకు పతకాలు, సర్టిఫికెట్లను అందజేశారు. జనరల్ మేనేజర్ విజేతలను అభినందించారు. అన్ని జట్ల క్రీడా స్ఫూర్తి నిజాయితీని ఆయన ప్రశంసించారు. రైల్వే అధికారులు సత్య ప్రకాష్, పి. కోటేశ్వరరావు, సంతోష్ కుమార్ వర్మలు పాల్గొన్నారు.

## వాలీబాల్ కోచ్ వేధింపులు తాళలేక డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వాలీబాల్ కోచ్ వేధింపులు తాళ్లలేక డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం లాలాగూడ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. లాలాగూడలోని సాయిబాబా దేవాలయం సమీపంలో నివాసముంటున్న ప్రమోద్‌కుమార్ కూతురు మౌలిక (19) తార్నాక రైల్వే డిగ్రీ కళాశాలలో డిగ్రీ సెకండియర్ చదువుతుంది. అదే కళాశాలలో వాలీబాల్ కోచ్‌గా ఉన్న అంబాజీ పలుమార్లు మౌలికను వేధించసాగాడు. తనను ప్రేమించాలని మౌలికను అంబాజీ వేధించాడు. ఈ నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురైన మౌలిక ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు.



సుద్దాల హనుమంతు వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించిన సిపిఐ, ప్రజాసంఘాల నేతలు



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

### 'బుర్ఖా' మహిళలను గుర్తించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు
రంగంలోకి అంగన్‌వాడీ కార్మికులు : ఇసి

**న్యూఢిల్లీ :** బుర్ఖా లేదా పర్దా ధరించిన మహిళా ఓటర్లను గౌరవప్రదంగా గుర్తించడానికి బీహార్‌లోని పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని ఎన్నికల సంఘం శుక్రవారం తెలిపింది. 'పుర్దానాషీన్' (బుర్ఖా లేదా పర్దా ధరించిన) మహిళలు పాల్గొనడాన్ని ప్రోత్సహించడానికి, వారి గోప్యతను నిర్ధారిస్తూ మహిళా పోలింగ్ అధికారులు లేదా సహాయకుల సమక్షంలో వారి గౌరవప్రదమైన గుర్తింపు కోసం పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. బీహార్ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించడానికి సోమవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో ప్రసంగించిన ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, బుర్ఖా ధరించిన ఓటర్ల గుర్తింపును ధృవీకరించడంలో సహాయపడటానికి బిహార్‌లోని అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు ఉంటారని చెప్పారు. విలేకరుల సమావేశంలో 'ఘుంగత్', బుర్ఖా ధరించిన మహిళల గురించి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ పోలింగ్ బూత్‌ల లోపల గుర్తింపు ధృవీకరణ గురించి ఎన్నికల సంఘం స్పష్టమైన మార్గదర్శకాలను కలిగి ఉందని, వాటిని కచ్చితంగా పాటిస్తామని కుమార్ అన్నారు.

## బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు
# తొలివిడత నోటిఫికేషన్ జారీ

సీట్ల పంపకాలపై ఎన్‌డిఎ, ఇండియా కూటమిలో అనిశ్చితి



**పాట్నా :** బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు రెండవ విడతల్లో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో తొలి విడత పోలింగ్ జరిగే 121 నియోజకవర్గాల్లో శుక్రవారం నోటిఫికేషన్ జారీ అయింది. దీంతో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. నవంబరు 6న పోలింగ్ జరగనుంది. అయితే ఇంకా సీట్ల పంపకాలపై ఎన్‌డిఎ, ఇండియా కూటమిలో అనిశ్చితి నెలకొంది. ఈ రెండు కూటములు కూడా సీట్ల పంపకాలు పూర్తి చేసి అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. మారుతున్న రాజకీయ సమీకరణాలు, గెలుపు ఆధారంగా బీహార్‌లో ముందస్తు ఎన్నికల పొత్తులను ఖరారు చేయడం, సీట్ల పంపకాలు చేయడం ఎంత కష్టతరంగా మారిందో ఈ పరిస్థితి చూస్తే అర్థమవుతోంది. ఎన్‌డిఎ అంతర్గత సీట్ల పంపకాల ఏర్పాటు ఒకటి రెండు రోజుల్లో ఖరారు అయ్యే అవకాశం ఉందని బిజెపి వర్గాలు సూచిస్తున్నాయి.
ఆ తర్వాత పార్టీ అభ్యర్థుల మొదటి జాబితాను విడుదల చేయాలని యోచిస్తోంది. ఎన్‌డిఎ కీలక మిత్రపక్షమైన జెడియు కూడా త్వరలో అభ్యర్థుల జాబితాను ప్రకటించే అవకాశం ఉందని పార్టీ అంతర్గత వర్గాలు తెలిపాయి. అయితే కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జన శక్తి పార్టీ (రామ్ విలాస్) 45 సీట్లు డిమాండ్ చేస్తుండగా, ఎన్‌డిఎ 20 నుంచి 22 సీట్లు ఆఫర్ చేసినట్లు సమాచారం. సీట్ల పంపకాలపై శుక్రవారం చర్చలు జరిగాయి. సీట్లను ఖరారు చేయడానికి, కొత్త అభ్యర్థుల జాబితాను సిద్ధం చేయడానికి బిజెపి బిహార్ ఇన్‌చార్జి ధర్మేంద్ర ప్రధాన్ పాట్నాకు వచ్చారు. బిజెపి 101–102 సీట్లలో, జెడి(యు) 102–103 సీట్లలో, ఎల్‌జెపి (ఆర్‌వి) 23–25 సీట్లలో, ఎల్‌జెపి 20–23 సీట్లలో పోటీ చేసే అవకాశం ఉన్నందున ఎన్‌డిఎ త్వరలో ఒక ఒప్పందానికి రావచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే హెచ్‌ఎఎం, ఆర్‌ఎల్‌ఎం రెండింటికీ చెరో 7 సీట్లు కేటాయించే అవకాశమున్నట్లు తెలిసింది. రెండు ప్రధాన కూటములతో కొనసాగుతున్న అనిశ్చితి మధ్య, ప్రశాంత్ కిషోర్ కొత్తగా ఏర్పడిన రాజకీయ సంస్థ జాన్ సూరాజ్ గురువారం 51 మంది అభ్యర్థుల జాబితాను ప్రకటించి ప్రచారంలో దూసుకుపోతుంది. ఢిల్లీలో, బిహార్ బిజెపి సీనియర్ నేత, హోం వ్యవహారాల సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ వరుసగా రెండవ రోజు చిరాగ్ పాశ్వాన్‌తో సమావేశమయ్యారు. చర్చలు సానుకూల దిశలో సాగాయన్నారు.
అధికార, ప్రతిపక్ష శిబిరాల్లో కొనసాగుతున్న గందరగోళం ప్రాంతీయ రాజకీయ ఆకాంక్షలు, ముఖ్యంగా కుల ఆధారిత మద్దతుపై ఎక్కువగా ఆధారపడిన చిన్న పార్టీల మధ్య పెరుగుతున్న దాంతో ముడిపడి ఉంది.
ఈ ఆశయాలు బిహార్‌లో కూటమి రాజకీయాలను క్లిష్టతరం చేస్తున్నాయని స్థానిక రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ప్రతిపక్ష కూటమిలో ఆర్‌జెడి 135–140 సీట్లలో పోటీ చేసే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ పార్టీ 70 అసెంబ్లీ సెగ్మెంట్లకు డిమాండ్ చేయగా, 50–52 సీట్లను మాత్రమే ఆర్‌జెడి ఆఫర్ చేసింది. పార్టీ తన అభ్యర్థుల జాబితాను ఖరారు చేయడానికి పాట్నాలో పార్టీ సీనియర్ నాయకుల సమావేశం జరుగుతుందని ఆర్‌జెడి వర్గాలు తెలిపాయి. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో, కాంగ్రెస్ 70 సీట్లలో పోటీ చేసింది కానీ 19 మాత్రమే గెలుచుకుంది. ఇండియా కూటమిలోని మరో పెద్ద పార్టీ అయిన కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్‌లెనినిస్ట్) లిబరేషన్ కూడా తనకు 20–25 సీట్లు ఆఫర్ చేయడం పట్ల అసంతృప్తిగా ఉంది. ఐదు సంవత్సరాల క్రితం, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ తాను పోటీ చేసిన 19 సీట్లలో 12 సీట్లు గెలుచుకుంది.
ఈసారి 40 సీట్లను డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. మొదటి దశ పోలింగ్ పాట్నా, దర్భంగా, మాధేపురా, సహర్సా, ముజఫర్‌పూర్, గోపాల్‌గంజ్, సివాన్, సరన్, వైశాలి, సమస్తిపూర్, బెగుసరాయ్, లఖిసరాయ్, ముంగేర్, షేక్‌పురా, నలంద, బక్సర్, భోజ్‌పూర్ వంటి కీలక జిల్లాల్లో జరగనున్నాయి.

# విద్యుత్ రంగ ప్రైవేటీకరణను తక్షణం విరమించాలి

కేంద్ర కార్మిక సంఘాల డిమాండ్



**న్యూఢిల్లీ :** బిజెపి పాలిత ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలో విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే చర్యలను కేంద్ర కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ప్రైవేటీకరణ ప్రయత్నాల్ని నిరసిస్తూ ఆయా రాష్ట్రాల్లో విద్యుత్ ఉద్యోగులు చేపట్టిన పోరాటానికి కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు వేదిక ఉమ్మడి ప్రకటన విడుదల చేసింది. విద్యుత్ ఉద్యోగ సంఘాల న్యాయబద్ధ కోర్కెలను మహారాష్ట్ర ప్రభుత్వం తక్షణం ఆమోదించాలని డిమాండ్ చేసింది. ప్రస్తుతం మహారాష్ట్ర విద్యుత్ రంగ ఉద్యోగులు, ఇంజనీర్లు, అధికారుల ఉమ్మడి కార్యాచరణ కమిటీ పిలుపు మేరకు చేపట్టిన 72 గంటల రాష్ట్రవ్యాప్త సమ్మెకు మద్దతు తెలిపింది. ప్రభుత్వ యాజమాన్యంలోని విద్యుత్ సంస్థల్లో పనిచేసే లక్ష మంది విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్లు మహారాష్ట్ర ప్రభుత్వం, మూడు విద్యుత్ సంస్థల యాజమాన్యం తీసుకున్న ప్రైవేటీకరణ చర్యలను వ్యతిరేకిస్తూ అక్టోబర్ 09 నుండి 11 వరకు రాష్ట్రవ్యాప్తంగా 72 గంటల పాటు సమ్మె చేపట్టారు. విద్యుత్ రంగంలోని 7 ప్రధాన సంఘాలు... మహారాష్ట్ర స్టేట్ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ ఫెడరేషన్, మహారాష్ట్ర వీజ్ కామ్‌గర్ మహాసంఘ్, మహారాష్ట్ర వీజ్ కామ్‌గర్ కాంగ్రెస్, సబార్డినేట్ ఇంజనీరింగ్ అసోసియేషన్, మహారాష్ట్ర రాజ్య మగస్వర్గియ విద్యుత్ కర్మచారి సంఘటన్, మహారాష్ట్ర రాజ్య స్వాభిమాని విద్యుత్ వర్కర్స్ యూనియన్, తాంత్రిక్ కామ్‌గర్ యూనియన్ సమ్మెలో చేరాయి. మొత్తం ఉద్యోగుల్లో 80% కంటే ఎక్కువ మంది సమ్మెలో ఉన్నారు. సమ్మె ప్రభావం ఉత్పత్తి, సరఫరా, పంపిణీ విభాగాల్లో అధికంగా ఉంది. జాయింట్ యాక్షన్ కమిటీ ఆగస్టులో ముఖ్యమంత్రి, ఇంధన మంత్రి, మూడు విద్యుత్ కంపెనీల చైర్మన్లకు సమ్మె నోటీసు జారీ చేసినప్పటికీ వారు ఉద్దేశపూర్వకంగా చర్చలను ఆలస్యం చేయడానికి ప్రయత్నించారని ...దీంతో యూనియన్లు సమ్మె నోటీసు జారీ చేయాల్సి వచ్చిందని... అక్టోబర్ 6న ముంబైలో జరిగిన చర్చలు ఎటువంటి పరిష్కారానికి రాకపోవడంతో యూనియన్లు 72 గంటల సమ్మె ప్రకటించాయని ఉమ్మడి ప్రకటన వెల్లడించింది. విద్యుత్ పంపిణీ సంస్థలోని 24 డివిజన్లను అదానీ, టొరెంట్ కంపెనీకి అప్పగించడాన్ని విద్యుత్ ఉద్యోగ, కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి.
ప్రైవేట్ సంస్థలకు 329 విద్యుత్ సబ్ స్టేషన్‌లను, ట్రాన్స్‌మిషన్ సంస్థకు చెందిన రూ. 200 కోట్లు, అంతకంటే ఎక్కువ విలువైన ప్రాజెక్టులను ప్రైవేట్ పార్టీలకు అప్పగించడం, ట్రాన్స్‌మిషన్ కంపెనీని షేర్ మార్కెట్‌లో జాబితా చేయడం వంటి చర్యల్ని తీవ్రంగా నిరసిస్తున్నాయి. కాంట్రాక్ట్, అవుట్‌సోర్స్ కార్మికులను క్రమబద్ధీకరించాలని, పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని, అన్ని రిజర్వేషన్ పోస్టులను భర్తీ చేయాలని, డిస్ట్రిబ్యూషన్ కంపెనీలో పునర్నిర్మాణ ప్రక్రియను ఏకపక్షంగా అమలు చేయడాన్ని ఆపాలని డిమాండ్ చేస్తున్నాయి. కాగా గురువారం నాగ్‌పూర్‌లో సమ్మె చేస్తున్న ఉద్యోగులు, ఇంజనీర్లు భారీ ప్రదర్శన నిర్వహించి చీఫ్ ఇంజనీర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అదేవిధంగా ముంబై, కళ్యాణ్‌లలో భారీ ప్రదర్శనలు జరిగాయి. జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు అందరూ ప్రసంగించారు.
ప్రైవేటీకరణ ప్రయత్నాలను విరమించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. యూపీ ప్రభుత్వం ప్రైవేటీకరణ ప్రయత్నాలకు వ్యతిరేకంగా గత 300 రోజులకు పైగా యూపీ రాష్ట్ర విద్యుత్ కార్మికులు పట్టుదలతో చేస్తున్న పోరాటాన్ని కేంద్ర కార్మిక సంఘాలు ప్రశంసించాయి.

# మరియా కోరీనాకు నోబెల్ 'శాంతి'

**ఓస్లో :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ, ప్రతిష్టాత్మక నోబెల్ శాంతి బహుమతి వెనెజులా ప్రతిపక్ష నేత, గతంలో అధ్యక్ష పదవికి పోటీపడిన మరియా కోరీనా మచాడోకు దక్కింది. నోబెల్ కమిటీ నిర్ణయాన్ని స్వీడిష్ అకాడెమీ ప్రకటించింది. నియంతృత్వ పాలన కింద ఉన్న వెనెజులాను ప్రజాసామ్య దేశంగా మార్చేందుకు ఆమె శాంతియుత పోరాటం సాగించారు. ఈ క్రమంలో ఆమె ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారు. లెక్కలేనన్ని బెదిరింపులు వచ్చినప్పటికీ మరియా తన ప్రయత్నాలను మానలేదు. గత ఏడాది కాలంగా ఆమె అజ్ఞాతంలోనే ఉంటున్నారు. వెనెజులాలో సైనిక పాలనను వ్యతిరేకించి, శాంతియుత మార్గంలో ప్రజాస్వామ్య వ్యవస్థ కోసం కృషి చేస్తున్న ఎంతో మందికి మరియా స్ఫూర్తినిస్తున్నారని నోబెల్ కమిటీ ప్రశంసించింది. 2002లో రాజకీయాల్లోకి ప్రవేశించిన ఆమె, 2011 నుంచి 2014 వరకు వెనెజులా జాతీయ అసెంబ్లీ సభ్యురాలిగా వ్యవహరించారు. 2012లో వెనెజులా అధ్యక్ష పదవికి పోటీచేసి ఓడిపోయారు. ప్రస్తుతం ప్రతిపక్ష నేతగా, ప్రజల్లో ప్రజాస్వామ్యంపై ఉత్తేజపరుస్తున్నారు. కాగా, ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి కోసం మొత్తం 338 నామినేషన్లు వచ్చాయి. అనేకానేక పరిశీలనలు, సమీక్షలు, వడపోతల అనంతరం అకాడెమీ సభ్యులు మరియాను ఎంపిక చేశారు. మొత్తం మీద 1901 నుంచి ఇప్పటివరకు నోబెల్ శాంతి బహుమతిని 105 సార్లు ప్రకటించారు. 111 మంది వ్యక్తులు, 31 సంస్థలు ఈ పురస్కారాన్ని అందుకున్నాయి. గతేడాది హిరోషిమా, నాగసాకిల్లో అణుదాడి నుంచి బయటపడిన బాధితుల పక్షాన పోరాడుతున్న జపాన్‌కు చెందిన నిహాన్ హిడాంక్యో సంస్థకు నోబెల్ శాంతి పురస్కారం దక్కింది. ఈ అవార్డు అందుకున్న అతిపిన్న వయస్కురాలిగా పాకిస్థాన్‌కు చెందిన హక్కుల కార్యకర్త మలాలా యూసఫ్‌జాయ్ నిలువగా, జోసెఫ్ రాట్‌బ్లాట్ 86 ఏళ్ల వయసులో దీనిని అందుకున్నారు. ఇలావుంటే, ఈనెల 6న వైద్యరంగంలో మొదలైన నోబెల్ పురస్కారాల ప్రకటన, 13వ తేదీ వరకు జరగనుంది. మంగళవారం భౌతికశాస్త్రం, బుధవారం రసాయన శాస్త్రంలో, గురువారం సాహిత్యంలో, శుక్రవారం శాంతి విభాగంలో నోబెల్ గ్రహీతల పేర్లు వెల్లడించారు. చివరగా అక్టోబర్ 13న అర్థశాస్త్రంలో ఈ పురస్కారం అందుకోనున్న వారి పేర్లను ప్రకటించనున్నారు.

**ఎనిమిది యుద్ధాలు ఆపాను : డొనాల్డ్ ట్రంప్**

భారత్–పాకిస్థాన్ యుద్ధంతోసహా తాను మొత్తం ఎనిమిది యుద్ధాలను ఆపానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఏమీ సాధించకపోయినప్పటికీ, 2009లో ఆయనకు నోబెల్ శాంతి బహుమతిని ప్రదానం చేశారని విమర్శించారు.

# దళితులు, అణగారినవర్గాలపై బెదిరింపు రాజకీయాలు!

ఇవి ప్రజాస్వామ్యానికి తీరని ముప్పు
కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** దేశంలో దళితులు, అణగారిన వర్గాలపై దాడులకు సంబంధించి బిజెపిపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా మండిపడింది. హర్యానాలో కుల వివక్ష కారణంగా ఐపిఎస్ అధికారి ఆత్మహత్య చేసుకున్నారనే ఆరోపణలపై స్పందిస్తూ ప్రస్తుత ప్రభుత్వంలో దళితులు, సమాజంలోని ఇతర బలహీన వర్గాలపై నేరాలు పెరుగుతున్నాయని, అణగారిన వర్గాలను బెదిరించడం, అణచివేయడం వంటి ఈ రాజకీయాలు ప్రజాస్వామ్యానికి తీవ్రమైన ముప్పుగా పరిణమిస్తాయని కాంగ్రెస్ పేర్కొంది. తాజా జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) నివేదికను ఉటంకిస్తూ 2013–2023 మధ్యకాలంలో దళితులపై నేరాలు 46 శాతం పెరిగాయని, ఆదివాసీలపై నేరాలు 91 శాతం పెరిగాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. ఐపిఎస్ అధికారి పురాణ్ కుమార్ ఆత్మహత్య కులం పేరుతో మానవాళిని నలిపివేస్తున్న లోతైన సామాజిక విషానికి ప్రతీక అని ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అన్నారు. 'హర్యానాలో ఐపిఎస్ అధికారిపై కుల వివక్ష, హరిఓం వాల్మీకిపై వేధింపులు, సిజెఐపై దాడి, దానిని సమర్థిస్తున్న బిజెపి మనస్తత్వం, ఆ పార్టీ పాలిత రాజస్థాన్‌లోని సవాయి మాధోపూర్ జిల్లాలో వృద్ధ దళిత మహిళ కమలా దేవి రాయ్‌గర్‌పై జరిగిన దారుణాలు.... ఘటనలన్నీ కేవలం వివిక్త ఘటనలు మాత్రమే కాదు, ఆర్‌ఎస్ఎస్–బిజెపి భూస్వామ్య మనస్తత్వానికి ప్రమాదకరమైనవి అని ఖర్గే పేర్కొన్నారు. ఈ ఘటనల గొలుసు భారత రాజ్యాంగం, సామాజిక న్యాయం, సమానత్వ ప్రాథమిక సూత్రాలపై ప్రత్యక్ష దాడి అని, దళితులు, వెనుకబడిన వర్గాలు, ఆదివాసీలు, అణగారిన వర్గాలను బెదిరించడం, అణచివేయడం అనే ఈ రాజకీయాలు ప్రజాస్వామ్యానికి తీవ్రమైన ముప్పును కలిగిస్తున్నాయన్నారు. భారతదేశంలో రాజ్యాంగం ద్వారా పరిపాలన జరుగుతుందని, ఏదైనా తీవ్రవాద భావజాలం ఆజ్ఞల ద్వారా కాదని ఖర్గే హిందీలో ఎక్స్‌లో పోస్టు చేశారు. దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీలు, సమాజంలోని ఇతర బలహీన వర్గాలు దీని భారాన్ని భరిస్తున్నారని, బిజెపి స్వంత కళ్ళజోడులో మునిగిపోతూ ఈ సమస్యలపై కళ్ళు మూసుకుని ఉందని మండిపడ్డారు. హర్యానా ఐపిఎస్ ఆత్మహత్య కులం పేరుతో మానవాళిని అణిచివేస్తున్న లోతైన సామాజిక విషానికి చిహ్నమని రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఒక ఐపిఎస్ అధికారి తన కులం కారణంగా అవమానం, అణచివేతను భరించాల్సి వచ్చినపుడు ఒక సాధారణ దళిత పౌరుడు ఎలాంటి పరిస్థితుల్లో జీవిస్తాడో ఊహించుకోండని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో రాయ్‌బరేలిలో హరిఓం వాల్మీకి హత్య, భారత ప్రధాన న్యాయమూర్తికి అవమానం, ఇప్పుడు కుమార్ మరణం అణగారిన వర్గాలపై అన్యాయం దాని పరాకాష్టకు చేరుకుందని చూపించే ఘటనలు అని ఆయన పేర్కొన్నారు. బిజెపి,ఆర్‌ఎస్ఎస్ ద్వేషం మనువాద భావజాలం సమాజాన్ని విషంతో నింపాయని, దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, ముస్లింలు క్రమంగా న్యాయం జరుగుతుందన్న ఆశను కోల్పోతున్నారన్నారు. ఈ పోరాటం కేవలం పురాణీల పోరాటం కాదు.. ఇది రాజ్యాంగం, సమానత్వం, న్యాయంపై నమ్మకం ఉన్న ప్రతి భారతీయుడి పోరాటమని గాంధీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. కుల ఆధారిత వేధింపులతో బాధపడుతున్న కుమార్ ఆత్మహత్యతో దేశం మొత్తం దిగ్భ్రాంతికి గురైందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కూడా ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు.

# నాలుగు వారాల్లోగా స్పందన తెలపండి

జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణపై
కేంద్రానికి 'సుప్రీం' ఆదేశం

**న్యూఢిల్లీ :** జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించాలంటూ దాఖలైన పిటిషన్లపై నాలుగు వారాల్లోగా స్పందన తెలపాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని కేంద్రం ఇచ్చిన హామీని త్వరగా అమలు చేయాలని విద్యావేత్త జహూర్ అహ్మద్ భట్, సామాజిక, రాజకీయ కార్యకర్త అహ్మద్ మాలిక్ పిటిషన్లు దాఖలు చేశారు. ఆర్టికల్ 370 రద్దును సమర్థిస్తూ 2023 డిసెంబర్‌లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సందర్భంగా చేసిన హామీని పిటిషనర్ల తరఫు న్యాయవాది ప్రస్తావించారు. ఈ క్రమంలోనే పిటిషన్ల దాఖలుపై కేంద్రం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందించారు. ప్రస్తుతం రాష్ట్ర హోదా పునరుద్ధరణకు సంబంధించి సంప్రదింపులు జరుగుతున్నాయని కోర్టుకు చెప్పారు. జమ్మూకశ్మీర్‌లో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహించామని, అక్కడ ప్రభుత్వం మనుగడలో ఉందని తెలిపారు. గత ఆరేళ్లుగా జమ్ముకశ్మీర్‌లో అభివృద్ధి జరిగిందని చెప్పారు. ఇది చాలా ప్రత్యేకమైన సమస్య అని, ఇందుకోసం అనేక అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కొంత మంది వ్యక్తులు కేంద్రానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారని సొలిసిటర్ జనరల్ ఆరోపించారు.

**ఆర్టికల్ 370 రద్దు :** 2019 ఆగస్టు 5న జమ్ము కశ్మీర్‌కు ప్రత్యేక హోదాను కల్పించే ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఆ రాష్ట్రాన్ని జమ్మూకశ్మీర్, లద్దాఖ్ అని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జమ్మూకశ్మీర్‌కు చెందిన పలు పార్టీలు సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. వీటిపై విచారించిన సర్వోన్నత న్యాయస్థానం 2023 డిసెంబర్ 11న ఆర్టికల్ 370 రద్దు రాజ్యాంగబద్ధమే అని తీర్పునిచ్చింది. ఆర్టికల్ 370 తాత్కాలిక ఏర్పాటు మాత్రమే గానీ శాశ్వతం కాదని, జమ్ముకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమేనని స్పష్టం చేసింది. అయితే, సెప్టెంబర్ 2024 నాటికి కేంద్రపాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని, దీంతో పాటు రాష్ట్ర హోదాను త్వరగా పునరుద్ధరించాలని ఆదేశించింది. కాగా, ఇటీవల కేంద్ర పాలిత ప్రాంతమైన లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా కల్పించాలని కోరుతూ ఆందోళనలు చేపట్టారు. లేహ్ ఏపెక్స్ బాడీ (ఎల్ఎబి) యువ విభాగానికి చెందిన 15 మంది యువత సెప్టెంబర్ 10 నుంచి 35 రోజుల నిరాహార దీక్షకు దిగారు. అయితే, వారిలో ఇద్దరి పరిస్థితి క్షీణించడంతో ఆస్పత్రికి తరలించారు. దీంతో ఎల్ఎబి యువజన విభాగం బుధవారం బంద్, నిరసనకు పిలుపునిచ్చింది. వందలాది యువత వీధుల్లోకి వచ్చి నిరసనలు చేపట్టడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

సోషల్ మీడియా ఖాతాలను సస్పెండ్, బ్లాకింగ్ కోరుతూ దాఖలైన పిటిషన్ల...

## విచారణకు 'సుప్రీం' తిరస్కృతి

**న్యూఢిల్లీ :** సోషల్ మీడియా ఖాతాల సస్పెన్షన్ , బ్లాకింగ్‌కు సంబంధించి సోషల్ మీడియా మధ్యవర్తులను నియంత్రించడానికి పాన్‌ఇండియా మార్గదర్శకాలను కోరుతూ దాఖలైన పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది.ఇద్దరు పిటిషనర్లు తమ పిటిషన్లను ఉపసంహరించడానికి అత్యున్నత న్యాయస్థానం అనుమతించింది. ఈ పిటిషనర్ల నుద్దేశించి న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస సందీప్ మెహతా ధర్మాసనం మాట్లాడుతూ తగిన ఫోరం ముందు అందుబాటులో ఉన్న ఏదైనా పరిష్కారాన్ని కోరుకునే స్వేచ్ఛ వారికి ఉ ందని చెప్పింది. పిటిషనర్ల తరపు న్యాయవాది ధర్మాసనాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ కస్టమర్లతో కమ్యునికేట్ చేయడానికి ఉపయోగించిన వారి వాట్సాప్‌ను బ్లాక్ చేశారని తెలిపారు. 'ఇతర కమ్యునికేషన్ల అప్లికేషన్లు ఉన్నాయి. మీరు వాటిని ఉపయోగించుకోవచ్చు' అని గమనించిన ధర్మాసనం పిటిషనర్ల వాట్సాప్‌ను ఎందుకు బ్లాక్ చేశారని అడిగింది. వారికి ఎటువంటి కారణం చెప్పలేదని న్యాయవాది చెప్పారు.
ఆ తర్వాత 'వాట్సాప్‌ను యాక్సెస్ చేయడానికి మీకున్న ప్రాథమిక హక్కు ఏమిటి ?' అని కూడా ధర్మాసనం ప్రశ్నించింది. రాజ్యాంగంలోని 32 ఆర్టికల్ కింద నేరుగా సుప్రీం కోర్టును ఎందుకు ఆశ్రయించారని ధర్మాసనం పిటిషనర్లను ప్రశ్నించింది.


## FORMAT C-7
(for political parties to publish in the newspapers, social media platforms & website of the party)

Information regarding individuals with pending criminal cases, who have been selected as candidates, along with the reasons for such selection, as also as to why other individuals without criminal antecedents could not be selected as candidates.

(As per the Commission's directions issued in pursuance of the Order dated 13.02.2020 of the Hon'ble Supreme Court in contempt petition (C) no. 2192 of 2018 in WP((A no.536 of 2011)

**Name of Political Party** : **INDIAN NATIONAL CONGRESS**
**Name of the Election** : **BYE ELECTION TO TELANGANA LEGISLATIVE ASSEMBLY**
**Name of State/UT** : **TELANGANA STATE**
**Name of the Constituency** : **61-JUBILEE HILLS**
**Name of the Candidate** : **V NAVEEN YADAV**

| Sl. No. | | | |
|---|---|---|---|
| 1 | **Criminal antecedents** | | |
| | a. | Nature of the offences | 1. Bribery, undue influence, or illegal inducements during elections.<br>2. Abatement of any Offence, Conducting to public mischief and criminal intimidation.<br>3. Trespass and deliberate disobedience of order.<br>4. Criminal Intimidation.<br>5. Cheating and Criminal Intimidation.<br>6. Wrongful Restraint, Criminal Intimidation.<br>7. No Knowledge about description of the Offence. |
| | b. | Case no. | 1. FIR No 655/2025,Madhura Nagar PS, 123(1), 123(2) The Representation of People Act, 1951,170,171,174 of BNS<br>2. FIR No 575/2021,Jubilee Hills PS, 109, 505(2) & 506 of IPC<br>3. FIR No 340/2021,Jubilee Hills PS, 188, 419, 420, 427, 447, 467, 468 & 471 of IPC and under Section 3 of PDPP Act<br>4. FIR No 95/2021,Jubilee Hills PS, 506 of IPC<br>5. FIR No 93/2021,Jubilee Hills PS, 420 and 506 of IPC<br>6. FIR No 55/2021,Jubilee Hills PS, 341, 506, 509 r/w 143 of IPC<br>7. CR No 395/2006,Jubilee Hills PS, 406, 420 & 506 of IPC |
| | c. | Name of the Court | 1. Summons not yet served<br>2. CC No 12608/2021,XVII ACMM, Nampally<br>3. Not Applicable<br>4. CC No 11727/2021,XVII ACMM, Nampally<br>5. CC No 10432/2021,XVII ACMM, Nampally<br>6. CC No 8134/2021,XVII ACMM, Nampally<br>7. Summons not yet served |
| | d. | Whether charges have been framed or not (Yes/No) | No |
| | e. | Date of conviction, if any | No |
| | f. | Details of punishment undergone, if any | No |
| | g. | Any other information required to be given | NIL |
| 2 | The reasons for the selection of the candidate. Selection shall be with reference to the qualifications, achievements and merit of the candidate, and not mere "winnability" at the polls (not more than 100 words) | | He is a well-educated person and also a dynamic youth leader having potentialities in solving the problems of the masses. |
| 3 | Reasons as to why other individuals without criminal antecedents could not be selected as candidates (not more than 100 words) | | As per wishes of the congress workers of the constituency. |

**T.KUMAR RAO**
Vice President
Authorized Signatory

ప్రజాపక్షం
శనివారం, 11 అక్టోబరు

## లీగల్ చిక్కుల్లో బిసి రిజర్వేషన్లు

స్థానిక సంస్థల (పంచాయతీరాజ్, పురపాలక సంఘాలు) ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (ఒబిసిలు) 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న పాలక కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలపై రాష్ట్రంలో రాజకీయ ఏకాభిప్రాయం ఉన్నట్లు పైకి కనిపిస్తున్నప్పటికీ అది పరస్పర రాజకీయ నిందల్లో, లీగల్ అవరోధాల్లో చిక్కుకోవటం విచారకరం. రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతూ ప్రభుత్వం జారీచేసిన జి.ఒ.నెం.9పై హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం గురువారం తాత్కాలిక స్టే విధించటం, ఆ జిఒను అనుసరించి పంచాయతీరాజ్ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ (8వ తేదీన హైకోర్టులో విచారణ జరిగిన తెలిసీ) జారీ చేసిన నోటిఫికేషన్నూ హైకోర్టు నిలుపుదల చేయటంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేసేందుకు చిత్తశుద్ధితో చేసిన ప్రయత్నాలన్నీ చివరి దశకు చేరి, ఇక హైకోర్టు అనుమతి మంజూరే తరువాయి అని రాష్ట్రంలోని కోట్లాదిమంది ఒబిసిలు ఆశతో ఎదురుచూస్తుండగా హైకోర్టు తాత్కాలిక స్టే పిడుగుపాటు అయింది. వారు ఆశాభంగంతో రగిలిపోతున్నారు. బిసిల నోటికాడ కొచ్చిన ముద్ద లాక్కున్నారని బిసి నాయకులు వాపోతున్నారు. బంద్‌కు కూడా సిద్ధమవుతున్నారు. అయితే నిరసన ఎవరికి వ్యతిరేకం? ప్రముఖ బిసి నాయకుడు కృష్ణయ్య బిజెపి రాజ్యసభ ఎంపిగా ఉన్నారు. ఆయన పోరాటం న్యాయంగా మోదీ ప్రభుత్వంపై ఎక్కుపెట్టాలి. రాష్ట్ర బిజెపి నాయకులేమో రాజకీయ లబ్ధికోసం కాంగ్రెస్ పార్టీపై దుమ్మెత్తిపోస్తున్నారు. ఆయనేమో గాలిలో పోరాటం చేస్తూ అన్ని రాజకీయ పార్టీల మద్దతు కోరుతున్నారు.

అన్ని రకాల రిజర్వేషన్లు 50శాతం దాటరాదని ఇందిరా సాహ్ని కేసులో సుప్రీంకోర్టు విధించిన లక్ష్మణరేఖ బిసి రిజర్వేషన్ల పెంపుదలకు ప్రధాన అవరోధం. అయితే ఆ తీర్పు విద్య, ఉద్యోగాలకే పరిమితమన్న వాదన ఉంది. అంతేగాక మోదీ ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు (ఇడబ్ల్యుఎస్) 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాజ్యాంగ సవరణ చేయటం, దాన్ని సుప్రీంకోర్టు ఆమోదించటంవల్ల లక్ష్మణరేఖ ఎప్పుడో చెదిరిపోయిందన్న వాదన ఉంది. అయినప్పటికీ బిసి రిజర్వేషన్ల పెంపుదలకు బీహార్, మహారాష్ట్ర ప్రభుత్వాల చర్యలను సుప్రీంకోర్టు అనుమతించలేదు. అయితే 60శాతంపైగా రిజర్వేషన్లున్న తమిళనాడు ఉదంతమూ ఇక్కడ ప్రస్తావనార్హం. దానికి సుప్రీంకోర్టు ఆమోదం హేతుబద్ధంగా జరిగిందా, నాటి కేంద్రప్రభుత్వంపై తమిళనాడు రాజకీయ ఒత్తిడి కింద జరిగిందా అనే భిన్నవాదనలున్నాయి. ఒబిసిలకు 27శాతం రిజర్వేషన్లు సిఫారసు చేసిన బి.పి.మండల్ కమిషన్ కూడా – ఒబిసిలు 50శాతంపైగా ఉన్నప్పటికీ సుప్రీంకోర్టు విధించిన 50శాతం లక్ష్మణరేఖకు లోబడి 27శాతం సిఫారసు చేసారు. అయితే తర్వాత కాలంలో సుప్రీంకోర్టు ఇటువంటి కొన్ని కేసుల్లో కొన్ని ప్రత్యేక సందర్భాల్లో 50 శాతం మించవచ్చని, అయితే అందుకు కొన్ని నియమాలను సంతృప్తి పరచాలని చెప్పింది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దాన్ని ఆసరా చేసుకుని కులగణన సర్వే నిర్వహించగా తెలంగాణలో బిసి కులాలవారు 57.6 శాతం ఉన్నట్లు నిర్ధారణ అయింది. దాని ప్రకారం స్థానిక ఎన్నికలు, విద్య, ఉద్యోగాల్లో ఒబిసిలకు 42శాతం రిజర్వేషన్ నిర్ణయించింది. డెడికేటెడ్ కమిషన్ నియమించింది, సబ్ కమిటీ ఏర్పాటు చేసింది, మంత్రివర్గం ఆమోదం తీసుకుంది. శాసనసభల్లో చట్టసవరణ ఆమోదించి గవర్నర్ ఆమోదం కోసం పంపింది. ఆయన నిర్ణయం తీసుకోకుండా దాన్ని రాష్ట్రపతి పరిశీలనకు పంపారు. ప్రభుత్వం ఆ తర్వాత ఆర్డినెన్స్ జారీ చేసింది. దాని ప్రకారం మళ్లీ చట్టసవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం పొందింది. శాసన ఉభయసభల్లో బిఆర్ఎస్, బిజెపి సహా అన్ని పక్షాల ఏకగ్రీవామోదం లభించింది. బిల్లుల ఆమోదంపై కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ తరపున, ప్రభుత్వం తరపున ఢిల్లీ రాంలీలామైదాన్‌లో ధర్నా నిర్వహించారు. అయినా కేంద్రప్రభుత్వంలో చలనం లేదు. అయితే శాసనసభ ఆమోదించిన బిల్లులపై గవర్నర్ ఆమోదం లేదా త్రిప్పిపంపటం మూడు నెలల్లో జరగకపోతే, రాష్ట్రపతికి నివేదించిన బిల్లులపై అక్కడనుంచి మూడు నెలల్లో సమాధానం రాకపోతే ఆ బిల్లులు ఆమోదం పొందినట్లే పరిగణించబడుతుందని తమిళనాడు గవర్నర్ వర్సెస్ రాష్ట్ర ప్రభుత్వం కేసులో సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పు ప్రకారం – తెలంగాణ అసెంబ్లీ బిల్లుకు ఆరుమాసాలు గడిచిందని లెక్కలు వేసుకుని (దాన్ని నోటిఫై చేయటం మరిచారు) రాష్ట్ర ప్రభుత్వం జిఒ 9 జారీ చేసింది. దీన్ని సవాలు చేస్తూ కొందరు హైకోర్టుకు వెళ్లగా స్టే దొరకలేదు. దానిపై వారు సుప్రీంకోర్టుకు వెళ్లగా, హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న అంశంపై తాము స్టే ఇవ్వలేమని, అందువల్ల హైకోర్టుకే వెళ్లమని వారికి సలహా ఇచ్చింది. దాని పర్యవసానమే 8,9 తేదీల్లో విచారణ.

ముస్లింల్లోని బిసి వృత్తులవారిని చేర్చారని బిజెపి మొదటినుంచీ వ్యతిరేకిస్తోంది. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధిలేదని, రాజకీయ ప్రయోజనం కోసమే బిసి రిజర్వేషన్ నాటకం ఆడుతోందని బిఆర్ఎస్ విమర్శిస్తోంది. రాజకీయ స్వలాభంతో ఇక్కడ బిఆర్ఎస్, ఢిల్లీలో బిజెపి అడ్డుపడుతున్నాయని కాంగ్రెస్ విమర్శిస్తోంది. హైకోర్టు స్టే తర్వాత కూడా ఆ పార్టీ నాయకుల పరస్పర ఆరోపణల బాణీ అదే. బిసిలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం రాజకీయ, లీగల్ పోరాటం సాగిస్తాయని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. మోదీ ప్రభుత్వం ఎపి కాంగ్రెస్ ప్రభుత్వ బిల్లును 6వ షెడ్యూల్లో చేర్చటం లేదా రాజ్యాంగ సవరణ చేయటం జరిగే పనికాదు. అందువల్ల రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎంత చిత్తశుద్ధి, నిజాయితీతో ప్రయత్నించినా ఈ వివాదం ఇప్పట్లో తేలేది కాదు. బిల్లుల ఆమోదానికి సుప్రీంకోర్టు గడువు విధించటంపై వివరణ కోరుతూ రాష్ట్రపతి పంపిన నివేదనపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ ముగిసి తీర్పు రిజర్వులో ఉంది. ఆ తీర్పు రాష్ట్ర ప్రభుత్వాలకు అనుకూలంగా రావచ్చన్న ఆశ మిణుకుమిణుకుమంటోంది. అయితే ఈ రాజకీయ, లీగల్ జగడంలో చిక్కి స్థానిక ఎన్నికలు వాయిదా పడుతూ ఉండటంవల్ల ఆ సంస్థలకు కేంద్ర నుంచి రావలసిన నిధులు ఆగిపోయి అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. అలాగే సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు జరపాలన్న హైకోర్టు తీర్పు ప్రభుత్వం మెడపై ఉంది. అందువల్ల న్యాయనిపుణులతో చర్చించి మరింత జాగుకాని రీతిలో ఏది ఉత్తమ పరిష్కారమో రాష్ట్రప్రభుత్వం దాన్ని ఎంచుకోవాలి. 42 శాతం సాధించేవరకు ఎన్నికలు జరపకపోతే నష్ట పోయేది గ్రామీణ ప్రజలు, ఎదురుదెబ్బ తగిలేది రాష్ట్ర ప్రభుత్వానికి. ఉన్నతస్థాయి లీగల్ అభిప్రాయం పొందిన తదుపరి అఖిలపక్ష సమావేశం పిలిచి వారితో అభిప్రాయాలు పంచుకోవాలి. ఇది ప్రతిష్ట కోసం పెనుగులాడాల్సిన అంశం కాదు. ఎవరి చిత్తశుద్ధి ఎంతో ప్రజలే నిర్ణయిస్తారు.

# ఆ న్యాయవాదిని వదిలేయడం న్యాయవ్యవస్థకు నష్టం

కె.రవీంద్రన్

ఈ వారం కోర్టు గదిలో ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్ తనపై బహిరంగ కవ్వింపు చర్యను గౌరవప్రదమైన నిగ్రహంతో ఎదుర్కొన్న తీరు అనేకమంది ప్రశంసలను అందుకుంది. అయితే, ఇది న్యాయ సంస్థల పవిత్రత, సంస్థాగత అధికారంపై దాడి జరిగినప్పుడు వ్యక్తిగత ఔదార్యానికి ఉన్న పరిమితుల గురించి ఒక లోతైన సంభాషణను తిరిగి రగిలించింది. 71 ఏళ్ల న్యాయవాది రాకేశ్ కిషోర్ బహిరంగ కోర్టులో ఆయనపైకి షూ విసిరినప్పుడు, ప్రధాన న్యాయమూర్తి చలించకపోవడమే కాకుండా తప్పు చేసిన ఆ న్యాయవాదిపై క్రిమినల్ చర్యలు చేపట్టడానికి కూడా నిరాకరించారు.

ఈ అసాధారణమైన సంయమనం, దయతో కూడుకున్నది, మానవత్వంతో నిండినది. ఇది దాడిచేసిన వ్యక్తి అవలంభించిన మొరటు, ధిక్కారపూరిత ప్రవర్తనకు పూర్తి విరుద్ధంగా నిలిచింది. అయినప్పటికీ, ప్రధాన న్యాయమూర్తి ప్రతిస్పందన వ్యక్తిగత మర్యాదలో స్పందించే ఈ కాలంలో, ఆయన ప్రతీకారం తీర్చుకోవడానికి నిరాకరించడం చాలా అరుదైనది, ఉత్తేజపరిచేది. చట్టం వ్యక్తుల ద్వారా తనను తాను ప్రతీకారం తీర్చుకోవాల్సిన అవసరం లేదని, తద్వారా సంస్థల బలంపై ఆయనకు ఉన్న లోతైన విశ్వాసాన్ని ఇది ప్రదర్శించింది. అయితే, ఇక్కడ ఒక వైరుధ్యం ఉంది. దేశంలోని అత్యున్నత న్యాయమూర్తి అటువంటి దాడిని సంస్థాగత నేరంగా కాకుండా వ్యక్తిగత అవమానంగా పరిగణించినప్పుడు, అది న్యాయవ్యవస్థ సమిష్టి గౌరవాన్ని దెబ్బతీసే ఒక సంప్రదాయాన్ని ఏర్పరిచే ప్రమాదం ఉంది. క్షమ అనేది వ్యక్తిగత ధర్మం, న్యాయం అనేది సమిష్టి బాధ్యత. ఉద్దేశం ఎంత గొప్పదైనా, ఈ రెండింటిని కలపడం అనవసర పరిణామాలకు దారితీయవచ్చు.

ఇక్కడ కేవలం ఒక వ్యక్తి దుష్ప్రవర్తన గురించి కాదు, అటువంటి ప్రవర్తనను సృష్టించే మనస్తత్వం గురించి ఆందోళన. రాకేష్ కిషోర్ స్వయంగా అంగీకరించినట్లుగా, ఒక దేవుడి గురించి ప్రధాన న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యపై ఆయనకు కలిగిన కోపం నుండి ఆయన చర్య వెలువడింది. ఆ వ్యాఖ్యను ఆయన అవమానకరంగా భావించాడు.



న్యాయవ్యవస్థ, దాని లోపాలెన్ని ఉన్నప్పటికీ, రాజకీయ, సైద్ధాంతిక విభాగాల అంతటా గౌరవాన్ని పొందుతున్న ఏకైక సంస్థగా అది కొనసాగుతుంది. ఇటువంటి చర్యను శిక్షించకుండా వదిలి వేయడం ఆ గౌరవాన్ని కొద్దిగానైనా కోల్పోయేలా చేస్తుంది. ఇది నిజమైన లేదా ఊహాజనిత ఫిర్యాదులు ఉన్న ఇతరులు అనుకరించడానికి ధైర్యం తెచ్చుకునే ఒక ఉదాహరణను ఏర్పరుస్తుంది.

అత్యున్నత ప్రమాణాలను ప్రతిబింబిస్తున్నప్పటికీ, ఇటువంటి సంఘటనలను కేవలం వ్యక్తిగత అవమానాలుగా పరిగణించాలా లేక న్యాయ సంస్థపై ప్రత్యక్ష దాడులుగా పరిగణించాలా అనే దాని గురించి ఇబ్బందికర ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

బరితెగింపుతో కూడిన ఈ సంఘటన, న్యాయవ్యవస్థ మర్యాద హృదయాన్ని తాకింది. కోర్టు గది అనేది కేవలం వాదనలు, తీర్పుల కోసమే పరిమితమైన ప్రదేశం కాదు. ఇది చట్టబద్ధ నిబంధనలకు చిహ్నం. ఆ ప్రదేశంలోనే ఉల్లంఘన జరిగితే, అదీ కూడా ప్రత్యేకించి దాని గౌరవాన్ని కాపాడుతానని ప్రమాణం చేసిన న్యాయవాదే ఉల్లంఘనకు పాల్పడినప్పుడు, నష్టం కేవలం వ్యక్తిగతం లేదా సంకేతాత్మకం కాదు, అది వ్యవస్థాగతమైనది. ప్రధాన న్యాయమూర్తిపైకి బూటు విసరడం ద్వారా, కిషోర్ కేవలం ఒక వ్యక్తిని అవమానించలేదు, ఆయన న్యాయవ్యవస్థ నైతిక, విధానపరమైన అధికారంపై దాడి చేశాడు. న్యాయవాది చెప్పుకున్నట్లుగా, ఆ చర్య కేవలం నిరసన వ్యక్తీకరణ కాదు, ఇది సంస్థ పవిత్రతను ఉద్దేశపూర్వకంగా భంగపరచడం. ఈ కోణంలో చూస్తే, ప్రధాన న్యాయమూర్తి క్రిమినల్ చర్యను చేపట్టడాన్ని నిరాకరించడం, ఉద్దేశపూర్వకంగా కాకపోయినా, ఈ దాడి తీవ్రతను తగ్గించినట్లుగా అనిపించవచ్చు.

న్యాయమూర్తి గవాయ్ చర్య క్షమాగుణం, నైతిక శక్తికి నిదర్శనం అనే వాదన దారితప్పొచ్చు. ప్రముఖులు, ప్రత్యేకించి అధికారం స్థానాలలో ఉన్నవారు తరచుగా విమర్శలకు శిక్షాత్మక ఉత్సాహంతో ప్రతిస్పందించే

మతపరమైన భావోద్వేగాన్ని న్యాయపరమైన అధికారంతో కలపడం అనేది సమకాలీన భారతదేశంలో ఆందోళన కలిగించే ధోరణికి సంకేతం. ఇక్కడ న్యాయవ్యవస్థ కూడా జనరంజక, మతపరమైన ఉద్వేగాల సుడిగుండంలోకి లాగబడుతోంది. న్యాయవాది ప్రవర్తన వ్యక్తిగత విశ్వాసం, భావోద్వేగం రాజ్యాంగబద్ధమైన అధికారులపై ధిక్కారపూరిత చర్యలను సమర్థించగలదనే విశ్వాసం ఒక ప్రమాదకరమైన అర్హత భావనను ప్రతిబింబిస్తుంది. దీనిని ఒక విడిగా బద్ధలైన వ్యక్తీకరణగా పరిగణించడం తప్పు అవుతుంది. ఇది పౌర క్రమశిక్షణ, సంస్థల పట్ల గౌరవంలో లోతైన క్షీణతను సూచిస్తుంది. దీనిని ఇలాగే వదిలేస్తే ఇతరులకు కూడా ధైర్యాన్ని ఇస్తుంది.

సంఘటన జరిగిన తర్వాత ప్రధాన న్యాయమూర్తి చలించకుండా కోర్టు విచారణలను కొనసాగించడం ప్రశంసనీయం. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజా జీవితంలో కొద్దిమంది మాత్రమే కనబరచగలిగే ఒక అరుదైన నిగ్రహాన్ని ఇది వెల్లడించింది. అయితే, వ్యక్తులలాగా కాకుండా, సంస్థలు కోపం లేదా కరుణ వంటి భావోద్వేగాల ద్వారా నడపబడటానికి వీలు లేదు. చట్ట నిబంధనలు అనేది దానిని సమర్థించే వారి వ్యక్తిగత ఔదార్యంపై కాకుండా, చట్టపరమైన నిబంధనలను స్థిరంగా, నిష్పాక్షికంగా అమలు చేయడంపై ఆధారపడి ఉంటుంది. న్యాయస్థానం అనే పవిత్ర స్థలంలో ఒక న్యాయవాది నేరపూరిత చర్యకు పాల్పడినప్పుడు, వ్యవస్థ తనకు తానుగా దృఢంగా స్పందించాలి. అలా చేయడంలో విఫలమైతే న్యాయవ్యవస్థపై మర్యాద ఐచ్ఛికం అనే అభిప్రాయాన్ని కలిగించే ప్రమాదం ఉంది.నమ్మకం పేరుతో వచ్చిన కోపానికి భావోద్వేగంలో మినహాయింపు లభించవచ్చనే అభిప్రాయాన్ని ఏర్పరుస్తుంది.

ఇటీవలి కాలంలో దేశంలో నిరసన ముసుగు వేసుకున్న దూకుడుతనంతో జరిగిన అనేక సంఘటనలలో వ్యక్తులు లేదా సమూహాలు విశ్వాసం, సిద్ధాంతం లేదా రాజకీయ ఫిర్యాదుల ఆధారంగా హింస లేదా ధిక్కారపూరిత ప్రవర్తనను సమర్థించుకుంటున్నారు. ఈ సందర్భాన్ని ప్రత్యేకంగా కలవరపరిచే అంశం ఏమిటంటే, ఇది న్యాయస్థానంలోనే జరిగింది. ఇది వివేకానికి చివరి ఆశ్రయం కావాల్సిన చోటు. న్యాయవ్యవస్థ, దాని లోపాలెన్ని ఉన్నప్పటికీ, రాజకీయ, సైద్ధాంతిక విభాగాల అంతటా గౌరవాన్ని పొందుతున్న ఏకైక సంస్థగా అది కొనసాగుతుంది. ఇటువంటి చర్యను శిక్షించకుండా వదిలి వేయడం ఆ గౌరవాన్ని కొద్దిగానైనా కోల్పోయేలా చేస్తుంది. ఇది నిజమైన లేదా ఊహాజనిత ఫిర్యాదులు ఉన్న ఇతరులు అనుకరించడానికి ధైర్యం తెచ్చుకునే ఒక ఉదాహరణను ఏర్పరుస్తుంది.

మానవత్వంతో కూడిన వాదన ఒకటి ఉంది. కిషోర్‌కు 71 ఏళ్లు, బహుశా వయస్సు, నిరాశ లేదా భావోద్వేగ అస్థిరత ఆయన ప్రవర్తనకు కారణమై ఉండవచ్చు. ప్రధాన న్యాయమూర్తి నిర్ణయం కరుణతో లేదా ఒక వృద్ధుడి తప్పుడు అంచనా కారణంగా నేరస్తుడిని చేయకూడదనే ఉద్దేశ్యంతో ప్రేరేపించబడి ఉండవచ్చు. కానీ, ఆ కరుణ జవాబుదారీతనం చట్రంలో వ్యక్తం చేయబడి ఉండవచ్చు. క్షమాభిక్ష కారణంగా పర్యవసానం లేకుండా వదిలివేయాల్సిన అవసరం లేదు. నిజానికి, ఆ రెండు సహజీవనం చేయగలవు. చట్టం దయతో కూడినప్పటికీ, ఉద్దేశం ఏదైనప్పటికీ న్యాయవ్యవస్థ పట్ల హింస, అగౌరవాన్ని సహించకూడదనే సూత్రాన్ని సమర్థించాల్సిందే.

ఏదైతేనేమి, ఈ సంఘటన బూటు విసరడం గురించి తక్కువగా, అది సూచించే విషయం ఎక్కువగా ఉంది. ఇది ప్రజల నిగ్రహం నశించడం, ఒకప్పుడు తిరుగులేని గౌరవాన్ని పొందిన సంస్థల పట్ల ధిక్కారం నెమ్మదిగా సాధారణీకరణ చెందడం గురించి. న్యాయమూర్తి గవాయి ఔదార్యం ఒక వ్యక్తిగా ఆయనకు ప్రశంసలను తెచ్చిపెట్టింది. కానీ న్యాయవ్యవస్థ తన సంస్థాగత గౌరవాన్ని ఎలా కాపాడుకోవాలనే దాని గురించి కూడా ఒక చర్చను రేకెత్తించింది. క్షమ ద్వారా హృదయాలను గెలుచుకోవచ్చు, కానీ అది వ్యవస్థ రక్షణలను నీరుగారుస్తుంది. దయతో కూడిన చర్యను సంస్థాగత బలహీనతగా పొరబడకుండా ఉండాలంటే, ఈ రెండింటి మధ్య గీతను జాగ్రత్తగా గీయాలి.

(ఐపిఎ సర్వీస్)

# విలువల విధ్వంసాన్ని ఆపేదెవరు?

పెళ్లి శాశ్వతంగా ఉండే బంధం కాదనే అభిప్రాయం ఈ మధ్య చాలామందిలో వచ్చిందేమో అని అనిపిస్తుంది. పరిసరాల ప్రభావం, నిర్లిప్త ధోరణి, దేనిపట్ల స్పందించని మనస్తత్వం, మంచి చెడులను విశ్లేషించలేకపోవడం, మరీ ముఖ్యంగా సామాజిక సమగ్రత పట్ల కనీస అవగాహన లేకపోవడం, ఎదుటి వ్యక్తుల కులం, మతం, ప్రాంతం, భాష, సంస్కృతి పట్ల ఏహ్యాభావం పెంచుకుంటున్నారు. సమాజ పురోగతికి కారణమైన మంచి మానవ సంబంధాలు లేకపోవడం, అలాగే కూలుతున్న కుటుంబ వ్యవస్థ, ఆర్థిక దిగజారుడు, నీచ సంస్కృతి, అభిప్రాయ భేధాలు, అలవాట్లు, కట్టుబాట్లు, అంతరాలు, మనుషుల మధ్య విచ్ఛిన్నానికి కారణమవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో వంధత్వం, భావోద్వేగాల అసమానతలు, ఒత్తిడి, ఆందోళన, కోపం, చిరాకు అనారోగ్య కారణాలు శాశ్వత బంధానికి ముగింపు పలుకుతున్నాయి. ఇక్కడ పెళ్లి చేసుకుని విదేశాలకు తీసుకెళ్లడం అక్కడ వారి నిజస్వరూ పం తెలియడం చేసేదేమీ లేక సర్దుకుపోవడం లేక విడాకులు తీసుకోవడం సామాన్యమైంది. స్త్రీలలో ఎక్కువగా ఫ్రిజిడిటీ లేదా లైంగిక ఆసక్తి లేకపోవడాన్ని (లైంగిక ఉదాసీనత) లేదా తగిన పరిస్థితులు లైంగిక సంతృప్తి పొందలేకపోవడానికి సూచిస్తుంది. దీన్ని 'హైపోగైనెస్మస్' అంటారు.

మానవ సంబంధాలు అంటే వ్యక్తులు ఒకరితో ఒకరు ఎలా వ్యవహరిస్తారో తెలిపే పరస్పర చర్యలు. ఇవి స్నేహం, ప్రేమ, ఆత్మీయత, ఆప్యాయత వంటి భావనలను కలిగి ఉంటాయి. పనిప్రదేశంలో సామాజిక సంబంధాలపై పరిశోధన చేసే 'హ్యూమన్ రిలేషన్స్' అనే రంగంలో, మానవ ప్రవర్తనను అర్థం చేసుకోవ డం, వ్యక్తిగత, వృత్తిపరమైన సంబంధాలను మెరుగుపరచడం పై దృష్టి పెడతారు. కుటుంబ వ్యవస్థ బాగా కొనసాగాలంటే మనమేం చేయాలి కుటుంబ వ్యవస్థను అర్థం చేసుకోవాలి. ముందుగా మనకున్న కుటుంబం గురించి తెలుసుకోవాలి. ఇంట్లో పెద్దవారిపై ఎందుకు గౌరవం కలిగి ఉండాలో తెలిసి ఉండాలి. ముఖ్యంగా ఒకరంటే ఒకరికి నమ్మకం, ఒకరి స్వభావం గురించి ఒకరికి అవగాహన కలిగి ఉంటూ, ఒకరి పై ఒకరికి సదభిప్రాయం కలిగి ఉండాలి. అప్పుడే కుటుంబ వ్యవస్థ బాగా కొనసాగాలంటే మనం ఏం చేయాలో మనకొక ఆలోచన పుడుతుంది. కుటుంబ సభ్యుల వలన ప్రయోజనం పొందుతూ, వారి గురించి ఆలోచన చేయక, ఇతర ఆలోచన ల వైపు దృష్టి సారిస్తూ, ఆసక్తికి అనుగుణంగా మసలుకోవడం మొదలుపెట్టే వ్యక్తులు కుటుంబంలో ఉంటే, అటువంటి వారి ఆలోచనలు కుటుంబ సభ్యుల ఐక్యతపై ప్రభావం చూపుతుంది. కలిసి ఉండే కుటుంబంలో ఒక సభ్యుడి ఆలోచన, మిగిలిన కుటుంబ సభ్యులపై ఉన్నప్పుడు, ఆ కుటుంబ దృక్పథం ప్రకారం అతని గురించి ఆలోచన మిగిలిన సభ్యులకు ఉంటుంది. అంటే ఈ విధమైన దృక్పథం వలన ఒకరి గురించి ఒకరికి పట్టింపు ఉంటుంది. ఒకరంటే ఒకరికి ఆప్యాయత ఉంటుంది. అయితే ఇక్కడ అహంకరించడం అనే ఆలోచన మొలకెత్తితే మాత్రం కుటుంబ సభ్యుల మధ్య సంబంధాలు మారతాయి. అంటే కుటుంబ వ్యవస్థ బాగుగా కొనసాగాలంటే, ముందుగా మనమే మన కుటుంబ సభ్యుల గురించి పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి. మాయమై పోతున్నాయి మానవ సంబంధాలు అనిపిస్తుంది.

ప్రతి రోజు కేరళ నుంచి కశ్మీర్ వరకు జరుగుతున్న ఉదంతాలు చూస్తుంటే ఇది నిజమనిపిస్తుంది. ఈ రోజుల్లో సమాజంలో భార్య భర్త విడాకులు తీసుకోవడం, అక్రమ సంబంధాలు వంటివి పెరిగాయి. నిరాదరణకు గురవుతున్న బాలికలు, మహిళల సంఖ్య ఎక్కువవుతోంది, ఇంట్లోనే వరుసకు సోదరుడు నుంచి చివరికి తండ్రి వరకు లైంగికంగా వేధిస్తున్నా ఎవరికి చెప్పుకోవాలో దిక్కుతోచని పరిస్థితి. ఆశ్చర్య మేమిటంటే, ఇది మామూలే అనే నిర్లిప్త ధోరణిని ప్రజలు వ్యక్తపరచటం. విడాకులు, అక్రమ సంబంధాల వల్ల కుటుంబ వ్యవస్థ కూలిపోవటం, భార్యాభర్తల మధ్య పరస్పర అనుమానాల వల్ల హత్యలు, ఆత్మహత్యలు, తద్వారా వారి పిల్లలు అనాథలు కావడం వంటి విషాదకర పరిణామాలు చోటుచేసుకుంటాయి. క్షణిక సుఖంకోసం అక్రమ సంబంధాలు వివాహ వ్యవస్థకే సవాల్ విసురుతున్నాయి. రెండు నెలల్లో ముగ్గురు భర్తలను మార్చిన వనిత. ప్రేమ కాదన్నందుకు పదో తరగతి అమ్మాయి తల్లిని చంపిన ఉదంతం. తల్లీ కూతురుతో అక్రమ సంబంధం పెట్టుకొని నవ వరుడిని చంపిన సంఘటన, చదువు చెప్పాల్సిన నలభై ఏళ్ల టీచర్ పదవ తరగతి అబ్బాయితో అక్రమ సంబంధం. ఇటీవల ముగ్గురు పిల్లల తల్లి(39) తన కుమార్తెతో వివాహం నిశ్చయమైన 24 సంవత్సరాల వ్యక్తితో లేచిపోయింది. హైదరాబాద్‌లో గురుమూర్తి అనే వ్యక్తి తన భార్యను అత్యంత కిరాతకంగా నరికి చంపి కుక్కర్లో ఉడకబెట్టి చెరువులో పడేశాడు. మరొక వ్యక్తి మోరీలో పడేసి సిమెంట్ తో కప్పి పడేసింది. అక్రమ సంబంధంతో సుఖపడదామని ముక్కు పచ్చలారని ముగ్గురు అబ్బాయిలను విషం ఇచ్చి చంపింది ఒక మహా తల్లి. భర్తకు కరెంటు షాకిచ్చి చంపింది ఒక ఇల్లాలు. కర్ణాటక మాజీ డిజిపి ప్రకాష్ ను అత్యంత దారుణంగా చంపింది తన భార్య. కేంద్రమంత్రి మనవరాలిని దారుణంగా హత్య చేశారు తన భర్త. రెండేళ్లు కాపురం చేశాక లవర్‌తో వెళ్లిపోయి పెళ్లి చేసుకుంది మరో యువతి. పదుల సంఖ్యలో పెళ్లిళ్లు చేసుకొని మోసంచేసిన ఘటనలు, హత్యలు కోకొల్లలు.

గతంలో ఇలాంటి వార్తలు విన్నప్పుడు ఎక్కడో జరిగింది అనుకునే వారు. కానీ ఇప్పుడు తమ సమీప ప్రాంతాల్లో ఇలాంటి నేర ప్రవృత్తి పెరిగిపోవడం దానికి పేద, ధనిక, కులం, మతం, ప్రాంతం అన్నీ సమానంగా ఉంటున్నాయి. మనిషిని అంతమొందించాలంటే ఎలా అని రోజుల కొద్దీ ఆన్లైన్ లో తర్ఫీదు పొందుతున్నారు. పనికిమాలిన పనులు చేయడానికి సాంకేతికతను ఉపయోగించుకుంటున్నారు. ఒక వ్యక్తి పరిపూర్ణమైన వ్యక్తిత్వం కలవారుగా రూపొందడంలో తల్లిదండ్రు లు, సమాజం, నేర్చుకునే విద్య, చదివే పుస్తకాలు, చేసే వృత్తి , పాటించే నైతిక విలువలు చాలా ముఖ్యమైనవి. వీటన్నిటికీ దూరమై కేవలం సోషల్ మీడియాలోనే వారి జీవితాన్ని గడుపుతూ పరిపూర్ణమైన వ్యక్తిగా రూపొందలేకపోతున్నారు. ప్రేమ, ఆప్యాయత, అనురాగాలకు దూరమవుతున్నారు. కేవలం ధనార్జనే ధ్యేయంగా బతుకుతున్నారు. సోషల్ మీడియా వల్ల అన్నీ అనర్థాలే ఉన్నాయి అని చెప్పడం నా ఉద్దేశం కాదు, కొన్ని సందర్భాల్లో ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సామాజిక మాధ్యమా ల్లో అందరూ స్పందించి వారికి సహాయం చేస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం కూడా ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాలను సమస్యల పరిష్కారానికి వాడుతుండడం గమనార్హం.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విద్యార్థులకు విషయ అవగాహన కల్పించడంకోసం కూడా సామాజిక మాధ్యమా లు ఉపయోగ పడుతున్నాయి. ఒకప్పుడు విద్యార్థులకు, ఉద్యోగులకు ఏదైనా సృజనాత్మక ఆలోచన వచ్చినప్పుడు దాని గురించి ఆలోచించి మిత్రులతో చర్చించి దానికి పరిష్కారం కనుగొనేవారు. కానీ ప్రస్తుతం ఏ సందేహం వచ్చినా ఏ ఆలోచన వచ్చినా దానికి సంబంధించి గూగుల్, యూట్యూబుల్లో వెతకడం పరిపాటిగా మారింది.

బాల్యంలోనే విద్యార్థులకు నైతిక విలువలు, మానవ సంబంధాలు, ప్రేమ, అనురాగం, ఆప్యాయతలు బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైన, వీటిని విద్యావిధానంలో చేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. విద్యార్థులను, యువకులను ధనార్జక యంత్రాలుగా కాక మానవీయత కలిగిన వారుగా, మంచి పౌరులుగా రూపొందించాల్సిన బాధ్యత సమాజంపై ఉంది. అదే రేపటి తరానికి మార్గదర్శక మవుతుంది. మంచి మానవ సంబంధాలు, ఆరోగ్య ఆహార అలవాట్లు , శారీరక శ్రమ ఉత్తమ జీవన విధానానికి ప్రేరణ అన్న విషయం ప్రజలు విస్మరించారు. అజ్ఞానం, మూఢ విశ్వాసాలు, అవివేకం, పర్యావరణ విధ్వంసం, విలువల విధ్వంసం, విధ్వంసకరమైన అభివృద్ధి పేరుతో, మతం పేరుతో హింస ప్రేరేపిస్తూ జీవిస్తున్నారు. వివాహ వ్యవస్థ సాంఘిక, సాంస్కృతిక, చట్టపరమైన నిబంధనలతో పాటు సమాజంలో ఇద్దరు వ్యక్తుల మధ్య ఒక బంధాన్ని, హక్కులు, బాధ్యతలు ఎత్తి చూపాలి. ఒకరికొకరు మద్దతుగా నిలిచేందుకు, సమాజానికి ఉపయోగపడేందుకు మార్గం సుగమం చేయాలి.

డా. ముచ్చుకోట సురేష్ బాబు,
9989988912

## ఖైదీలకూ ఓటు హక్కు

దేశవ్యాప్తంగా జైళ్లలో ఉన్న దాదాపు 4.5 లక్షల మంది విచారణ ఖైదీలకు ఓటు హక్కు గుర్తించాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్)పై శుక్రవారం సుప్రీంకోర్టు కేంద్రం, ఎన్నికల సంఘం స్పందనలను కోరింది. 1951 ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 62 (5) కింద విధించిన ప్రస్తుత నిషేధం రాజ్యాంగ హామీని, అంతర్జాతీయ ప్రజాస్వామ్య నిబంధనలను ఉల్లంఘిస్తోందని న్యాయవాది ప్రశాంత్ భూషణ్ చేసిన వాదనలను ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పరిగణనలోనికి తీసుకుంది.

పంజాబ్ రాష్ట్రం పాటియాలాకు చెందిన నివాసి సునీత శర్మ దాఖలు చేసిన పిటిషన్‌లో కేంద్ర ప్రభుత్వం, న్యాయ మంత్రిత్వ శాఖ, ఎన్నికల సంఘాన్ని ప్రతివాదులుగా చేర్చింది. ఎన్నికల నేరాలు లేదా అవినీతికి పాల్పడిన ఖైదీలు తమ ప్రజాస్వామ్య ఓటు హక్కును కోల్పోకుండా ఉండేలా చూసుకోవడానికి ఇది న్యాయపరమైన జోక్యాన్ని కోరుతోంది.

## ట్రంప్‌కు గుణపాఠం

బెదిరించి సాధించడం కాదు, శోధించి, సమస్యను ఛేదించి విజయం సాధించడంలోనే నిజమైన అర్హత ప్రస్ఫుటిస్తుంది. ఈ విషయంలో వెనెజులా ఉక్కు మహిళ సాధించిన విజయంతో డోనాల్డ్ ట్రంప్‌కు గర్వభంగమైనది. నోబెల్ శాంతి బహుమతి అర్హత గల మహిళనే వరించింది. అగ్రదేశాధిపతినన్న అహంకారంతోనో, ప్రపంచాధిపత్యం చాటుకోవాలన్న ఆరాటంతోనో, దుగ్ధతోనో అదిలించి, బెదిరించి, విర్రవీగిన ట్రంప్‌ను నార్వేజియన్ నోబెల్ శాంతి కమిటీ నిరాకరించింది. ఎలాంటి వత్తిళ్ళకు తలొగ్గకుండా సముచిత నిర్ణయం తీసుకుని నోబెల్ కమిటీ ప్రశంసార్హత సాధించింది. నోబెల్ శాంతి బహుమతులతో అమెరికా ఖ్యాతిని పెంచిన థియోడోర్ రూస్‌వెల్ట్, వుడ్రో విల్సన్, జిమ్మీ కార్టర్, బరాక్ ఒబామాల సరసన నిలబడాలని ఉవ్విళ్ళూరిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆశలపై నీళ్ళు చల్లి, వెనెజులా ప్రజాస్వామ్య హక్కులపై అలుపెరుగని పోరాటం సాగిస్తున్న ఆ దేశ ప్రతిపక్ష నాయకురాలు, పార్లమెంటు సభ్యురాలు, ప్రజాస్వామ్య ఉద్యమకారిణి మరియా కొరినా మచాడోకు 2025 సంవత్సరానికి నోబెల్ శాంతి పురస్కారం ప్రకటించడం హర్షదాయకం. న్యాయమైన హక్కుల కోసం, నియంతృత్వంపై ప్రజాస్వామ్యం విజయం సాధించాలనే ధ్యేయంతో ఉద్యమ నాయకురాలిగా, వెనెజులా పార్లమెంటు సభ్యురాలిగా శాంతియుత పోరాటం చేస్తూ, మరియా కొరీనా ప్రజల ప్రశంసలందుకుంటూ, వెనిజులా చరిత్రను తిరగరాయడానికి తీవ్రమైన కృషి చేస్తున్నారు. వెనిజులా తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. ఆర్థిక అంతరాలు విపరీతంగా పెరిగిపోయాయి. కేవలం కొద్దిమంది చేతుల్లోనే సంపదంతా కేంద్రీకృతమైపోయింది. భారీ సంఖ్యలో ప్రజలు పేదరికం తట్టుకోలేక ఇతర దేశాలకు వలస పోతున్నారు. వెనెజులాలో ఇలాంటి అస్తవ్యస్త మైన పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో స్వేచ్ఛగా ఎన్నికలు జరగాలని, పారదర్శకమైన ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడాలని మరియా కొరినా అసమాన ధైర్య సాహసాలతో పోరాడుతున్నారు. ఇన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని నార్వేజియన్ నోబెల్ కమిటీ మరియా కొరినా మచాడో కు నోబెల్ శాంతి బహుమతి ప్రకటించడం జరిగింది. భారత్ వంటి దేశాలను టారిఫ్ ల మోతతో, వీసాల భారంతో పీల్చి పిప్పిచేస్తూ తాను ఏడు యుద్ధాలను ఆపానని విర్రవీగుతూ, అహంతో రెచ్చిపోతూ, తనకే నోబెల్ శాంతి బహుమతి రావాలని వాంఛించిన ట్రంప్‌కు చివరకు నోబెల్ శాంతి బహుమతి సాధనలో విఫలం కావడం ఒక గుణపాఠం. బెదిరించి నోబెల్ శాంతి బహుమతి సంపాదించాలనుకోవడం మూర్ఖత్వం.

సుంకవల్లి సత్తిరాజు.

## యాంత్రీకరణతో అనేక లాభాలు

ప్రజాపక్షం/బిజినేపల్లి : వ్యవసాయ యాంత్రీకరణతో అనేక లాభాలు ఉన్నాయని ఇంటర్నేషనల్ సహాయ సంచాలకులు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానం పాలెం డాక్టర్ టి.రాంప్రకాశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఖానాపూర్ గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం పాలెం రావేప్ విద్యార్థులు ఏర్పాటుచేసిన రైతుసదస్సు వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయరంగంలో వ్యవసాయయంత్రాల వినియోగం రోజురోజుకు పెరుగుతూ రైతన్నకు సహాయకారులుగా మారుతున్నాయని అన్నారు. కృషివిజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు, రావేప్ విద్యార్థులు ఏర్పాటుచేసిన అవగాహనసదస్సును వ్యవసాయ ప్రదర్శనలు రైతన్నలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం బివిసికె కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కవిత మాట్లాడుతూ విద్యార్థులు రైతులతో మమేకమై రైతులకు సాంకేతిక పరిజ్ఞానంతోపాటు యాంత్రీకరణ వ్యవసాయరంగంలో వస్తున్న మార్పులగురించి రైతులకు తెలియజేయడం శుభసూచకమన్నారు. కార్యక్రమంలో 70మంది రావేప్ విద్యార్థులు, కెవికే శాస్త్రవేత్తలు రాజశేఖర్, ఆదిశంకర్, 200మంది రైతులు పాల్గొన్నారు.

## భారీ వర్షానికి కూలిన ఇల్లు.. తప్పిన ప్రమాదం



ప్రజాపక్షం/ఉట్కూర్ : ఉట్కూర్ మండలంలోని, కొత్తపల్లి గ్రామంలో నిన్న రాత్రి కురిసిన, భారీ వర్షానికి గ్రామంలోని వందరి రాజేందర్, మట్టి ఇల్లు కూలిపోయింది. పురాతనమైన ఇల్లు కావా కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు, ఇల్లు పైకప్పు కూలిపోయింది. కూలిపోయే సమయంలో ఇంట్లో ఎవ్వరు, లేకపోవడం వలన ఎవరికి ఏ హాని జరగలేదు. బాధితుడు మాట్లాడుతూ ఇంతకు ముందే అధికారులకు ఇల్లు పడిపోయే స్థితిలో ఉందని విన్నవించుకున్నారు. ప్రభుత్వం తరఫున, ఇందిరమ్మ ఇల్లును మంజూరు కాలేదు అని ఇప్పటికైనా అధికారులు స్పందించి. రెండవ విడతలో అయిన ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యేటట్లు చూడాలని అధికారులకు బాధితుడు కోరుతున్నారు.



## గూడ్స్ వాహనాల్లో ప్రజలను ఎక్కించొద్దు

టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు

ప్రజాపక్షం/నారాయణపేట్ : జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, నారాయణపేట జిల్లా కేంద్రంలో ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నారాయణపేట పోలీసులు ఆకస్మికంగా వాహనాలు తనిఖీలు నిర్వహించి ప్రజలను, కూలీలను, చిన్న పిల్లలను గూడ్స్ వాహనాలలో రవాణా చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై హెచ్చరించారు. ప్రజల రక్షణ, రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు ప్రజలను గూడ్స్ వాహనాల్లో తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై తెలిపారు. శుక్రవారం రోజు టౌన్ లో కూలీలను తరలిస్తున్న గూడ్స్ వాహనాలను పట్టుకుని వారికి అవగాహన కల్పించి ఆర్టీవోకి అప్పగించడం జరిగిందని ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రవాణా చట్ట ప్రకారం గూడ్స్ వాహనాలు కేవలం సరుకుల రవాణా కోసమే ఉపయోగించాలి వాటిలో వ్యక్తులను, కూలీలను, చిన్నపిల్లలను రవాణా చేయడం నేరమని తెలిపారు. ప్రజలు కూడా తమ ప్రాణాలను ముప్పుగా మారే ఈ విధానాన్ని ఎట్టి పరిస్థితుల్లో అనుసరించరాదని కోరా రు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు గౌరవించి సురక్షిత రవాణా కోసం బస్సులు, ఆటోలు, టాక్సీల వంటివి వాడాలి అని మీ ప్రాణాలు మీ చేతిలో ఉన్నాయని గుర్తుంచుకొని ప్రయాణం చేయాలని ఎస్సై తెలిపారు.

## ఆర్టీఐ చట్టంపై అవగాహన సదస్సు



ప్రజాపక్షం/వీపనగండ్ల : వివిధ అవసరాల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ప్రభుత్వ అధికారిపై ఉందని మండల పౌర సమాచార అధికారి గడ్డం శివకుమార్ అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం 2005 జాతీయ వార్షిక వారోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు తమ హక్కులపై స్పష్టమైన అవగాహన ఏర్పడుతోందని , ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకత పెరిగిపోతుందని తెలిపారు. అధికారుల పనితీరులో బాధ్యతాభావం పెరగాలని, ప్రజల పట్ల మరింత సానుభూతితో వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వ పాలనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, అందుకు సమాచారం హక్కు చట్టం ఎంతో బలమైన ఆయుధమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వరలక్ష్మి , ఆర్ఐ కురుమూర్తి, రికార్డ్ అసిస్టెంట్ నర్సింహ, భూ భారతి ఆపరేటర్ రాము, కార్యాలయ సిబ్బంది అరవింద్ రెడ్డి, రామేశ్వర్ రావు, రంజిత్ , వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్లు అడ్డుకునే కుట్ర

ప్రజాపక్షం/ధన్వాడ: రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల పెంపును అడ్డుకునేందుకు అగ్రకులాలు కుట్ర చేస్తున్నారని బీఎస్పీ మండల అధ్యక్షుడు కావాలి రవికుమార్ మండిపడ్డారు. శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడురు రాష్ట్రంలో 60%కి దగ్గరలో ఉన్న బీసీల జనాభాకి 42 శాతం రిజర్వేషన్ల సాధనకు కృషి జరుగుతుంటే ఓర్వలేని కొంతమంది కోర్టు ద్వారా అడ్డుకొని బీసీల పొట్ట కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అగ్రకులాల కోసం ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లు తెస్తే ఏ ఇక్కరు కూడా వ్యతిరేకించలేదని గుర్తు చేశారు. బీసీ సమాజంలో ఎంతోమంది పేదలు ఉన్నారని వారికి మేలు చేసేటువంటి 42% రిజర్వేసన్లను అడ్డుకోవడం దుర్మార్గమైందని అభివర్ణించారు. 42% రిజర్వేషన్ల విషయమై హైకోర్టు స్టేయివ్వడం బాధాకరమన్నారు. రిజర్వేషన్ల అడ్డుకునే కుట్రను ప్రతి ఒక్క బీసీ నాయకుడు ఖండించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమం తో పాటు ఎన్నో ఉద్యమాల్లో ముందున్న బీసీలు నేటికీ హక్కుల సాధన కోసం రిజర్వేషన్ల కోసం ఉద్యమించాల్సిన పరిస్థితి ఉందని వాపోయారు. బీసీ ప్రజలంతా చైతన్యమై రిజర్వేషన్ల సాధనకు ఐఖ్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. అవసరమైతు బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు రాజీనామా చేసి బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## బిసి సమాజాన్ని అడుగడుగునా అవమానపరుస్తున్న పార్టీలు

బ్లూ ఇండియా పార్టీ స్పోక్స్ పర్సన్ రవితేజ గౌడ్

ప్రజాపక్షం/జడ్చర్ల: బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు స్టే బిసి సమాజాన్ని అవమానపరిచిన కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీల వైఖరిని బ్లూ ఇండియా పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని ఆ పార్టీ స్పోర్ట్స్ పర్సన్ రవి తేజ గౌడ్ మండిపడ్డారు. శుక్రవారం నాడు ఒక ప్రకటనలో ఆయన పార్టీలపై మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో నెంబర్ 9 ను తీసుకొచ్చిన ప్రభుత్వ నిర్ణయంపై హైకోర్టు జారీ చేసిన స్టే ఆదేశాలు బిసి సమాజానికి తీవ్ర అన్యాయం చేశాయని ఆరోపించారు. కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ బిసి డిక్లరేషన్ పేరుతో ఓట్లు వేయించుకుని రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. బిజెపి పార్టీ బిసి ప్రధాని పేరుతో బిసిల ఓట్లు వేయించుకుని వరుసగా మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. ఈ పార్టీల పైన బిసిల రిజర్వేషన్ల బిల్లును ఆమోదింపజేసే బాధ్యత ఉన్నదని లేనియెడల తీసి ప్రజలకు దగా చేసినట్లే అవుతుందని ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నామన్నారు. ఇకనైన రాజకీయ పార్టీలు తమ వైఖరిని మార్చుకోవాల్సిందిగా బ్లూ ఇండియా పార్టీ హెచ్చరిస్తుందన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరు

ప్రజాపక్షం/వీపనగండ్ల : రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి కల్వరాల గ్రామానికి చెందిన మధుగని బాలరాజుకు రూ.22వేల చెక్కు మంజూరు చేయడం జరిగింది. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నర్సింహ, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. సిఎం రేవంత్‌రెడ్డి అందిస్తున్న సహాయాన్ని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావుకు బాలరాజు కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు సత్యం, జావీద్, దండుగల బాలస్వామి, జనుంపల్లి గోపాల్‌రెడ్డి, కొత్తకోట భాస్కర్, మీనిగ సాయిరాం, అశ్విని సత్యం, బుసనమోని వెంకటయ్య, బుసనమోని నర్సింహ పాల్గొన్నారు.

# అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ

చెంచు, గిరిజనప్రాంతాల గర్భిణుల సేవలపై ఆరా

కలెక్టర్ బదావత్‌సంతోష్

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : అచ్చంపేట పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ ఆకస్మికంగా తనిఖీచేశారు. శుక్రవారం ఆస్పత్రి పనితీరు, సిబ్బంది హాజరు, వైద్యసేవల నాణ్యత, మందుల సరఫరావంటి అంశాలపై కలెక్టర్ సమగ్రంగా ఆస్పత్రిలో ప్రజలకుఅందుతున్న వైద్యసేవలు వసతులపై వైద్యులతో క్షుణ్ణంగా ఆరాతీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రులు ప్రజలకు అత్యంత నమ్మకమైన వైద్యసేవల కేంద్రాలుగా ఉండాలని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన వైద్యం పొందేలా అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న చికిత్స, శుభ్రత పరిస్థితులు, అత్యవసర విభాగంలో ఉన్న సిబ్బంది అందుబాటు, పరికరాల వినియోగం, మందుల నిల్వలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గపరిధిలోని మండలాలనుండి చెంచు, గిరిజన పెంటలనుండి ఆస్పత్రి ప్రసవాలపై వచ్చే గర్భిణీ మహిళలు, శిశువుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటిస్తున్న విధానాలపై వైద్యులతో ఆరాతీశారు. గర్భిణీస్త్రీలకు తగిన జాగ్రత్తలు తీసుకోవడం, శిశుసంరక్షణలో పాటించాల్సిన ప్రమాణాలను కచ్చితంగా అమలుచేయాలని సూచించారు. రోగులందరికి శుభ్రమైన వాతావరణంలో చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆయనవెంట తహసీల్దార్, వైద్యులు, ఇతర సిబ్బంది ఉన్నారు.

**అడ్వాన్స్‌డ్ టెక్నాలజిసెంటర్లతో విరివిగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు :**
ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నెలకొల్పిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజిసెంటర్లలో నైపుణ్యంతోకూడిన శిక్షణపొందడం ద్వారా యువతకు విరివిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నారు. శుక్రవారం అచ్చంపేట నియోజకవర్గపరిధిలోని అమ్రాబాద్ మండలం మన్ననూర్‌వద్ద ఏర్పాటుచేసిన అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్‌సెంటర్‌ను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన కేంద్రంలోని ఆధునిక పరికరాలు, శిక్షణ ల్యాబోరేటరీలు, వర్క్‌షాప్‌విభాగాలు, తరగతిగదులను పరిశీలించి వసతులపై ప్రిన్సిపాల్‌తో ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటిసి వంటి ఆధునిక శిక్షణాకేంద్రాలు యువతలో నైపుణ్యాలు పెంపొందించడానికి, భవిష్యత్తులో ఉపాధి అవకాశాలను విస్తరించడానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. తరగతి గదుల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, స్మార్ట్‌బోర్డులు, డిజిటల్‌లెర్నింగ్ సిస్టమ్స్‌ద్వారా విద్యార్థులు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం శిక్షణ అందిస్తుందని తెలిపారు. యువత ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జాతీయ, అంతర్జాతీయస్థాయిలో పోటిపడేస్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. కలెక్టర్‌వెంట ప్రిన్సిపాల్ లక్ష్మణస్వామి, అమ్రాబాద్ తహసీల్దార్, ఇతర అధికారులు ఉన్నారు.



# యువత నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్: మారుతున్న కాలానికి అనుగుణంగా యువత నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ నగరంలోని శిల్పారామంలో నిర్మాణ్ ఓఆర్‌జి మరియు ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువతకు నైపుణ్యంతో పాటు నాణ్యతను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక సాంకేతిక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యువత ఉపాధి అవకాశాల కల్పనకు ఆధునిక సాంకేతికతతో కూడిన పరిజ్ఞానం చాలా అవసరమని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా యువత నైపుణ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. స్థానికంగా ఉద్యోగ అవకాశాలు లభించాలంటే, స్థానికంగా మన పిల్లలకు మంచి నైపుణ్య శిక్షణ ఇప్పించాలని తద్వారా వారికి వివిధ పేరెన్నిక గల కంపెనీలలో ఉపాధి అవకాశాలు లభిస్తాయి అని ఆయన చెప్పారు. టాస్క్, అమరరాజా, సెట్విన్ సంస్థలలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేశారని అన్ని విధాలా వారికి సహకారం అందిస్తున్నామని ఆయన చెప్పారు. అలాగే మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో 1000 మంది మహిళలకు వివిధ కోర్సుల్లో ఇప్పటికే నైపుణ్య శిక్షణ అందించినట్లు ఆయన చెప్పారు. ప్రభుత్వ ప్రైవేటు రెండు కలిసి పనిచేస్తేనే ఉద్యోగాలు సృష్టించగలమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో 1000 మంది మహిళలకు వివిధ కోర్సుల్లో ఇప్పటికే నైపుణ్య శిక్షణ అందించినట్లు ఆయన చెప్పారు. ప్రభుత్వ మరియు ప్రైవేటు రెండు కలిసి పనిచేస్తేనే ఉద్యోగాలు సృష్టించగలమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, చర్ల శ్రీనివాసులు, శ్రీనివాస్, శివ, నవత, కనికె పాల్గొన్నారు.



## ఎస్‌బిఐ బ్రాంచ్ ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాపక్షం/దామరగిద్ద : దామరగిద్ద మండలంలోని మొగలమడక గ్రామంలో నూతనంగా ఎస్బిఐ బ్రాంచ్‌ను ఏర్పాటు చేశారు. ఏ మండలంలో లేని విధంగా దామరగిద్ద మండలంలో కానుకుర్తి గ్రామానికి ఒకే ఒక ఎస్బిఐ బ్రాంచ్ ఉండడంతో రైతులపై భారం పడటం వలన రాకపోకలకు ఇబ్బందితో నూతనంగా మరొక బ్యాంక్ ప్రారంభిస్తే బాగుంటుందని భావించి మొగలమడక గ్రామ యువకులు వినోద్ తదితరులు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఎమ్మెల్యే వెంటనే స్పందించి ఎస్బిఐ నూతన బ్రాంచ్ ప్రారంభించుటకు అనుమతులు ఇవ్వడం అలాగే మొగల మడక గ్రామం ఐతే అందరికీ దగ్గరగా అందుబాటులో ఉంటుందని భావించి ఏర్పాటు చేశారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణిక రెడ్డి నూతన సబ్ బ్రాంచ్‌ను ప్రారంభించారు. గ్రామ ప్రజలు స్థానిక ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణిక రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజల నాయకులు అధికారులతో పాటు గ్రామ ప్రజలు నాయకులు పాల్గొన్నారు.

# ఉచితంగా వేరుశనగ విత్తనాల పంపిణీ



ప్రజాపక్షం/పెబ్బేరు : నూనె గింజల ఉత్పత్తి, సాగు పెంచడమే ప్రధాన లక్ష్యంగా నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్ ద్వారా రైతులకు ఉచితంగా వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. పెబ్బేరు మండలం గుమ్మడం గ్రామంలో రైతు వేదికలో నిర్వహించిన విత్తన పంపిణీలో ఎమ్మెల్యే మెగారెడ్డి మాట్లాడుతూ నాబార్డ్, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్లు, కృషి విజ్ఞాన కేంద్రం మదనాపూర్ సంయుక్తంగా రైతులకు నూనె గింజలు ఉత్పత్తి పెంచి స్వయం సమృద్ధి , అభివృద్ధి చెందడంలో భాగంగా కదిరి లేపాక్షి కే 1812 అనే విత్తనాన్ని 492 క్వింటాలను రైతులకు పంపిణీ చేయడం జరిగింది. నూనె గింజల సాగును పెంచడంలో కేంద్ర ప్రభుత్వం 60 శాతం సబ్సిడితో రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం సబ్సిడితో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు, మొత్తం 1259 క్వింటాళ్ల గాను 492 క్వింటాళ్లు మొదట విడతగా పంపిణీ చేయడం జరిగిందని, ఇది మొత్తం 6 సంవత్సరాలు నిర్వహించే పథకమని 500 హెక్టార్లు లక్ష్యంగా నిర్దేశించారని అందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 70 లక్షలు మంజూరు చేశారని, ఎమ్మెల్యే రైతులను ఉద్దేశించి తెలిపారు. పెబ్బేరు మండలంలో అక్రమంగా భూములను పొందిన వారి నుండి స్వాదీనం చేసుకొని ప్రజలకు అందిస్తామన్నారు. త్వరలో పెబ్బేరు సంత భూమి విషయంలో, గుమ్మడం గ్రామంలోని క్రీడా ప్రాంగణ భూమి విషయంలో చర్యలు తీసుకొని ప్రజా ప్రయోజనాలకు వినియోగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మెగారెడ్డితో పాటు మార్కెట్ యార్డ్ చైర్మన్‌లు శ్రీనివాస్ గౌడ్, ప్రమోదిని పాండేశ్వర్ రెడ్డి, వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు కోదండరామిరెడ్డి, వెంకట్రాములు, జిల్లాల వెంకట్రామిరెడ్డి, రంజిత్ కుమార్, మహేశ్వర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి షేక్ మున్న, ఏఈఓ ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

## పీర్ల సొమ్మును కాజేసి కటకటాల పాలైన ప్రబుద్ధులు

వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ రావుల గిరిధర్



ప్రజాపక్షం/వనపర్తి : మంత్రాలు, జాతకాలు వంటివి చేసి వచ్చే సంపాదనతో తృప్తి చెందక దేవుళ్ల సొమ్ము కాజేసి తిరిగి జాతకం చెప్పి తన మహిమతో సొమ్ములు గుర్తించినట్లు ప్రజలను నమ్మించి దగా చేయడానికి కుట్ర చేసిన నిందితులు పోలీసులకు దొరికి పోయారు. శుక్రవారం సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ వివరాలు వెల్లడించారు. మరలవారు దొంగతనం చేసిన విషయం గ్రామస్తులకు ఎవరికి తెలియకపోవడంతో ఎలాగైనా గ్రామస్తులు తెలియజేయాలని 7/10/25 తెల్లవారు జామున అందాజా రెండున్నర గంటల సమయంలో నేరస్తులు కలిసి తాళం తీసి పీర్ల చావిడిలో వస్తువులను చిందరవందర చేసి సీసీ కెమెరాలు పగలగొట్టి పోలీసు కుక్కలు గుర్తు పట్టకుండా ఉండాలని పీర్లదావిడి ముందే తెచ్చుకున్న కారం పొడిని చల్లి అటు నుంచి ఇంటికి వెళ్లిపోయి ఎవరికి అనుమానం రాకుండా పీర్ల చావిడ్లో దొంగతనం జరిగిందని పోలీసు వారికి తప్పుడు దరఖాస్తు ఇచ్చారు. డిఎస్పీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి పాషా అతని స్నేహితులను, గ్రామంలోని ఇతర పేర్లు పెట్టి వారిని, కొంత మంది గ్రామస్తులను వివిధ కోణాల్లో తమదైన శైలిలో విచారణ చేయగా నేరస్తుడు పాషాపై అనుమానం రాగా వారిని విచారించగా వారు నేరం చేసినట్లు ఒప్పుకోవడం జరిఇగింది. తర్వాత అతని వద్ద దొంగిలించిన సొత్తును స్వాదీనపర్చుకొని అరెస్టు చేయడమైంది. రిమాండ్‌కు తరలించడం జరుగుతుందన్నారు. నేరస్తుల నుంచి 9.310 కిలోల వెండి , 13.680 కిలోల ఇత్తడి ఆల్టో కారు బజాజ్ డిస్కవరీ బైక్ వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పీ వెంకటేశ్వరరావు, వనపర్తి సిఐ కృష్ణయ్య, చిన్నంబాయి, ఎస్ఐ జగన్మోహన్, సిసిఎస్ ఎస్ఐలు జయన్న, రామరాజు పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# సత్యసాయి సేవాసంస్థ సేవలు అభినందనీయం

మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



ప్రజాపక్షం/కల్వకుర్తి : మానవసేవే మాధవసేవ అని, సత్యసాయిసేవాసంస్థ సేవలు అభినందనీయమని మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సత్యసాయి నూతనమందిరం ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, రాష్ట్ర మిషన్‌భగీరథ వైస్‌చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్టుచైర్మన్, తలకొండపల్లి మాజీ జడ్పిటిసి ఉప్పల వెంకటేష్‌లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు సేవచేయడం గొప్పవరమని, ఉమ్మడి జిల్లాలోని శ్రీసత్యసాయిభగవాన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని ఉమ్మడిజిల్లా నీటికరువుతో అల్లాడుతున్న సమయంలో సత్యసాయి భగవాన్‌ట్రస్టు ద్వారా రూ.45కోట్లతో నీటి సౌకర్యం కల్పించారని వారు గుర్తుచేశారు. సత్యసాయి సేవాసమితి నుండి 9విధాల సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారన్నారు. సత్యసాయి సాయిబాబా సేవలు ముమ్మందు మరింతగా రాణించేందుకు అందరూ కృషిచేయాలన్నారు. సత్యసాయి సేవామందిరం నిర్మాణంకోసం మాజీమంత్రి సింగిరెడ్డినిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఉప్పల చారిటబుల్ ట్రస్టుచైర్మన్ ఉప్పలవెంకటేష్‌లతోపాటు కల్వకుర్తి నియోజకవర్గ రాజకీయవేత్తలు, మేధావులు అందరూ తోడ్పాటు అందించారని సత్యసాయిసేవాసమితి చైర్మన్ గుబ్బ ఈశ్వరయ్య తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్‌చైర్మన్ సత్యం, రాచోటిశ్రీశైలం, మాజీమార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్, మాజీ జడ్పిటిసి నర్సింహ్మా, దారమోనిగణేష్, సుశీల, వహీద్, శేఖర్‌గౌడ్, శ్రీనివాసులు, రవి, వెంకటయ్య, దేవయ్య, కృష్ణ, ఖాజ, మాజీసర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం వారోత్సవాలు

కలెక్టర్ విజయేందిర బోయి




ప్రజాపక్షం/మహబూబ్ నగర్ : ప్రభుత్వ అధికారుల పనితీరులో పారదర్శకత, జవాబుదారీతనాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో రూపొందిన సమాచారం హక్కు (ఆర్‌టిఐ) చట్టం, 2005 పైన జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులందరు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. అక్టోబర్ 5 నుండి 12 వరకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న సమాచార హక్కు చట్టం వారోత్సవాలలో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయిలో అన్ని శాఖల అధికారులకు, పౌర సమాచార అధికారులు, సహాయ పౌర సమాచార అధికారులకు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధ్యక్షతన ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ చట్టం ద్వారా పౌరులకు సాధికారత కలిగిందని. అధికారులు ఎలా పని చేస్తున్నారో తెలుసుకునే హక్కు పౌరులకు లభించిందన్నారు. సమాచార హక్కు చట్టం రావటానికి ఎంతో పోరాటం జరిగిందని, రామన్ మెగసెసే అవార్డ్ గ్రహీత సామాజిక వేత్త సందీప్ పాండే, మాజీ ఐఎఎస్ అధికారిణి అరుణా రాయ్ లాంటి వారు ఎందరో కృషి చేశారని అన్నారు. ప్రభుత్వ కార్యకలాపాలలో పాదరదర్శకతను తీసుకురావడం ప్రభుత్వ అధికారులు తమ చర్యలకు జవాబుదారీగా ఉండేలా చేసిన ఈ చట్టం పట్ల అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉన్నప్పుడే దరఖాస్తు దారుడు కోరిన సమాచారాన్ని సరైన విధంగా, నిర్ణీత గడుపులో ఇవ్వగలుగుతారన్నారు. ఆర్‌టిఐకి సంబంధించిన దరఖాస్తులని నిర్ణీత వ్యవధిలో సమాచారం అందించాలని, అదే విధంగా అప్పీల్ దరఖాస్తులు కూడా సమాచారం అందించాలని అన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పౌర సమాచార అధికారి, సహాయ పౌర సమాచార అధికారి, అప్పిలేట్ అధికారులు ఈ చట్టంలో పొందుపరిచిన ప్రతి అంశంపైన అవగాహన ఉంటే. ప్రతీ దరఖాస్తుకి సమాధానాన్ని ఇవ్వడం సులభమన్నారు. ఎప్పటికప్పుడు అధికారులు వారి కింది స్థాయి సిబ్బందికి చట్టం మీద అవగాహన కలిగించే కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, అన్ని శాఖలకు సంబంధించిన జిల్లా స్థాయి అధికారులు వారి సిబ్బంది పాల్గొన్నారు.

**చెరువులు వాగులవైపు వెళ్లొద్దు**

వర్షాలు కారణంగా చెరువులు, వాగులు నిండి లో లెవెల్ కాజ్ వేలపై, రహదారులపై పొంగి ప్రవహిస్తున్న నీటి ప్రవాహం వైపు ప్రజలు వెళ్లవద్దని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ జడ్చర్ల మండలం కిష్టారం గ్రామం నుండి అంబటాపూర్ వెళ్లే దారిలో పోతిరెడ్డి చెరువు అలుగు పారి నీటి ప్రవాహంలో గురువారం దంపతులు గల్లంతైన ప్రాంతాన్ని కలెక్టర్ విజయేందిర బోయి సందర్శించారు. వర్షాల వలన జడ్చర్ల మండలం అంబటాపురం గ్రామంకు చెందిన తానేం బాలయ్య, రాములమ్మ దంపతులు కిష్టారం నుంచి అంబటాపూర్‌కు నడిచి వెళ్తున్న క్రమంలో పోతిరెడ్డి చెరువు అలుగు పారి ప్రవహించే నీటి ప్రవాహంలో చిక్కుకుని గురువారం సాయంత్రం గల్లంతైనారు. మార్గమధ్యలో ఉన్న పోతిరెడ్డి చెరువు మూడు సంవత్సరాల అనంతరం అలుగు పారింది. నీళ్లన్నీ కిష్టారం నుంచి అంబటాపూర్‌కు వెళ్లే రోడ్డు పైకి వచ్చాయి. అలుగు పారుతున్న నీళ్లలో నడిచి వెళుతుండగా ఈ ఘటన జరిగింది. ఎస్‌డిఆర్ఎఫ్ 15 మంది సభ్యుల బృందం వారి కోసం గురువారం నుండి గాలింపు చర్యలు చేపట్టాయి. జిల్లా కలెక్టర్ కిష్టారం నుంచి చెరువు ప్రవహించే ప్రాంతం వరకు సుమారు 5 కిలోమీటర్లు బైక్‌పై పయనించి ఎస్‌డిఆర్ఎఫ్ జిల్లా అగ్ని మాపక అధికారి కిశోర్ ఆధ్వర్యంలో చేపట్టిన గాలింపు సహాయ చర్యలను పర్యవేక్షించారు. తానేం బాలయ్య, రాములమ్మ దంపతుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని పరామర్శించారు. వారికి ప్రభుత్వ పరంగా వచ్చే సహాయం అందించనున్నట్లు తెలిపారు. కిష్టారం నుండి అంబటాపూర్ వెళ్లే మార్గమధ్యంలో మంజూరైన రోడ్డు పనులు చేపట్టి లో లెవెల్ కాజ్ వే స్థానంలో హై లెవెల్ కాజ్ వే బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు జిల్లా కలెక్టర్ ను కోరారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని పంచాయితీ రాజ్ డిఈని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి కిశోర్, ఆర్‌డిఓ నవీన్, తహసీల్దార్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సోమవారం నాటికి జిల్లాలో అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని జిల్లా అదనపు కలెక్టర్ కె సీతారామారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో ఆయన ఖరీఫ్ 2025/26 సీజన్‌కి సంబంధించి ధాన్యం సేకరణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతానికి జిల్లాలో 298 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ఆమోదం తెలిపామని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బంది కలగకుండా అన్ని మౌళిక వసతులు ఏర్పాటు చేసుకొని సోమవారంలోపు ప్రారంభించాలని, ఇంకా ఎక్కడైనా అవసరం ఉంటే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఈ సమావేశంలో డిఎస్‌ఓ మోహన్‌బాబు, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగేశ్వరశర్మ, డిసిఓ పద్మ, డిఏఓ శ్రీధర్‌రెడ్డి, ఏపిడి సురేష్, ఏడిఎం బెనర్జీ, ఏఎస్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



## చెర్వుగట్టు హుండీ ఆదాయం లెక్కింపు

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** మండలం పరిధిలోని చెరువుగట్టు శ్రీ పార్వతీ జడలరామలింగేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా గట్టుక్రింద అమ్మవారి ఆలయ హుండీలు, గట్టుపైన శ్రీ స్వామివారి ఆలయ హుండీలను లెక్కించగ గట్టుక్రింద అమ్మవారి ఆలయ హుండీ ఆదాయము రూ.6,39,540లు, గట్టుపైన స్వామివారి ఆలయ హుండీ ఆదాయము రూ. 34,07,100 లు మొత్తం 85 రోజులకు గాను రూ.40,46,640,అన్నదానం రూ. 50,844 వచ్చినట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్. నవీన్ తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె. భాస్కర్,దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీలకురాలు సుమతి, నల్లగొండ శ్రీ దుర్గ శివసాయి సేవా సమితి సభ్యులు, హెచ్‌డిఎఫ్‌సి, నల్లగొండ బ్రాంచి సిబ్బంది ,దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.





## ప్రజాపాలన పట్ల విశ్వాసంతో కాంగ్రెస్‌లోకి చేరికలు

ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** అధికారంలోకి రాగానే ప్రజాపాలన పేరుతో ప్రజలకు అనేక ప్రతిష్టాత్మక సంక్షేమ అభివృద్ధి పనుల పట్ల విశ్వాసంతో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం పోచంపల్లి మండలం ఇంద్రియాల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు పావిరాల మహేందర్ లత యాదవ్, బలరాం యాదవ్, దయాకర్ యాదవ్, శ్రీను యాదవ్, బందారపు రాజశేఖర్ గౌడ్, కందాల వంశీలు బిఆరెస్ పార్టీని ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో అఖండ విజయం సాధించి కాంగ్రెస్ పార్టీకి ఎదురు లేదని చెప్పే సందేశం ఇవ్వాలని దాని కోసం తీవ్రంగా కృషి చేయాలని ఆయన కోరారు. ప్రతిపక్షాల ఎత్తుగడలు చిత్తుచేయాలని కర్తవ్యాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, ఉపాధ్యక్షులు శ్రీశైలం, టింగిల్ కార్ వెంకటేశం, కార్యకర్తలు ఉన్నారు.

## వీధి విక్రయదారులు నగదు రహిత లావాదేవీలు జరపాలి




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వీధి విక్రయదారులు నగదు రహిత లావాదేవీలు జరపాలని మున్సిపల్ కమీషనర్ జి.శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన లోకకల్యాణ్ మేళాలో భాగంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో డిజిటల్ ఆన్ బోర్డింగ్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగదు రహిత చెల్లింపు కోసం క్యూఆర్ కోడ్ ద్వారా ఆన్‌లైన్ పేమెంట్ చేయించుకోవడానికి వీధి విక్రయదారులు వినియోగదారుల ద్వారా నష్టపోకుండా క్యూఆర్‌కు ఒక విధమైన సౌండ్ వినడం ద్వారా వ్యాపారులు నష్టపోకుండా ఉంటారని అన్నారు. ఆన్‌లైన్ నగదు లావాదేవీల ద్వారా ఆదాయం పెరుగుతుందన్నారు. లోకకల్యాణ్ మేళాలో భాగంగా పట్టణంలో మిగిలిపోయిన వీధి విక్రయదారులు ఈనెల 12వరకు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఫోన్ పే నిర్వాహకులు వెంకటేశ్వర్లు, మెప్మా టీఎంసీ బక్కయ్య, సీవోలు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, వీధి విక్రయదారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు నష్టపోవద్దు

**ప్రజాపక్షం/గుండాల :** ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన ప్రారంభించి రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి అనంతులు రామచంద్రయ్య ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఐకేపి, పిఏసిఎస్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతుల వద్ద నుండి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆయన అన్నారు. ఇప్పటికే రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులకు ధాన్యాన్ని తక్కువ ధరలకు విక్రయించి మోసపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం త్వరితగతిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, రైతులకు మద్దతు ధరను కల్పించి రైతుల వద్ద నుండి ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## మానసిక ఆరోగ్య చట్టం, పరిధులు అంశంపై అవగాహన కార్యక్రమం




**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రాయగిరిలోని సహృదయ వయో వృద్ధుల ఆశ్రమంలో మానసిక ఆరోగ్య చట్టం, పరిధులు అంశంపై అవగాహన కార్యక్రమం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ యాదాద్రి భువనగిరి , జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి వి.మాధవి లత మాట్లాడుతూ మానసిక వికలాంగులకు రాజ్యాంగ హక్కులు కల్పించబడ్డాయని వారికి న్యాయ సహాయం న్యాయ సేవ అధికార సంస్థ ద్వారా అందచేసి వారి హక్కుల సాధికారతకు అందరం కృషి చేయాలని, దీనికై జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ పథకం ఏర్పాటు చేయడమైనది , మనోన్యాయ్ ఏర్పాటు చేయడమైనది తెలిపారు. ఈ కార్యక్రమంలో బొల్లేపల్లి పీహెచ్‌సి డాక్టర్లు యామిని, మురళి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేసి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో సఖి కేంద్రం అడ్మిన్, సభ్యులు, వయో వృద్ధులు, నర్సింగ్ స్టాఫ్, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ కొనుగోలు నిర్వహకులు పరికరాలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ఎమ్ఎస్ఎస్‌పి పరికరాలు టర్బాలిన్స్, పాడి క్లీనర్‌లు, ఎలక్ట్రానిక్ క్యాంటాలు, మాయిచర్ మీటర్స్ సూర్యాపేట మార్కెట్ యార్డ్‌లో ఉన్నందున నిర్వాహకులు తీసుకోవాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోతె, ఆత్మకూర్(ఎస్), చివ్వెంల, సూర్యాపేట మండలం, పెన్‌పహాడ్ మండలాల ప్రభుత్వ కొనుగోలు నిర్వాహకులు వినియోగించుకోవాలని కోరారు.

# తేమ, తాలు, తరుగు,చెత్త ఉండొద్దు

నాణ్యత ప్రమాణాలతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీస్



**ప్రజాపక్షం/నల్లగొండ :** విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఎస్ఎల్ బిసి కాలని తెలంగాణ మైనారిటీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌కు షోకాజ్ నోటీస్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి జారీ చేశారు. శుక్రవారం కలెక్టర్ జిల్లా కేంద్రంలోని ఎస్ఎల్ బిసి కాలనీలో రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా ప్రిన్సిపాల్ వేణుగోపాల్ పాఠశాల సమయంలో భోజనం కోసం బయటకు వెళ్లడం జరిగింది. అయితే నిబంధనల ప్రకారం రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ వసతి గృహం ఆవరణలోనే భోజనం చేయాలని నియమం ఉన్నప్పటికీ, ఆయన దానిని ఉల్లంఘించారు. దీంతోపాటు, పాఠశాల భవనం,ఆవరణ అపరిశుభ్రమైన స్థితిలో,సరైన నిర్వహణ లేని పరిస్థితులలో ఉండటంతో పాటు, ప్రధాన పరిపాలనా బాధ్యతలను నిర్వర్తించడంలో ప్రిన్సిపాల్ విఫలమైనట్లు కలెక్టర్ గుర్తించారు. అంతేకాకుండా కొందరు ఉపాధ్యాయులు సైతం పాఠశాల సమయంలో ఎలాంటి అనుమతి లేకుండా గైర్హాజరు అయినట్లు కలెక్టర్ గుర్తించారు.పై లోపాలన్నీ ప్రిన్సిపాల్ విధులలో తీవ్రమైన అలసత్వాన్ని,పర్యవేక్షణ లోపాన్ని ,క్రమశిక్షణారాహిత్యాన్ని సూచిస్తున్నాయని,ఇది ప్రభుత్వ నియంత్రణలో నడిచే ఒక రెసిడెన్షియల్ సంస్థకు ఆమోదయోగ్యం కాదని పేర్కొంటూ జిల్లా కలెక్టర్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్ కు షో కాజ్ నోటీస్ జారీ చేశారు. షో కాజ్ నోటీస్‌కు ముడురోజులలో సరైన వివరణ ఇవ్వాలని లేదం టే క్రమ శిక్షణా చర్యలు తీసుకొంటామని కలెక్టర్ తెలిపారు.

**రైతులు నిబంధనల ప్రకారం ధాన్యాన్ని తీసుకురావాలి**

ప్రభుత్వం సూచించిన నాణ్యత ప్రమాణాలతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి రైతులతో కోరారు. శుక్రవారం ఆమె నకిరేకల్ మండలం తాటికల్, మండలం అర్జాలబావిలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. రైతులు నిబంధనల ప్రకారం ధాన్యాన్ని తీసుకురావాలని, తేమ తాలు ,తరుగు,చెత్త, చెదారం వంటివి లేకుండా పూర్తి నాణ్యతతో తీసుకువచ్చి కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు సహకరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వరికి క్వింటాల్‌కు రూ.2389ల మద్దతు ధర ప్రకటించిందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులు తీసుకొచ్చిన పరిశీలించి తూర్పార బట్టి, తేమ ,తాలు లేకుండా చూసుకోవాలని, నాణ్యతతో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని చెప్పారు. జిల్లా సహకార అధికారి పత్యానాయక్, ఆర్‌డిఓ వై .అశోక్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశం ఉన్నారు.

## ఆధునిక సాంకేతిక బార్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లా కోర్టు నుంచి మున్సిబ్ కోర్టు ల వరకు ఆధునిక సాంకేతిక కలిగిన బార్ అసోసియేషన్ ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని హైకోర్టు సీనియర్ న్యాయవాది వీరోజ్ రఘునాథ్ అన్నారు. శుక్రవారం జిల్లాలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రెండు సంవత్సరాల కోసం ఎన్నుకోబడ్డ బార్ కౌన్సిల్ మెంబర్లు ఎలాంటి సహేతుకమైన కారణం లేకుండానే ఎనిమిది సంవత్సరాలు కాలయాపన చేయడంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కూడా వైఫల్యం ఉందన్నారు, అలాగే ఎన్నికల నిర్వహణకు హైకోర్టు, సుప్రీంకోర్టు లో పిటిషన్లు వేసిన తర్వాత సుప్రీం కోర్టు జోక్యం తో బార్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించుటకు తప్పని పరిస్థితి ఏర్పడింది అన్నారు, అలాగే న్యాయవాదులపై దాడులు, హత్యలు నిరంతరంగా జరుగుతున్న న్యాయవాదుల రక్షణ చట్టం కోసం బార్ కౌన్సిల్ ఎలాంటి ప్రయత్నం చేయలేదని కానీ, న్యాయవాదులపై చర్యలు తీసుకోవడంలో మాత్రం వెంటనే స్పందించే తీరును ఖండించారు. బార్ కౌన్సిల్ నిధులు విషయంలో జవాబు దారీ తనం లోపించిందని యువ న్యాయవాదులకు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడం కోసం శిక్షణా తరగతులు నిర్వహించాలని కోరారు. రాబోయే బార్ కౌన్సిల్ ఎన్నికల్లో న్యాయవాదుల సంక్షేమమే ప్రధాన ఎజెండాగా ముందుకు వచ్చిన వారినే ఎన్నుకోవాలని ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిబద్ధత కలిగిన బార్ కౌన్సిల్ మెంబర్ లను ఎంపిక చేయాలని కోరారు.

# మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా?

కేసారంలో ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి మండలం కేసారం గ్రామంలో మండల ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆకస్మిక తనిఖీ చేశారు. స్కూల్‌లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. భోజనం మెనూ ప్రకారం రుచికరమైన ఆహారం పెడుతున్నారా అని విద్యార్థులని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు గణితంలో తప్పు లేకుండా గుణింతాలు చెప్పడంతో విద్యార్థులను అభినందించారు. అనంతరం కేసారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో మొత్తం ఎన్ని ఇండ్లు మంజూరు అయ్యాయని, ఎన్ని నిర్మాణాల్లో ఉన్నాయని అవి ఏ దశల్లో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు అందరూ కూడా ఇండ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని, డబ్బులు తమ ఎకౌంట్‌లో ఎప్పటికప్పుడు వెంటనే పడుతున్నాయని తెలిపారు.

### యథావిధిగా ప్రజావాణి : కలెక్టర్

**ప్రజాపక్షం/యాదాద్రి :** వివిధ సమస్యల పై ప్రజల ఆర్జీలు ఇచ్చేందుకు ఈ నెల 13వ తేదీన నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం యధా విధిగా నిర్వహించడం జరుగుతుందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు నేడొక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లాలోని ప్రజలంతా గమనించి, వివిధ సమస్యల పై ఫిర్యాదులు ఇచ్చేందుకు రావొచ్చని తెలిపారు.

## మానసిక ప్రశాంతతో ఒత్తిళ్లకు దూరం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** బ్యాంకు ఉద్యోగస్తులు తమ దయానందన జీవితంలో ప్రతిరోజు కూడా క్రమశిక్షణ తప్పకుండా బ్యాంకుకు వచ్చి ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన ఒత్తిళ్లను మానసిక ప్రశాంతత ద్వారా దూరం చేసుకోవచ్చని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ విశ్వకర్ రెడ్డి అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నీలగిరి బ్రాంచ్ ధ్వర్యం లో స్థానిక ఆర్టీసీ కాలనీలో ఉన్నటువంటి ఎస్‌బిఐ రీజినల్ బ్యాంక్ నందుగల ఉద్యోగస్తులకు అవగాహన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగస్తులు ఒక రకమైన చిరాకు అలసట డిప్రెషన్ డిసప్పాయింట్మెంట్ ఇలాంటిది గురవుతుంటే కాబట్టి వాళ్లు ఏకాగ్రతతో పనిచేయాలంటే ప్రతిరోజు అనునిత్యం ఫిజికల్ యాక్టివిటీ, అంటే వాకింగ్ గాని, సైకిలింగ్ గాని, స్పోర్ట్స్ గానే ఇతర క్రీడలకు సంబంధించిన ప్రోగ్రామ్స్ చేసినట్లయితే మనిషిలో ఒక కొత్త తేజం ఉత్తేజం వచ్చి ఇలాంటి మానసిక ఒత్తిళ్లకు గురికోకుండా ఉంటారన్నారు. తెలంగాణ రాష్ట్ర ఐఎంఏ మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ ఏ సి హెచ్ పుల్లారావు మాట్లాడుతూ తమ లో ఉన్న ఒత్తిడి తగ్గాలంటే ఏకాగ్రత కష్టపడి పనిచేయటం ప్రతి చిన్న విషయానికి ఎక్కువగా ఆలోచించకుండా తమకున్న పరిధిలోనే సమస్యలను సాల్వ్ చేసుకుని కస్టమర్లతో ఓ మంచి ఇంట్రాక్షన్ తో ఉన్నట్లయితే మానసిక ఒత్తుల నుంచి దూరంగా ఉండవచ్చు అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఐఎంఏ నీలగిరి మాజీ ప్రెసిడెంట్ డాక్టర్ అనిత రాణి,సెక్రటరీ డాక్టర్ ప్రవీణ్ కుమార్,డాక్టర్ రమేష్, డాక్టర్ శృతి,డాక్టర్ అశోక్, రామస్వామి,వీరస్వామి, బ్యాంకు ఉద్యోగస్తులు పాల్గొన్నారు.





## అక్రమ అరెస్టులు సరికాదు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** బిసి రిజర్వేషన్లను వ్యతిరేకించిన వారిపై నిరసన చేసే బిసి నాయకులను అక్రమ అరెస్టులు చేయడం సరైంది కాదని బిసి సంక్షేమ సంఘం నాయకులు తప్పు పట్టారు. ప్రభుత్వం చట్టప్రకారం బిసి రిజర్వేషన్లు అమలు చేసేందుకు చట్టపద్ధతిలో పోకుండా తప్పుడు మార్గంలో కుట్రపూరితంగా వెళ్ళి హైకోర్టుకు పోవడానికి అవకాశం ఇచ్చారన్నారు. రెడ్డి సామాజిక వర్గంతో కేసులు వేయించడం వల్లే హైకోర్టు స్టే ఇవ్వడం జరిగిందని మండిపడ్డారు. బిసి సంఘాలన్ని కూడా ఒక నిర్ణయానికి వచ్చి బిసిలకు గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 42 శాతం హామీ అమలు చేయాలని ఉద్యమాలు చేసి ఒత్తిడి తీసుకరావడం జరిగిందన్నారు. దీంతో తూతూ మంత్రంగా శాసనసభలో బిల్లు పెట్టారన్నారు. కాని చట్టబద్ధంగా 9 షెడ్యూల్లో పెట్టేవిధంగా ప్రయత్నం చేయకుండా పార్లమెంట్ సమావేశాల్లో తమ ఎంపిలను బిసి రిజర్వేషన్ల బిల్లుపై మాట్లాడమని చెప్పకుండా అఖిలపక్ష కమిటిని ప్రధానమంత్రి వద్దకు తీసుకెళ్లకుండా జంతర్‌మంతర్‌లో ధర్నాలు చేసి నటించారన్నారు. హైకోర్టులో వేసిన రెడ్డి జాగృతి నాయకులపై నిరసనలు, ధర్నాలు చేసేందుకు సన్నద్ధమవుతున్న వారిని అక్రమంగా అరెస్టులు చేయడాన్ని ముక్త కంఠంతో ఖండించాలన్నారు. అరెస్ట్ అయిన వారిలో బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చల్లమల్ల నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శులు భూపతి నారాయణ గౌడ్, దాసరి వెంకన్న యాదవ్, కోడి లింగయ్య యాదవ్, జక్కుల రామచందర్ యాదవ్, గంగాధర జనకిరాములు ఉన్నారు.



## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు

మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి రైస్ మిల్లర్లను ఆదేశించారు. శుక్రవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ పంట గతంలో కంటే ఎక్కువగా సాగవుతుండడంతో దిగుబడి మరింత అధికంగా వచ్చే అవకాశం ఉందని కావునా మిల్లర్లు రైతులకు ఎలాంటి ఆటంకాలు పెట్టకుండా ధాన్యాన్ని వెంటవెంటనే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, మద్దతు ధరకు కొనుగోలు చేయాలని మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయాధికారులు సైతం కొనుగోళ్లను పర్యవేక్షిస్తూ రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏడీఏ సైదానాయక్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మిర్యాలగూడ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, కార్యదర్శి వెంకటరమణచౌదరి తదితరులు ఉన్నారు

## ఆటో డ్రైవర్ల బాకీలు ఎప్పడు చెల్లిస్తారు...



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12వేలు ఇస్తామని చెప్పినవి ఎప్పుడు చెల్లిస్తారని శుక్రవారం జిల్లా కేంద్రంలోని కల్నల్ సంతోష్‌బాబు చౌరస్తా వద్ద ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యాపేట ఆటో డ్రైవర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేస్తున్న సందర్భంగా ఆటోడ్రైవర్లు వెల్లడించారు. ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఇస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. అంతేకాకుండా గత బిఆర్ఎస్ హయాంలో ఆటో డ్రైవర్లు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5లక్షల ప్రమాదభీమా ఇచ్చేవారని గుర్తు చేశారు. ఆటో డ్రైవర్లు కనీసం పిల్లల ఫీజులు కట్టుకోలేక కుటుంబాన్ని గడపలేక ఎంతోమంది ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. ఆటో డ్రైవర్లకు ఇస్తామన్న హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పై హైకోర్టు నాలుగు వారాలు స్టే విధించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ బిసి విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో కళాశాలలు,పాఠశాలలు బంద్ చేపట్టి హైదరాబాద్ రోడ్డులో గల రైల్వే ట్రాక్ వద్ద రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్ గౌడ్ మాట్లాడుతూ జనాభా తమాషా ప్రకారం బీసీలకు 42 శాతం కల్పిస్తూ జీవోలు చేసి ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లోయువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కారింగు నరేష్ గౌడ్,విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పొగాకు రవికుమార్ యాదవ్ ,కన్నబోయిన రాజ్ కుమార్ యాదవ్,శ్రీకాంత్,తరుణ్, కొంపల్లి రామన్న గౌడ్ ,సాయి శివ ,ప్రమోద్ ,సతీష్ ,మహేష్ ,పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## కెమిస్ట్రీలో హరిప్రసాద్‌కు ఎంజియు డాక్టరేట్ పట్టా

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగం అధ్యాపకురాలు డాక్టర్ వై ప్రశాంతి పర్యవేక్షణలో సింథసి స్ క్యాటలెటిక్ అండ్ బయలాజికల్ అప్లికేషన్స్ ఆఫ్ మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్ వర్క్స్ అంశంపై పరిశోధన చేసి తన పరిశోధనా పత్రాన్ని సమర్పించినందుకు గాను ఎంజియూ నుండి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. శుక్రవారం దేవరకొండ పట్టణానికి చెందిన పులిజాల రాములు కుమారుడైన హరిప్రసాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దేవరకొండలో ఇంటర్మీడియట్ శ్రీసత్యసాయి కాలేజ్ నందు, డిగ్రీ సిటీ కాలేజ్ హైదరాబాద్ లో ఆ తర్వాత పిజి జహీరాబాద్ లోని ఉస్మానియా యూనివర్సిటీ పిజి సెంటర్ మీర్జాపూర్ లో పూర్తి చేశారు.మెటల్‌ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్ భవిష్యత్తులో పర్యావరణ పరిరక్షణ, ఇంధన నిల్వ, ఔషధ సరఫరా,సెన్సర్ సాంకేతికతలలో విస్తృతంగా ఉపయోగపడతాయని తెలిపారు.ఇవి కార్బన్ డైఆక్సైడ్‌ను పట్టుకోవడం,నీటి శుద్ధి,హైడ్రోజన్ నిల్వ,పునరుత్పత్తి శక్తి ఉత్పత్తిలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. ఈ సాంకేతికతలు పరిశ్రమల,ఆరోగ్య రంగాల భవిష్యత్తును మార్చే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. ఈ సందర్భంగా రసాయన శాస్త్రం విభాగ అధ్యాపకులు, సహా పరిశోధకులు విద్యార్థులు హరిప్రసాద్ ను అభినందించారు.



# క్రీడ

## శతకంతో చెలరేగిన యశస్వీ

### కెరీర్‌లో ఏడో సెంచరీ






తొలి టెస్టులో ఇన్నింగ్స్ విజయంతో వెస్టిండీస్‌ను ఓడించిన భారత్ రెండో టెస్టులోనూ అదరగొడుతోంది. టాపార్డర్ బ్యాటర్లు దంచేయగా మొదటి రోజే మూడొందలు కొట్టింది టీమిండియా. విండీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న ఓపెనర్ యశస్వీ జైస్వాల్(173 నాటౌట్)దూకుడే మంత్రగా చెలరేగి సెంచరీతో గర్జించాడు. మూడో స్థానంలో పాతుకుపోవాలనుకుంటున్న సాయి సుదర్శన్(87) అర్ధ శతకంతో తడాఖా చూపించడంతో టీమిండియా భారీ స్కోర్ చేసింది. వీరిద్దరి జోరుకు ఆఖర్లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్(20 నాటౌట్) సమయోచిత బ్యాటింగ్ తోడవ్వగా భారత్ తొలి రోజు ఆట ముగిసే సరికి 2 వికెట్ల నష్టానికి 318 పరుగులు చేసింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025–27లో భారత జట్టు జోరు చూపిస్తోంది. ఇంగ్లాండ్ గడ్డపై సిరీస్ సమం చేసిన టీమిండియా స్వదేశంలో వెస్టిండీస్ భరతం పడుతోంది. తొలి టెస్టులో ఇన్నింగ్స్ విజయంతో విండీస్‌ను మట్టికరిపించిన భారత్ రెండో టెస్టులోనూ డ్రైవింగ్ సీట్లో ఉంది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (173 నాటౌట్: 253 బంతుల్లో 22 ఫోర్లు),సాయి సుదర్శన్(87) దంచికొట్టారు.కరీబియన్ జట్టుపైనే తొలి టెస్టు శతకం బాదిన యశస్వీ.. తనకు ఇష్టమైన ప్రత్యర్థిపనై ఆకాశమే హద్దుగా చెలరేగాడు. విండీస్ బౌలర్లకు కొరకరాని కొయ్యలా మారిన ఈ లెఫ్ట్ హ్యాండర్ సుదర్శన్‌తో కలిసి రెండో వికెట్‌కు 193 పరుగుల భాగస్వామ్యంతో జట్టును పటిష్టస్థితిలో నిలిపాడు.

టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న భారత జట్టుకు ఓపెనర్లు శుభారంభమిచ్చారు. తొలి టెస్టులో సెంచరీతో మెరిసిన కేఎల్ రాహుల్ (38) త్వరగానే ఔటైనా.. ఆ తర్వాత వచ్చిన సాయి సుదర్శన్ (87) క్రీజులో పాతుకుపోయాడు. వికెట్ బౌలింగ్‌కు సహకరించని పిచ్ మీద ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (173 నాటౌట్), అతడు పరుగుల పండుగ చేసుకున్నారు. ఈ క్రమంలోనే యశస్వీ తన కెరీర్లో ఏడో టెస్టు శతకం పూర్తి చేసుకున్నాడు.

అర్ధ శతకం తర్వాత 58 పరుగలు వద్ద వారికన్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన సుదర్శన్ ఎక్కువ సేపు క్రీజులో నిలవలేక పోయాడు. టీ తర్వాత అతడు వారికన్ ఓవర్లో ఎల్బీగా ఔటయ్యాడు. అనంతరం కెప్టెన్ శుభ్‌మన్ గిల్(20 నాటౌట్)తో యశస్వీ మరో హాఫ్ సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పాడు. వీరిద్దరూ అజేయంగా నిలవడంతో తొలి రోజు ఆట ముగిసే సరికి భారత్ రెండు వికెట్ల నష్టానికి రన్స్ చేసింది.

## వరల్డ్ కప్‌లో న్యూజిలాండ్ బోణీ

### కుప్పకూలిన బంగ్లాదేశ్..



మహిళల వన్డే వరల్డ్ కప్‌లో న్యూజిలాండ్ ఎట్టకేలకు బోణీ కొట్టింది. రెండు ఓటముల నుంచి తేరుకున్న కివీస్ శుక్రవారం బంగ్లాదేశ్‌పై పంజా విసిరింది. స్వల్ప స్కోరే చేసినా.. ఆల్‌రౌండ్ షోతో అదరగొడుతూ వంద పరుగుల తేడాతో గెలుపొందింది. కెప్టెన్ సోఫీ డెవినె బ్రూక్ హల్లిడె పోరాడగలిగే స్కోర్ అందించగా.. ఆ తర్వాత పేసర్ జెస్ కేర్ బంగ్లా టాపార్డర్ కుప్పకూల్చింది. స్పిన్నర్లు తిప్పేయగా వరుసగా వికెట్లు కోల్పోయిన బంగ్లా ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. బ్యాటింగ్ యూనిట్ సమిష్టి వైఫల్యంతో ఆ జట్టుకు వరుసగా రెండో ఓటమి ఎదురైంది. వరల్డ్ కప్ ఫేవరెట్‌గా టోర్నీలో అడుగుపెట్టిన న్యూజిలాండ్ తొలి విజయాన్ని రుచి చూసింది. మొదటి పోరులో ఆస్ట్రేలియా చేతిలో.. రెండో మ్యాచ్‌లో తంజిమ్ బ్రిట్స్ మెరుపు శతకంతో దక్షిణాఫ్రికాపై ఓడిన కివీస్.. బంగ్లాదేశ్‌ను చిత్తుగా ఓడించింది. స్వల్ప స్కోర్ల మ్యాచ్‌లో ప్రత్యర్థిని 127కే ఆలౌట్ చేసి వంద పరుగులతో సూపర్ విక్టరీ సాధించింది.

వరల్డ్ కప్‌లో బౌలింగ్‌లో అదరగొడుతున్న బంగ్లాదేశ్ బ్యాటింగ్‌లో తేలిపోతోంది. న్యూజిలాండ్‌ను తక్కువ స్కోర్‌కే కట్టడి చేసిన బంగ్లా ఛేదనలో మాత్రం చతికిలపడింది. కివీస్ పేసర్ మైర్ ఆదిలోనే ఓపెనర్ షర్మిన్ అక్తర్(3)ను ఔట్ చేసి బ్రేకిచ్చింది. ఆ తర్వాత వికెట్ కాపాడుకునేందుకు అపసోపాలు పడిన రుబియా హైదర్(4)ను జెస్ కేర్ వెనక్కి పంపింది. దాంతో.. 13 పరుగులకే బంగ్లా రెండో వికెట్ పడింది. ఓపెనర్లు డగౌట్ చేరడంతో కెప్టెన్ నిగర్ సుల్తానా (4), శోభన మొస్త్రే (2)లు జట్టును ఆదుకోవాలనుకున్నారు. దాంతో, బౌండరీలు కొట్టే సాహసం చేయలేదు వీళ్లు. కానీ, పవర్ ప్లే చివరి ఓవర్లో కేర్ మరో సారి దెబ్బకొడుతూ డేంజరస్ శోభన వికెట్ సాధించింది.

అంతే.. బంగ్లా కష్టాలు మరింత ఎక్కువయ్యాయి. పెద్దషాట్‌తో ఒత్తిడి తగ్గించుకోవాలనుకున్న నిగర్ సుల్తానా క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. ఫాహిమా ఖాతూన్ (34), రబెయా ఖాన్(25)లు భారీ ఓటమి తప్పించేందుకు ప్రయత్నించారు. వీరిద్దరూ అతికష్టమ్మీద జట్టు స్కోర్ వంద దాటించారు. ఎనిమిదో వికెట్‌కు 44 రన్స్ చేసిన రబెయను కేర్ ఔట్ చేయడంతో బంగ్లా ఇన్నింగ్స్ ముగిసేందుకు ఎంతో సమయం పట్టలేదు. చివరి బ్యాటర్ అక్తర్‌ను తహుహు బౌల్డ్ చేయడంతో బంగ్లాదేశ్ 127కే ఆలౌటయ్యింది.

**హల్లిడే, డెవినె రాణించగా**

తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్‌ను బంగ్లాదేశ్ స్వల్ప స్కోర్‌కే కట్టడి చేసింది. టాపార్డర్ కుప్పకూలగా.. బ్రూక్ హల్లిడే (69) కెప్టెన్ సోఫీ డెవినె (63) అర్ధ శతకాలతో రాణించారు. దాంతో.. అలవోకగా 230 వరకూ కొట్టేలా కనిపించింది వైట్ ఫెర్న్స్. కానీ, డెత్ ఓవర్లలో బంగ్లా బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేసి వికెట్ల వేట కొనసాగించారు. ఆఖర్లో వికెట్ కీపర్ ఇసబెల్లా గేజ్ (12), లీ తహుహు(12నాటౌట్) పోరాటంతో న్యూజిలాండ్ గౌరప్రదమైన స్కోర్ చేసింది. మరుఫా అక్తర్ వేసిన 50వ ఓవర్లో గేజ్ సిక్స్, ఫోర్ బాదడంతో కివీస్..నిర్ణీత ఓవర్లలో 227 పరుగులు చేయగలిగింది. బంగ్లా బౌలర్లలో రబెయా ఖాన్ మూడు వికెట్లు తీసింది.

# ఫోకస్ సైన్స్




మనం ఊహకు కూడా అందనంత దూరం నుంచి వచ్చిన సంకేతం వెనుక దాగివున్న రహస్యాన్ని ఛేదించడానికి శాస్త్రవేత్తలు, పరిశోధకులు, రేడియో తరంగాల నిపుణులు తలమునకలై ఉన్నారు. ఈ సంకేతం మనకు తెలిసిన విశ్వం నుంచి కాకుండా, మనకు సమాంతరంగా నడుస్తున్న మరో వాస్తవిక విశ్వం నుంచి వచ్చి ఉండవచ్చన్న అనుమానం వ్యక్తమవుతున్నది. పూర్తి స్థాయిలో పరిశోధన జరిగితేగానీ, రహస్యం వీడదు. మొత్తం మీద ఈ సంకేతం ప్రపంచ వ్యాప్తంగా ఉత్కంఠ సృష్టిస్తున్నది. ఆందోళనకు కారణమవుతున్నది. ఈ సంకేతం, అంతరిక్షంలోని అసాధారణ తరంగాలను పసిగట్టటానికి రూపొందించిన అత్యంత సున్నితమైన రేడియో టెలిస్కోపులు గుర్తించాయి. అయితే ఇది చూపిస్తున్న ఫ్రీక్వెన్సీలు, తరంగ నమూనాలు ఇప్పటివరకు తెలిసిన ఏ రకమైన సహజ లేదా ఖగోళ మూలాలతో సరిపోవడంలేదు. అందుకే, ఇది సమాంతర విశ్వం నుంచి వచ్చిందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. అదే రుజువైతే, మానవ చరిత్రలోనే అద్భుతమైన శాస్త్రీయ కనుగొనికగా నిలుస్తుంది. ఎందుకంటే ఇది భౌతిక శాస్త్రం, స్థలకాలం, సృష్టి స్వభావం పట్ల మన అవగాహనను ఈ కొత్త మూలంగా మార్చివేస్తుంది. భౌతిక శాస్త్రవేత్తలు, ఖగోళ శాస్త్రవేత్తలు ఈ సంకేతం మూలం గురించి అనేక సిద్ధాంతాలను పరిశీలిస్తున్నారు. కొంతమంది ఇది పరిమాణాల మధ్య సంభాషించగల అధునాతన నాగరికతల జాడ కావచ్చని సూచిస్తున్నారు. మరికొందరు ఇది సహజ ప్రక్రియల్లో ఒకటి కావచ్చని, ఇప్పుడే మన అవగాహనలోకి వస్తోందని అంటున్నారు. ఏ సిద్ధాంతం నిజమైనదైనా, ఈ సంకేతం ప్రపంచవ్యాప్తంగా సమాంతర విశ్వాలు, బహువిశ్వ సిద్ధాంతం (ఒకటి కంటే ఎక్కువ విశ్వాలు ఉన్నాయనే అభిప్రాయం) వంటి భావనలపై చర్చలను కొత్త దశకు తీసుకువెళ్లింది. ఇప్పటి వరకు సమాంతర విశ్వాలు కథలలో, విజ్ఞాన సాహిత్యంలో మాత్రమే ఉన్న విషయం. కానీ ఈ రహస్య సంకేతం ఆ భావనను యథార్థానికి చేరువ చేస్తోంది. నిపుణులు ఇంకా దీనిపై విస్తృత పరిశోధన అవసరమని హెచ్చరిస్తున్నారు. కానీ ఈ కనుగొనిక ఆధునిక సాంకేతికత మనలను ఎంత దూరం దృష్టి వేసే స్థాయికి చేర్చిందో చూపిస్తోంది. ఈ రహస్య సంకేతం మనకు విశ్వం ఎంత విచిత్రమైందో, అజ్ఞాత రహస్యాలతో నిండిందో మరోసారి గుర్తుచేస్తోంది. ఇది మన వాస్తవికతపైనే ప్రశ్నలు లేవనెత్తుతూ, మన ఆసక్తులు మరియు శాస్త్రీయ అన్వేషణల సరిహద్దులను దాటి ముందుకు పోవడానికి ప్రేరణనిస్తుంది.

## తొలి జీవి లుకా



భూమిపై జీవజాలం ఏకకణ జీవులతో మొదలైందని అంటారు. కొన్ని కోట్ల సంవత్సరాలకు పూర్వం ఉద్భవించిన తొలి జీవిని 'లాస్ట్ యూనివర్సల్ కామన్ యాన్సిస్టర్' (ఎల్‌యుసికె/ లుకా)గా పేర్కొంటారు. అంటే, భూమిపైన ఒకప్పుడు లేదా ప్రస్తుతం ఉన్న అన్ని జీవాలకూ లుకాయే మూలం. డైనోసార్లు అంతరించి పోవడానికి చాలాకాలం ముందు.. అంటే మొక్కలు, చేపలు ఉద్భవించే కాలంలో లుకా జీవించేది. మనము ఇప్పుడు చూస్తున్న వృక్షాలు, జంతువులు, సూక్ష్మ జీవులు అన్నింటికీ ఈ ఒక్క జీవే కీలకం. సుమారు 3.5 నుంచి 4 బిలియన్ల సంవత్సరాల క్రితం భూమిపై ఉండేది లుకా. ఇది మొదటి జీవి కాకపోవచ్చన్న అనుమానాలు కొంతమంది శాస్త్రవేత్తల్లో ఉన్నప్పటికీ, ఇప్పటి వరకూ కొనసాగిన పరిశోధనలు, అధ్యయనాలను అనుసరించి, లుకాను భూగోళంపై తొలి జీవిగా అంగీకరించక తప్పదు. లుకా జీవించిన కాలంలో భూమి చాలా భారీగా ఉండేది. అగ్నిపర్వతాలు ఎప్పటికప్పుడు పేలుతుండేవి. సముద్రాలు ఎగసిపడుతూ, కొన్నిసార్లు ఎండిపోతూ, విచిత్ర వాతావరణం నెలకొని ఉండేది. ఇలాంటి అత్యంత భయానకమైన పరిస్థితుల్లో లుకా జీవించింది. మెదడు, ఎముకలు, కన్నులు లేని ఈ జీవి ఒక్క కణంతో కష్టాలకు ఎదుర్కొంది. జీవజాలానికి పునాదిగా నిలిచింది. మనిషితోసహా అనేకానేక జీవరాశులను అందించింది. నేడు జెనిటిక్స్ అనే శాస్త్రం ద్వారా, అన్ని జీవుల మధ్య ఉన్న సమానతలను తెలుసుకుంటున్నారు శాస్త్రజ్ఞులు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, డిఎన్ఎ కోడ్‌ను విశ్లేషించినప్పుడు, భూమిపైన ఉన్న వివిధ జీవజాతుల తీరు వేరువేరుగా ఉన్నట్టు గుర్తించారు. అయితే, అన్నింటిలోనూ లుకాను కనుగొన్నారు. నాటి లుకాలో 355 జన్యువులు ఉండేవి. ఇప్పటికీ ఈ విధానాన్ని చాలా జీవుల్లో చూడవచ్చు. మొత్తం మీద లుకాకు సంబంధించిన సమాచారం మనకి జీవన చరిత్రలో ఎంతో అద్భుతమైన విజ్ఞానాన్ని ఇస్తున్నది. మనమంతా ఆ సూక్ష్మ జీవి వంశీయులమే అని నిరూపిస్తున్నది. ఇది మనలో ప్రతి ఒక్కరికి ప్రాచీనతను సూచిస్తుంది. అప్పుడు జీవ శాస్త్రం, మన పరస్పర సంబంధాలు, భూమిపై జీవం ఎలా సాగింది అన్నది బాగా వివరిస్తుంది.

## సూర్యుడికే వలయాలు ఉంటే?

ఇది ఊహాజనితమేగానీ, ఎంతో ఆసక్తికరమైన ప్రశ్న. శని (శాటర్న్) గ్రహం మాదిరిరే సూర్యుడికి కూడా వలయాలు (రింగ్స్) ఉంటే ఏమవుతుంది? అప్పుడు మన సౌర మండలం పూర్తి భిన్నంగా కనిపిస్తుంది. ఆ వలయాలు ధూళి, మంచు భాగాల మిశ్రమంగా ఉండి,



సూర్యుని తీవ్ర కాంతితో ప్రకాశిస్తూ ఉండేవి. భూమి నుంచి చూస్తే, ఆ వలయాలు ఆకాశంలో అత్యంత తేజోమయమైన రేఖలా, పాలపుంతకన్నా బలంగా మెరుస్తూ కనిపించేవి. ఈ రింగ్స్ సమీకరణం వల్ల గ్రహాల ఎల్లలు, ఆ భౌతిక పదార్థాల పంపిణీ కూడా మారిపోయేది. అంతేగాక, గ్రహాల పుట్టుక కూడా భిన్నంగా మారేది. సూర్య కాంతి, గ్రావిటీ ప్రభావంతో ఇలాంటి వలయాలు శాశ్వతంగా ఉండిపోయేవి కావు. అవి తరచూ మారుతూనే, అస్థిరంగా ఉంటాయి. అయినా, ఇలాంటి వలయాలు ఉంటే మనకు ఒక అద్భుతమైన, అద్భుత దృశ్యం ఆకాశంలో ఆవిష్కృతమయ్యేది. ఏదిఏమైనా ఊహ కూడా ఒక్కోసారి ఎంతో ఆనందాన్నిస్తుంది.

# బిసి రిజర్వేషన్ల ప్రక్రియ సామాజిక బాధ్యత

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్



**ప్రజాపక్షం/మంచిర్యాల :** బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలనే సామాజిక బాధ్యత ప్రభుత్వం గుర్తించినప్పటికీ, అందుకు చట్ట భద్రత చర్యలు లేకుండా కేవలం రాజకీయ లాభాల కోసం బిసి రిజర్వేషన్ల అంశాన్ని తెరపైకి తేవడం దురదృష్టకరమని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ అన్నారు. శుక్రవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బిసిల పట్ల సామాజికంగా ఆలోచన చేసిన మాట వాస్తవం అయినప్పటికీ, చట్ట పరిధిలో ఆలోచించకపోవడం శోచనీయమని ఆయన విమర్శించారు. ప్రభుత్వం రాజ్యాంగం నిర్దేశించిన పరిమితులను పట్టించుకోకుండా, ప్రజల న్యాయ హక్కులను తుంగలో తొక్కుతోందని ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం బిసి రిజర్వేషన్ల అంశాన్ని వాడుకోవడం ప్రజాస్వామ్యంపై దాడి అని, బిసిల హక్కులపై దౌర్జన్యమని ఆయన వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా బిసిలకు 50 శాతం రిజర్వేషన్ పరిమితిని తొలగించకుండా, కొత్త రిజర్వేషన్లు అమలు చేయడం అసాధ్యమని స్పష్టంచేశారు. హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్య పునాదులకు అద్దం పట్టిందని, ప్రభుత్వ నిర్ణయాలు చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. రాజ్యాంగ పరమైన సవరణలు చేపట్టి బిసిలకు చట్టబద్ధ రక్షణ కల్పించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని తెలిపారు. రాజకీయ లాభాల కోసం బిసిలను మోసం చేయడం ప్రజాస్వామ్యాన్ని అవమానపరచడమేనన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా వ్యవహరించడం ఈ గందరగోళానికి కారణమైందన్నారు. సామాజికంగా, రాజకీయంగా బిసిలను అణగదొక్కే విధానాన్ని కమ్యూనిస్టుపార్టీ ఎప్పటికీ అంగీకరించదని స్పష్టం చేశారు. బిసిల హక్కుల సాధన కోసం సిపిఐ ప్రజా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, జిల్లా నాయకులు మేకల దాసు, కలిందర్ అలీ ఖాన్, వెంకట స్వామి, చంద్రశేఖర్, చిప్ప నర్సయ్య, కారుకూరి నగేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### బిజెపి, బిఆర్ఎస్ మద్దతు పలకాలి...

**హుజూర్‌నగర్ :** బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలు వారి అభివృద్ధికి దిశా నిర్దేశం చేస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌పై అసెంబ్లీలో అన్ని రాజకీయపార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించాయని గవర్నర్ కూడా వెంటనే ఆ బిల్లును ఆమోదించాలని ఆయన డిమాండ్ చేశారు. అసెంబ్లీలో అన్ని పార్టీలు ఆమోదించిన బిల్లుపై బయట రాజకీయాలు చేయడం తగదన్నారు. బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు స్పష్టమైన విధానంతో బిసి రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలిపి ప్రజల అభిప్రాయాలను గౌరవించాలన్నారు. బిసి కులగణన ప్రకారం వారికి ఉన్న ప్రాతినిధ్యం ప్రకారం హక్కులు కలిగి ఉండటం సహజం అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం బిసి కులగణన జరిపి రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని స్వాగతిస్తున్నామని, దానికి అన్ని అడ్డంకులు తొలగి దేశంలోనే మొదటిసారిగా తెలంగాణ రాష్ట్రంలో అమలు కావడం జరగాలని చారిత్రాకాంశం లాగా మిగిలిపోవాలని ఆకాంక్షించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, యల్లావుల రమేష్, రైతుసంఘం పట్టణ లక్ష్యుడు జక్కుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలు గమనిస్తున్నారు

**నిజామాబాద్ :** బిసి రిజర్వేషన్ల బిల్లుపై బిజెపి చేస్తున్న కాలయాపనను ప్రజలు గమనిస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో బిసి బిల్లుపై బిజెపి చేస్తున్న కాలయాపనను నిరసిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్ర అసెంబ్లీ సాక్షిగా బిసి రిజర్వేషన్ల బిల్లుకు బిజెపి కట్టుబడి ఉందని ఒకవైపు మాట్లాడుతూనే, మరో వైపు కోర్టులో కేసులు వేస్తూ కేంద్రంలో రిజర్వేషన్ల బిల్లును ఆమోదించకుండా అడ్డుకుంటూ డ్రామాలాడుతుందన్నారు. బిజెపికి బిసిల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న 42శాతం రిజర్వేషన్ల బిల్లుకు తక్షణం ఆమోదం తెలిపి రిజర్వేషన్ల పెంపును తొమ్మిదో షెడ్యూల్ చేర్చాలన్నారు. ఒకవైపు స్థానిక సంస్థలు ఎన్నికల నిర్వహించకపోవటంతో ఇప్పటికే గ్రామాలలో పాలన కుంటుపడిందని, దీంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. బిసి బిల్లును అడ్డుకుంటున్న బిజెపికి వ్యతిరేకంగా బిసిలంతా ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ నగరకార్యదర్శి ఓమయ్య, నాయకులు హన్మాండ్లు, రఘురాం, అంజలి, రాధాకుమార్, ప్రసాద్, గోవర్ధన్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.







# పల్లా వెంకట్‌రెడ్డికి ఘనసన్మానం



**ప్రజాపక్షం/నాంపల్లి:** ఇటీవల చండీగఢ్‌లో జరిగిన సిపిఐ 25వ జాతీయ మహాసభలలో సిపిఐ జాతీయ కార్యదర్శిగా ఎన్నికైన పల్లా వెంకట్ రెడ్డికి సిపిఐ నల్లగొండ జిల్లా నాంపల్లి మండల నాయకులు శుక్రవారం హైదరాబాద్ బండ్లగూడలోని గిరిప్రసాద్ భవన్‌లో పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.అంజాచారి మాట్లాడుతూ నాడు సామాన్య కార్యకర్తగా ఉన్న పల్లా వెంకట్‌రెడ్డిని జాతీయ కార్యదర్శిగా ఎన్నుకోవడం తెలంగాణ రాష్ట్రానికి, నల్లగొండ జిల్లాకు గర్వకారణమన్నారు. సిపిఐలో కష్టపడే కార్యకర్తలకు, నాయకులకు గుర్తింపు ఉంటుందనడానికి పల్లా ఎన్నిక నిదర్శనమన్నారు. పార్టీలో పని చేసే నాయకులు, కార్యకర్తలు నిబద్ధతతో పనిచేస్తే అవకాశాలు అందివస్తాయని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. కమ్యూనిస్టులతో కలిసి పనిచేయడం నేటి తరానికి అవసరమని గుర్తుచేశారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావును పరామర్శించారు. పల్లాను సన్మానించిన వారిలో సిపిఐ నాంపల్లి మండల కార్యదర్శి సుదనబోయిన రమేష్, నల్లగొండ జిల్లా ప్రజానాట్యమండలి అధ్యక్షుడు జనంపాట జగన్, నల్లగొండ జిల్లా ఎఐఎస్ఎఫ్ కార్యదర్శి మురళీకృష్ణ, సహాయ కార్యదర్శి నేతాల రాజు, నాయకులు ఊరుపాక వెంకటయ్య, కోరే సత్తయ్య, మోగుదాల సైదమ్మ, పల్లెటి దశరథ, బుషిపాక ప్రశాంత్, బుషిపాక యాదయ్య, నేతాల నరేష్, సుంకశాల రాములు, పొదిళ్ల తిరుమలేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులపై ఫీజుల భారం మోపొద్దు

### ఎఐఎస్ఎఫ్ డిమాండ్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ కోర్సుల మొదటి సంవత్సరం విద్యార్థులకు భారీగా పెంచిన వివిధ రకాల ఫీజులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ కాకతీయ విశ్వ విద్యాలయం పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ కోర్సులకు సంబంధించి ఈ ఏడాది మొదటి సంవత్సరం ప్రవేశాలు పొందిన విద్యార్థులకు వివిధ రకాల ఫీజులను భారీగా పెంచిందన్నారు. ఒక్కో విద్యార్థికి గతంలో రిజిస్ట్రేషన్ ఫీజు రూ.80 లు ఉండగా ఇప్పుడు రూ.1200లకు పెంచారని, రికగ్నేషన్ ఫీజు గతంలో రూ.400ఉండగా ఇప్పుడు రూ.800లకు, ఐయుడిఎఫ్ ఫీజు గతం లో రూ.60 ఉండగా ఇప్పుడు రూ. 300లకు, ఎస్‌డబ్ల్యూఎఫ్ ఫీజు గతంలో రూ.50 ఉండగా ఇప్పు డు రూ.200లకు పెంచి విద్యార్థులపై తీవ్ర భారాన్ని మోపారన్నారు. గతంలో ఒక్కో విద్యార్థి వివిధ రకాల ఫీజుల కింద రూ.1340 చెల్లించారని ఇప్పుడు ఏకంగా అన్ని ఫీజులు కలిపి రూ. 3,250కు పెరిగిందన్నారు. దీంతో ఒక్కో విద్యార్థిపై సుమారు రూ.రెండువేల ఫీజు భారం అధికం గా పడుతుందన్నారు. పేద విద్యార్థులకు పెంచిన ఫీజులు భారమవుతాయని, తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. లేని పక్షంలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని రామకృష్ణ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శివ, వంశీ, మనోజ్, జిల్లా నాయకులు పవన్, గోపి, ఉపేందర్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.




# పెంచిన ఆర్‌టిసి బస్సు చార్జీలు తగ్గించాలని సిపిఐ నిరసన

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** పెంచిన ఆర్‌టిసి బస్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా జగద్గిరిగుట్ట చివరి బస్టాప్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మహిళలకు ఉచిత బస్సు' పేరిట 'మహాలక్ష్మి' అభినందనీయమని, కాని నష్టాల సాకుతో హైదరాబాద్ నగర ప్రజలు, విద్యార్థులపై చార్జీల భారాన్ని మోపడం తగదన్నారు. రెండు సంవత్సరాలుగా రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు పూర్తిగా తగ్గిన నేపథ్యంలో మరోసారి టికెట్ల రూపంలో చార్జీలు పెంచి నగర ప్రజలు, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయవద్దని కోరారు. సిఎం రేవంత్ రెడ్డి పేద ప్రజలపై భారం పడకుండా పెంచిన చార్జీలను వెంటనే తగ్గించి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ సహాయ కార్యదర్శి హరినాథ్‌రావ్, ఎఐటియుసి కార్యదర్శి శ్రీనివాస్, ప్రజానాట్య మండలి అధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు నర్సింహారెడ్డి, వెంకటేష్, ఇమామ్, చంద్రయ్య, శ్రీనివాస్‌చారీ, రాజు, సామెల్, యాదగిరి, నర్సింహ, చంద్రకాంత్, గురప్ప, ఆశప్ప, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## డిఎస్‌పి సబితను సన్మానించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి డివిజన్ పరిధిలోని చక్రీపురం నాగార్జున నగర్ కాలనీకి చెందిన దరవత్ సబిత ఇటీవల విడుదలైన గ్రూప్ 1 ఫలితాల్లో 303 ర్యాంక్ సాధించి డిఎస్‌పిగా ఎంపిక కావడంతో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఏఎస్ రావు నగర్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషా సోమశేఖర్‌రెడ్డిలు ఇంటికి వెళ్లి సన్మానించి అభినందనలు తెలిపారు. సబితను ఆదర్శంగా తీసుకుని ఉన్నత చదువులు చదవాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, శివగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు కాపాడాలి



**ప్రజాపక్షం/కాప్రా:** ఉప్పల్ నియోజకవర్గంలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలంటూ నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షుడు పరమేశ్వర రెడ్డి కోరారు. శుక్రవారం కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజ్‌తో కల్సి జిల్లా కలెక్టర్ మనుచౌదరిని కల్సి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాప్రా మండలంలో ప్రభుత్వ భూములకు సంబంధించి నెలకొన్న భూవివాదాలు అపరిష్కృతంగా ఉన్నాయని, వీటిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. కబ్జాదారుల కోరల్లోంచి ప్రభుత్వ భూములను ప్రభుత్వ విద్య, వైద్య సంస్థలకు కేటాయించాలని కోరారు.




## ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ ఫెయిర్

**ప్రజాపక్షం/చర్లపల్లి:** నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఫెయిర్ ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కీసర మండల విద్యాశాఖ అధికారులు జమదగ్ని, చీర్యాల ప్రధాన ఉపాధ్యాయులు రవీందర్ హాజరై స్కూల్ ప్రధానోపాధ్యాయులు రాములుతో పాటు జ్యోతి ప్రజ్వలన చేశారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలలో నమూనాలు తయారు చేశారు. సైనికులకు చలికాలంలో కూడా వేడిగా ఉండే సోలార్ ప్యానెల్ కోట్లు, ఫ్యాక్టరీ నుండి వచ్చే కాలుష్యాన్ని ఫిల్టర్ చేసే నమూనాలు తయారు చేశారు. ఈ కార్యక్రమంలో అగస్త్య ఫౌండేషన్ సభ్యులు త్రివేణి, ఆఫ్సాన్, ఉపాధ్యాయులు రమ, సత్యశ్రీ, కమల, అర్చన, తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల అభివృద్ధికి మరో అడుగు

రూ.10 కోట్ల నిధులతో 60 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులకు ప్రారంభోత్సవం



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్ సాయి రెసిడెన్సీ నుండి 28వ డివిజన్ బంగారు మైసమ్మ గుడి వరకు రూ.10 కోట్ల హెచ్ఎండిఏ నిధులతో నిర్మించనున్న 60 ఫీట్ల బిటి రోడ్డు విస్తరణ పనులను శుక్రవారం నగర మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి ప్రజా ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని అన్నారు. బోడుప్ప+ల్ మున్సిపల్ కార్పొరేషన్ సమగ్రాభివృధి కోసం జిల్లా ఇంచార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ లు తమ వంతు సహాయ సహకారాలను అందిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నో రోజులుగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు విస్తరణ పనులు ఎట్టకేలకు ప్రారంభం కావడంతో నగర ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ బి బ్లాక్ ప్రధాన కార్యద ర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు కొత్త చందర్ గౌడ్, సుమన్ నాయక్, చీరాల నర్సింహా, మాజీ కోఆప్షన్ మెంబర్ రంగా బ్రాహ్మన్న గౌడ్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్ గౌడ్, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పరిహారం మంజూరు చేయండి

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు పట్టణ శివారులో చేపడుతున్న బైపాస్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న భూ బాధితులను వెంటనే పరిహారం అందించాలని కోరుతూ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి వికాస్ రాజ్‌ను కలసిన తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి వినతి పత్రాన్ని అందజేశారు. బైస్ రోడ్డు బాధితులకు పరిహారంగా రూ. 25కోట్ల నిధులు మంజూరు చేస్తూ జిఒ జారీ చేయాలని కోరారు. ఇందుకు గాను ప్రిన్సిపల్ సెక్రెటరి వికాస్‌రాజ్ సానుకూలంగా స్పందించి అతి త్వరలో జిఒ జారి చేస్తామని హామీ ఇచ్చారు. ఎంఎల్ఏ వెంట టిపిసిసి ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ నాయక్ తదితరులు ఉన్నారు.



## గవాయ్‌పై దాడి దేశ న్యాయ వ్యవస్థపై దాడిగా భావిస్తున్నాం : ఆనంద్

**ప్రజాపక్షం/వికారాబాద్:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ పై జరిగిన దాడిని ఖండిస్తున్నాం, ఈ దాడిని దేశ న్యాయవ్యవస్థపై జరిగిన దాడిగా భావిస్తున్నాం దాడిపై లోతైన విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మహాజన సోషలిస్ట్ పార్టీ అధ్యక్షులు ఆనంద్ అన్నారు. తెలంగాణ రాష్ట కార్యదర్శి ప్రశాత్ పాల్గొని మాట్లాడుతూ భారత అత్యున్నత న్యాయ వ్యవస్థ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయముర్తి ఆర్. గవాయ్ పై జరిగిన దాడిని రాజ్యంగంపై దాడిగా భవిస్తున్నాం అని అన్నారు. న్యాయాన్ని కాపాడే ప్రధాన న్యాయముర్తిపై ఈరకమైన దాడులకు పాల్పడితే సామన్యుల పరిస్థితి ఏంటన్నారు. ఇలాంటి దాడులు పునరావవుతం కావద్దు అన్నారు. దాడికి పాల్పడిన రాకేష్ కిషోర్ వెరుక ఉన్న వారిపై లోతైనవిచరణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో మల్లిఖర్జున ప్రశత్ , స్వామిదాస్ , కృష్ణ , సుభాష్ , మహేందర్ , పుష్పరాణి , సునీత తదితరలు పాల్గోన్నారు.

# ఆక్రమణలు తొలగించిన హైడ్రా

* దాదాపు 12.50 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం
* దాదాపు రూ.1100 కోట్ల విలువైన భూమిని కాపాడినహైడ్రా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో పలు చోట్ల ఆక్రమణలను శుక్రవారం హైడ్రా తొలగించింది. ఒకేసారి నాలుగు ప్రాంతాల్లో కబ్జాల నుంచి ప్రభుత్వ భూమికి విముక్తి కల్పించింది. 12.50 ఎకరాల మేర ప్రభుత్వ భూమిని కాపాడింది. దీని విలువ రూ. 1100ల కోట్ల వరకూ ఉంటుందని అంచనా. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 10లో మొత్తం 5 ఎకరాల మేర ఉన్న కబ్జాలను తొలగించింది. ఇక్కడ ఈ భూమి విలువ రూ. 750 కోట్ల వరకూ ఉంటుందని భావిస్తున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 7.50 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోగా, రంగారెడ్డిజిల్లాలో ప్రజావసరాలకు ఉద్దేశించిన 680 గజాల స్థలాన్ని హైడ్రా కాపాడింది.

**తప్పుడు సర్వే నెంబరుతో..**

షేక్‌పేట మండలం, బంజారాహిల్స్ రోడ్డు నంబరు 10లోని సర్వే నంబరు 403లోని 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జాల చెర నుంచి హైడ్రా విడిపించింది. దీని విలువ రూ. 750 కోట్ల వరకూ ఉంటుందని అంచనా. లేని సర్వే నంబరు(403/52 )తో అన్ రిజిస్టర్డ్ సేల్‌డీడ్‌ను సృష్టించి ఈ భూమి తనదంటూ పార్థసారధి అనే వ్యక్తి కబ్జాకు పాల్పడినట్టు రెవెన్యూ అధికారులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. తాగు నీటి వ్యవస్థను మెరుగుపరిచేందుకు ఇందులో 1.20 ఎకరాల భూమిని జలమండలికి ప్రభుత్వం ఇచ్చినా అక్కడ పనులు చేయకుండా అడ్డుకుంటున్నారనేది మరో ఫిర్యాదు. ఈ రెండు ఫిర్యాదులను హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రభుత్వ భూమిగా నిర్ధారించుకుని ఆక్రమణలను తొలగించింది.

**వేట కుక్కలతో కాపలా..**

చుట్టూ ఫెన్సింగ్ వేసి బౌన్సర్‌లతో పాటు వేటకుక్కలతో కాపాలా పెట్టి అందరినీ భయభ్రాంతులకు గురిచేస్తుండడంతో పార్థసారథిపై బంజారా హిల్స్ పోలీసు స్టేషన్‌లో 4 క్రిమినల్ కేసులు కూడా నమోదయ్యాయి. కోర్టులో వివాదం ఉండగా, మొత్తం 5 ఎకరాల భూమిని తన ఆధీనంలోకి తీసుకొని అందులో షెడ్డు లు వేసి, ప్రభుత్వ భూమినే అడ్డా వేసుకొని మద్యం సేవించి భయభ్రాంతులకు గురి చేస్తున్నట్టు ఫిర్యాదులున్నాయి. ఫేక్ సర్వే నెంబర్ (403/52)తో ప్రభుత్వ భూమి కొట్టేసే ప్రయత్నం చేస్తున్నారని రెవెన్యూ అధికారులు కేసులు పెట్టారు. షేక్‌పేట్ రెవెన్యూ అధికారుల లేఖ మేరకు భారీ బందోబస్తు మధ్య ఆక్రమణలను హైడ్రా తొలగించింది. పార్థసారథి వేసిన ఫెన్సింగ్‌తో పాటు లోపల ఉన్న షెడ్డులను నేలమట్టం చేశారు.

**మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోనూ..**

కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం మహాదేవపురం లో పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు కబ్జాలకు గురి అవుతున్నట్టు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా క్షేత్రస్థాయిలో విచారించి చర్యలుతీసుకుంది. 3.50 ఎకరాల మేర పార్కు స్థలంలో ఆక్రమణలను తొలగించింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ విలేజ్ ఏజి ఆఫీసు ఉద్యోగులకు చెందిన హౌసింగ్ సొసైటీ లేఔట్‌లో కూడా పార్కులు, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన 3 ఎకరాల భూమి కబ్జాకు గురికాగా హైడ్రా ఆక్రమణలను తొలగించింది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెంట్ మండలం తట్టి అన్నారం గ్రామం శ్రీలక్ష్మి గణపతి కాలనీలో కూడా 680 గజాల మేర విస్తరించిన పార్కు ఆక్రమణలను కూడా హైడ్రా తొలగించింది. ఇందులో 270 గజాల ప్లాట్ తనకుందంటూ పార్కు స్థలంలోనే పాగా వేసేందుకు ప్రయత్నించగా స్థానికులు హైడ్రాను ఆశ్రయించారు.



## ఆర్‌టిఐపై అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/దుండిగల్ :** కొంపల్లి మున్సిపల్ కార్యాలయంలో ఆర్టిఐ వారోత్సవాలు 2025 లో భాగంగా ఆర్టిఐ అవగాహన సదస్సు కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ ఎన్.కృష్ణారెడ్డి రైట్ టు ఇన్ఫర్మేషన్–2005 చట్టం గురించి, ఒక అధికారి ఆర్‌టిఐ అభ్యర్థనను ఏ విధంగా పరిష్కరించాలి. వాటి నియమా లు గురించి మున్సిపల్ స్టాఫ్, ఆర్‌టిఐ యాక్టివిస్టులకు అవగాహన కల్పించా రు. ఈ కార్యక్రమంలో (గూప్ 1 ద్వారా ఎంపికై (ట్రైనింగ్ పొందుతున్న మున్సిపల్ (గేడ్ 2 అధికారులు, డి.ఈ.ఈ తిరుపతి, మేనేజర్ ఎ.రవికుమార్ ఆర్ఐ రాజు, సీనియర్ అసిస్టెంట్, వార్డ్ ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ప్రమాద బీమా బాండ్లు

### జర్నలిస్టుల సంక్షేమానికి సహకరిస్తా






**ప్రజాపక్షం/చర్లపల్లి:** జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం కాప్రా ప్రెస్ క్లబ్ కార్యాలయంలో వ్యక్తిగత బీమా బాండ్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని మాట్లాడుతూ జర్నలిస్టులు ఇక్యం గా ఉండి వారి హక్కులను సాధించుకోవాలన్నారు. విలువలతో పనిచేసిన జర్నలిస్టులకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని ఆయన అన్నారు.

కాప్రా ప్రెస్‌క్లబ్ సభ్యులకు వ్యక్తిగత ప్రమాద బీమాను చేయించిన స్థానిక నాయకుడు పాండాల శివకుమార్‌గౌడ్‌ను, అదే విధంగా జర్నలిస్టుల సంక్షేమనిధికి సహకరించిన మాజీ కార్పొరేటర్ పావనీరెడ్డి, స్థానిక నాయకులు రాఘువరెడ్డి, వంజరి ప్రవీణ్, సంఘ సేవకులు బండే గౌడలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

కాప్రా ప్రెస్‌క్లబ్ సభ్యులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బాండ్లను అందిచారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు మోతే వెంకట్‌రెడ్డి, టి. మల్కయ్య, కెసి మోహన్, సత్యనారాయణ, శ్రీనివాస్‌గౌడ్, సహదేవచారి, జ్యోతిర్మయాచారి, చంద్రమౌళి, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఉల్లోజు శ్రీనివాస్, వేముల శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.విజయ్, కోశాధికారి రుద్రగోని నర్సింగ్‌గౌడ్, ఉపాధ్యక్షులు ఆదిమూలం శ్రీనివాస్, ఎండి అక్బర్, నటరాజ్, శనిగరం అశోక్, సాంబశివ, బసంత్‌రెడ్డి, బాల్‌రెడ్డి, బాల్ రాజ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## వివాహానికి ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** బిజెవైఎం జాతీయ కోశాధికారి పిఎం సాయిప్రసాద్ శుక్రవారం ఆల్వాల్ మండ లం మచ్చబొల్లారం ప్రాంతానికి చెందిన మహ్మద్ సోదరి ఫర్హానా వివాహానికి సామాజిక సేవ లో భాగంగా రూ.25వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. కుల మతాలతో సంబంధం లేకుండా తాను వివాహాలకు, విద్యకు గాను పేదరికంలో ఉండే కుటుంబాలకు సాయం అందిస్తున్నానని ఆయన తెలిపారు.



## విద్యార్థుల్లో సాంకేతిక స్ఫూర్తికి రోబోటిక్స్ శిక్షణ బీజం

**ప్రజాపక్షం/వికారాబాద్:** వికారాబాద్ జిల్లా విద్యార్థుల్లో సాంకేతిక స్ఫూర్తికి రోబోటిక్ శిక్షణ బీజం వేసిందని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. తెలంగాణ రాష్టంలోని పాఠశాల విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలను అందించేందుకు సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్స్‌లెన్స్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న రోబోటిక్స్ ఇన్ ఆకడెమిక్స్ ఆర్ఐ కార్యక్రమం వికారాబాద్ జిల్లాలో విజయవంతంగా అమలైందని అన్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని సంఘం లక్ష్మి బాయి ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా మాట్లాడి వారి ప్రదర్శనలను వీక్షించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 568 మంది విద్యార్థులు 453మంది బాలికలు , 115 బాలురు, ఉత్సాహంగా పాల్గొన్నారు. శిక్షణ అనంతరం విద్యార్థులకు సర్టిఫికేట్ అందించారు. ప్రతి పాఠశాల రోబోటిక్స్ కిట్‌లను ఆవిష్కరించి నూతన ప్రాజెక్టులు రూపొందించేందుకు తోడ్పడుతాయని అన్నారు. ఇందులో వికారాబాద్ బాయ్స్ 98, వికారాబాద్ బాలికలు 122, కొత్తగడి 97, కెజిబివి 121, సంఘం లక్ష్మి బాయి 130, ఈ కార్యక్రమంలో సోహం అకాడమీ వ్యవస్థాపకులు సహదేవ్ జశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితులు ద్విచక్ర వాహనదారులే..

### జర్నలిస్టులకు హెల్మెట్ల పంపిణీలో జీనోమ్ వ్యాలీ ఇన్‌స్పెక్టర్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ సంఖ్యలో గాయపడేవారు ద్విచక్ర వాహనదారులేనని, బైక్‌లు నడిపేవారు ఖచ్చితంగా హెల్మెట్‌లు ధరించాలని తుర్కపల్లి జినోమ్‌వ్యాలీ ఇన్స్‌పెక్టర్ గురువయ్య అన్నారు. శుక్రవారం ఉమ్మడి శామీర్‌పేట ప్రెస్‌క్లబ్‌లో విలేకరులకు రాష్ట్ర హాజ్ కమిటి మెంబర్ మహ్మద్ ముజుబుద్దిన్ హెల్మెట్‌లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎస్‌హెచ్ఒ గురువయ్య మాట్లాడు తూ బైక్‌పై ఇంట్లో నుంచి బయల్దేరినప్పుడు హెల్మెట్ లేనిదే వాహనం నడుపరాదని రోడ్డు ప్రమాదాల్లో గాయపడి అవిటి వాళ్లుగా మారుతున్నారని ఆవేదన చెందారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తు పోలీసులకు సహకరించాలని చెప్పారు. చిన్న దూరమైనా పెద్ద దూరమైనా హెల్మెట్‌ను వాడాలన్నారు. హెల్మెట్ పెట్టుకుని క్లిప్ పెట్టుకోవాలని లేకపోతే ఫలితం ఉండదన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుకుంటు వాహనం నడపవద్దన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోతే ప్రమాదం తప్పదన్నారు. శామీర్‌పేట డిఐ రాజు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా యువకులు గాయపడతున్నారని చెప్పారు. విలేకరులు ఈ రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్ఐ శశివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ హైవే రోడ్లలో అతివేగంతో వెళ్లేవారు గ్రామీణ చౌరస్తాల్లోనే ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పారు. అల్వాల్ ట్రాఫిక్ ఎస్ఐ నవీన్‌రెడ్డి మాట్లాడుతూ కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకుని వాహనాలను నెమ్మదిగా నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హాజ్ కమిటి మెంబర్ మహ్మద్ ముజుబుద్దిన్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు క్యాతం రవి, ప్రధాన కార్యదర్శి బత్తుల ప్రభాకర్ యాదవ్, ఉపాధ్యక్షులు సింగం పవన్ కుమార్, శేఖర్, కార్యవర్గ సభ్యు లు, సలహాదారులు, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## ఆక్రమణలపై కొరడా ఝుళిపించిన మున్సిపల్ అధికారులు

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు పట్టణంలో మున్సిపల్ అధికారులు ఆక్రమణలపై కొరడా ఝుళిపించారు. పట్టణ పరిధిలోని శివాజీ చౌక్‌లో మురుగు కాలువలను సైతం ఆక్రమంచి మాంస విక్రయాలు చేపడుతున్నారని, దీంతో ప్రతిరోజు రద్దీ ఏర్పడి ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని అంటూ మున్సిపల్ అధికారులకు కాలనీ సులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

ఇందుకు స్పందించిన మున్సిపల్ అధికారులు మల్‌రెడ్డి పల్లి రోడ్డు మార్గంలోని ఆక్రమణలపై శుక్రవారం కొరడా ఝుళిపించారు. కూల్చి వేతలపై వ్యాపారులు అభ్యంతరం తెలిపారు. దీంతో కొంతసేపు అధికారులు, వ్యాపారుల మధ్య వాగ్వివాదం నెలకొంది. ఇది తెలుసుకున్న పోలీసులు అక్కడి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు.

మున్సిపల్ కమీషనర్ యాదగిరిని ఫోన్ సంప్రదించిన కూల్చివేతలను యధావిధిగా చేపట్టారు. ఈ కూల్చీవేతలలో టౌన్ ప్లానింగ్ అధికారులు, శానిటరీ ఇన్స్‌స్పెక్టర్‌లు, తదితరులు ఉన్నారు.

## అరకొర బస్సులతో విద్యార్థులకు ఇక్కట్లు

**ప్రజాపక్షం / కొడంగల్ :** అరకొర బస్సులతో నిత్యం విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని విద్యార్థుల తల్లీదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొడంగల్ మండల పరిధిలోని రుద్రారం, పాటుమీదిపల్లి, నాగారం, అన్నారం, అంగడిరాయిచూర్, ధర్మపూర్, లక్ష్మి పల్లి, సంగాయిపల్లి, చిట్లపల్లి తదితర గ్రామాల నుంచి వందల మంది విద్యార్థులు కొడంగల్‌కు చదువుకోవడానికి ఆర్‌టిసి బస్సులో రాకపోకలు సాగిస్తుంటారు. అయితే పరిగి డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు కొడంగల్ నుంచి ఉదయం 8 గంటలకు రుద్రారం కు వెళితే అక్కడ పలు గ్రామాల పాఠశాల, కళాశాల విద్యార్థులతో పాటు ప్రయాణికులు కూడా పెద్ద సంఖ్యలో నిండిపోవడంతో ఆయా గ్రామాల విద్యార్థులకు చోటు లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించడం సమయం వృధా అవ్వడంతో పాటు పలు ప్రమాదాలకు లోనవుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. పాఠశాల, కళాశాల సమయానికి చేరుకోకపోతే టీచర్‌లు పలు రకాలుగా పనిష్మెంట్‌లు ఇస్తున్నారని విద్యార్థులు కన్నీరు పెట్టుకుంటున్నారు. దీనిపై పలుమార్లు మండల విద్యాధికారి కూడా ఆయా డిపోల మెనేజర్‌లకు వ్రాత పూర్వకంగా వినతి పత్రాలు ఇచ్చిన ఆర్‌టిసి అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కళాశాలలకు వెళ్లే విద్యార్థులు నెలకు 700 రూపాయల బస్‌పాస్‌లు కట్టిన కూడా వృథా అవుతున్నాయని చదువుకోవాలంటు తల్లీదండ్రుల ద్విచక్ర వాహనాలు తీసుకువెళితే మైనర్‌లు అని కేసులు పెడుతున్నారని వాపోతున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మా సోంత నియోజకవర్గం అని చెప్పుకోడానికి కూడా చాలా ఇబ్బంది పడుతున్నామని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి రుద్రారం మీదుగా అదనపు బస్సులను ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నామని గ్రామాల ప్రజలు సైతం కొరుతున్నారు.

# మానసిక స్థైర్యంతో ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చు

### ఎమ్మెల్యే మర్రి




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మానసిక స్థైర్యంతో ఎలాంటి సమస్యలనైనా అవలీలగా పరిష్కరించుకొంటూ ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి అన్నారు. మల్కాజిగిరిలోని జికె ఫంక్షన్ హాలులో శుక్రవారం జరిగిన ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక అంగవైకల్యానికి ఓ పరిమితి ఉంటే తప్ప మానసిక బలానికి ఎలాంటి అవరోధమనేది లేదన్నారు. మానసక ఉల్లాసానికి ప్రతి ఒక్కరూ యోగా లాంటివి తమ జీవితంలో అలవరచుకోవాలన్నారు.ప్రజల్లో మానసికారోగ్యాన్ని పెంపొందించేందుకు అవగాహనా కార్యక్రమాలను తరచు నిర్వహిస్తుండాలన్నార. లయన్ ప్రోగ్రాం చైర్మన్ ప్రొఫెసర పఠాన్ ఉమర్ ఖాన్, తెలంగాణా సైకలాజిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు మోత్కూరి రాంచందర్, ప్రముఖ సైకియాట్రిస్టు డా.దొంతుల ప్రవీణ్, ఇపిఎ మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు అలియా పర్వీన్, కోఆర్డినేటర్లు జగదీష్, ప్రీతి, అర్షిత, వర్షిత, బిఆర్ఎస్ శ్రేణులు జగదీష్‌గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

**సిఎం రిలీఫ్ ఫండ్ ఓ వరం**



ఖరీదైన వైద్యాన్ని నోచుకోలేని పేద కుటుంబీకులకు సిఎం రిలీఫ్ ఫండ్ ఓ వరం లాంటిందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి అన్నారు. దీనికోసం అవసరమై న వారు తన ను సంబం ధిత పత్రాలతో సంప్రదించాలని కోరారు. శుక్రవారం సిఎం రిలీఫ్ ఫండ్ పథకం కింద మంజూరైన సూర్యకళకు రూ.51 వేలు, రవీందర్‌కు రూ. 48 వేలు చెక్కులను అందచేసారు.

## మాధవరెడ్డిని అడ్డుకునే శక్తి సిఎంకు లేదా?

**ప్రజాపక్షం/తాండూరు:** రాజ్యం అగ్రవర్గాల చేతిలో ఉన్నంత కాలం బహుజనులు బానీసలేనని బీసి సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్ అన్నారు. కోర్టు స్టేకు నిరసనగా శుక్రవారం తాండూరు పట్టణంలోని అంబేద్కర్ చౌక్ బీసి సంఘం ఆద్వర్యాన ధర్నా చేపట్టారు. బీసి నాయకుల నినాదాలతో ఒక్కసారిగా తాండూరు పట్టణం దద్దరిల్లింది. ఈ సందర్బంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ బీసి రిజర్వేషన్లను అడ్డుకోవడం హైకోర్టు స్టే ఇవ్వడం అగ్రవర్గాల కుట్రలో భాగమేనని మండిపడ్డారు. రాజ్యం అగ్రవర్గాల చేతిలో ఉన్నంత కాలం బహుజనులు బానీస బ్రతుకులేనని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు బీసిలను తమ స్వార్థ రాజకీయ కోసం వాడుకుంటున్నాయని అన్నారు. బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు ఎందుకు ఇంప్లీడ్ కాలేదని ప్రశ్నించారు.

## ప్రభుత్వ వైఫల్యం బిసిల ఆత్మగౌరవానికి అవమానం : ఆర్. కృష్ణ ముదిరాజ్

**ప్రజాపక్షం/వికారాబాద్:** ప్రభుత్వవైఫల్యం, బిసిల ఆత్మగౌరవానికి అవమానం బిసి నేత బిఆర్ కృష్ణముదిరాజు , స్థానిక సంస్థల్లో 42 శాతం బిసి రిజర్వేషన్లను అమలు చేయడానికి అన్ని అవకాశాలు ఉన్నప్పటికీ, ప్రభుత్వం నిర్లక్ష్యమైన నిర్వహణ కారణంగా జిఒనెంబర్ 9పై హైకోర్టులో స్టే ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని రాష్ట బిసి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ హైకోర్టులో రాష్ట ప్రభుత్వ తరపు వాదనలు శాస్త్రీయమైనవి, సమగ్రమైనవి కాకపోవడంతో బిసిల ఆత్మగౌరవానికి అవమానం జరిగిందని, రాజకీయ భవిష్యత్తును బజారుపడేలా చేసిందని విమర్శించారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ఉద్యాన పంట సాగు పెంచాలి

రంగారెడ్డి జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి సురేశ్

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జిల్లాలో ఉద్యాన పంటల సాగు పెంచాలని రంగారెడ్డి జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి కె.సురేశ్ అన్నారు. జిల్లాలో 10,990 ఎకరాలలో ఉద్యాన పంటల విస్తీర్ణం ఉందని, టొమోటో పచ్చిమిర్చి, వంగ, క్యాబేజి, క్యాలీఫ్లవర్, వంటి కూరగాయల సాగు పట్ల రైతులు మక్కువ చూపుతున్నారని చెప్పారు. జిల్లాలో కూరగాయల నారు తయారీ చేయు నర్సరీలు సుమారుగా 350కి పైగా ఉన్నాయన్నారు. ప్రతి నర్సరీ కూడా తప్పనిసరిగా ఉద్యాన నర్సరీ రిజిస్ట్రీకరణ, క్రమబద్ధీకరణ చట్టం ప్రకారం ఉద్యాన నర్సరీలను ఏర్పాటు చేసుకొనుటకు చట్టం చేయబడినది. ఈ చట్టరీత్యా ప్రతి నర్సరీ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. కూరగాయలు సాగు చేయు రైతులు తమకు అవసరమైన కూరగాయల నారును అధీకృత నర్సరీల నుండి మాత్రమే తీసుకోవాలని ఆయన సూచించారు. రిజిస్ట్రేషన్ లేని నర్సరీలలో నాణ్యత ప్రమాణాలు పాటించరు కావున రిజిస్ట్రేషన్ లేని నర్సరీల నుండి ఎట్టి పరిస్థితులలోను కూరగాయల నారు తీసుకోకూడదని తెలియచేస్తున్నామని స్పష్టం చేశారు.

## బొడ్రాయి ఉత్సవాలు ఐక్యతకు చిహ్నాలు

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/హయత్ నగర్ :** బొడ్రాయి ఉత్సవాలు గ్రామస్తుల ఐక్యతకు చిహ్నాలని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హయత్ నగర్ డివిజన్ పరిధిలోని దసరా గుడి ప్రాంగణంలో జరుగుతున్న బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జరిగిన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలకు తన వంతు సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సామ తిరుమలరెడ్డి, స్థానిక నాయకులు చెన్నగొని రవీందర్ గౌడ్, నక్క రవీందర్ గౌడ్, భాస్కర్ సాగర్, మల్లేష్ ముదిరాజ్, బొడ్రాయి ఉత్సవ సమితి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

## క్రమశిక్షణ, పట్టుదల ఉంటే రాణింపు



**ప్రజాపక్షం/శంషాబాద్ :** క్రమశిక్షణ, పట్టుదల ఉంటే విద్యార్థులు ఏ రంగంలోనైనా రాణిస్తారని ఇన్ఫాంట్ జీసస్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఫాదర్ కమల్ ఫ్రాన్సిస్ పేర్కొన్నారు. మండల స్థాయి కోకో క్రీడా పోటీల్లో ఇన్ఫాంట్ జీసస్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థినులు విజేతలుగా నిలిచారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫాదర్ కమల్ ఫ్రాన్సిస్ హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగితే మరిన్ని విజయాలు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పిఇటిలు లైన ఆనంద్, రవి, రాజును ప్రిన్సిపాల్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## సిసి కెమెరాలతో నేరాల నియంత్రణ



**ప్రజాపక్షం/కేశంపేట :** సిసి కెమెరాల ఏర్పాటుతోనే నేరాలను నియంత్రించేందుకు అవకాశం ఉంటుందని మాజీ ఉప సర్పంచ్ నీల లావణ్య పాండు అన్నారు. శుక్రవారం కేశంపేట మండల పరిధిలోని బోదునంపల్లి గ్రామం మాజీ సర్పంచ్ నీల లావణ్య పాండు సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ఏ చిన్న సమస్య వచ్చినా..కొత్త వ్యక్తులు వచ్చినా సిసి కెమెరాలు ఉండటంతో ప్రజలు సైతం అప్రమత్తంగా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ యెన్నం లింగారెడ్డి, కానిస్టేబుల్ అశోక్‌రెడ్డి, చాకలి మల్లేష్, మహేష్, శ్రీకాంత్, రవీందర్‌రెడ్డి, సాయిలు, యాదయ్య, నరసింహా, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## పంట సాగులో రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి



**ప్రజాపక్షం/యాచారం :** పంటల సాగులో రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించి అధిక లాభాలు పొందాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ నర్సయ్య, డాక్టర్ రామకృష్ణబాబు అన్నారు. శుక్రవారం యాచారం మండల పరిధిలోని గున్‌గల్, చౌదర్‌పల్లి, మొగుళ్ళ వంపు, అయ్యవారి గూడ, తక్కళ్ళపల్లి తండా, గ్రామాల్లో పంటలను క్షేత్ర పరిశీలన చేశారు. ఈసంధర్బంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ పంటలు పండించే రైతులు వ్యవసాయాధికారుల సూచనలు సలహాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ కిరణ్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ అంజనేయులు, డాక్టర్ కృష్ణ వేణి, మండల వ్యవసాయాధికారి అర్.రవినాథ్, వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్లు అడ్డుకుంటే ఉపేక్షించేది లేదు : ఆకాష్



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** రాజ్యాంగ బద్దమైన బిసి రిజర్వేషన్లను అడ్డుకుంటే ఉపేక్షించేది లేదని ఎఐఎస్‌ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్ అన్నారు. శుక్రవారం జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రంలో బిసి సేన చేపట్టిన ఆందోళనకు ఎఐఎస్‌ఎఫ్ మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆకాష్ నాయక్ మాట్లాడుతూ బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలు అయ్యే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిసిసేన జిల్లా ప్రధాన కార్యదర్శి జయ శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు మేకల వెంకటేష్, గిరిబాబు, మండల అధ్యక్షుడు బోయ చెన్నయ్య, ఉపాధ్యక్షులు అమృతం, దామోదర్, కొందుర్గు మండల అధ్యక్షురాలు వీరాపురం అనిత, సాగర్ బాలమణి, పొట్టి లావణ్య, కావలి వెంకటేష్, కన్నా మల్లేష్, జంగయ్య, సుంకరి లక్ష్మీ , శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## గ్రేటర్ వ్యాప్తంగా 1,166 కాలనీలలో..
# ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్






1892మెట్రిక్ టన్నుల వ్యర్థాలు , 655.4 మెట్రిక్ టన్నుల భవన నిర్మాణ వ్యర్థాల తొలగింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసి పరిధిలో దీర్ఘకాలికంగా పేరుకుపోయిన చెత్త తొలగింపు కోసం చేపట్టిన ప్రత్యేక శుభ్రత డ్రైవ్ కొనసాగుతోంది. పారిశుద్ధ్యం డ్రైవ్ చేపట్టి నేటితో ఐదు రోజులు పూర్తి కాగాఈ డ్రైవ్‌లో భాగంగా ఇప్పటి వరకూ 150 డివిజన్ లపరిధిలోనీ1,166 కాలనీలలో 1892మెట్రిక్ టన్నుల వ్యర్థాలు, 655 మెట్రిక్ టన్నుల భవన నిర్మాణ వ్యర్థాలు తొలగించామని అధికారులు తెలిపారు. జిహెచ్‌ఎంసి పరిధిలోని ఎల్.బి.నగర్, చార్మినార్, ఖైరతాబాద్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, సికింద్రాబాద్ జోన్‌లలో వ్యర్థాల సేకరణ సజావుగా జరుగుతోంది. అన్నిసర్కిల్స్‌లో వాహనాలతో వ్యర్థాల సేకరణ, డంపింగ్ ప్రాసెస్‌పై అధికారులు పర్యవేక్షణ నిర్వహిస్తున్నారు. జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ మాట్లాడుతూ నగరంలోని పాత వ్యర్థాల తొలగింపుతో పాటు శుభ్రమైన, ఆరోగ్యవంతమైన హైదరాబాద్ కోసం జిహెచ్‌ఎంసి యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. డ్రైవ్‌కు ప్రజలు కూడా సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## టపాసుల గోదామ్‌పై
# టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి

రూ.18 లక్షల టపాసులు సీజ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిద్దంబజార్ బజార్‌లో అక్రమంగా నడుస్తున్న టపాసుల గోదాముపై ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఈ సందర్భంగా రూ.18 లక్షల విలువైన టపాసులను స్వాధీనం చేసుకుని గోడౌన్‌ను సీజ్ చేశారు. ఆబిడ్స్‌కు చెందిన శ్యామ్ కుమార్ సుగంధి(55) కొన్ని రోజులుగా అక్రమంగా టాపాసులను నిల్వచేసి సరఫరా చేస్తున్నాడు. సంబంధిత అధికారుల నుంచి ఎటువంటి చెల్లుబాటు అయ్యే లైసెన్స్ లేకుండా నివాస ప్రాంతంలో బాణసంచా నిల్వ చేయడంత్లో మానవ ప్రాణాలకు, ఆస్తికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిసి కూడా, ఎటువంటి ముందస్తు జాగ్రత్తలు లేకుండా పైన పేర్కొన్న గోడౌన్ ప్రాంగణంలో పేలుడు పదార్థాలను శ్యామ్ కుమార్ గంధి అక్రమంగా నిల్వ చేశాడు. ఒక రహస్య సమాచారం ఆధారంగా, కమిషనర్ టాస్క్ ఫోర్స్, హైదరాబాద్ ఈస్ట్ జోన్ బృందం, అఫ్జల్ గంజ్ పోలీసులతో కలిసి, ఫైర్ క్రాకర్ గోడౌన్‌పై దాడి చేసి నిందితుడిని పట్టుకున్నారు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్ సిఐ చంద్రశేఖర్, ఎస్‌ఐలు ఎం.అనంతచారి, ఎన్.కరుణాకర్‌రెడ్డి, పి.నాగరాజు, అఫ్జల్ పాల్గొన్నారు.




## గిరిజన వివాదంలో ప్రభుత్వ జోక్యం అవసరం

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీ, లంబాడీ మధ్య తలెత్తిన వివాదంలో జోక్యంచేసుకోని, పరిష్కరించాలని సేవాలాల్ బంజారా సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు కొర్ర మోతీలాల్ నాయక్ కోరారు. కొంతమంది నేతలు తమ రాజకీయ లబ్ధి కోసం లంబాడీ, ఆదివాసీ తెగల మధ్య చిచ్చుపెట్టమే పనిగా పెట్టుకొన్నారని మండిపడ్డారు. శుక్రవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఎస్‌టి జాబితా నుంచి లంబాడీలను తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి సీతక్క తెరవెనుక ఆదివాసులను ఉసిగొల్పి ఉద్యమం నడిపిస్తున్నారని ఆరోపించారు. మరికొందరు లంబాడీ సంస్కృతి సంప్రదాయాలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ , రెండు తెగల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారని తెలిపారు. మంత్రి సీతక్క ఆదివాసులను నాయకత్వం వహించాలనుకొంటే ముందుగా తన పదవికి, కాంగ్రెస్‌కు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## విజిబుల్ పోలీసింగ్ చేయాలి : డిసిపి శిల్పవల్లి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పోలీసులు విజిబుల్ పోలీసింగ్ చేయాలని సెంట్రల్ జోన్ డిసిపి కె.శిల్పవల్లి అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లోని దోమలగూడ పోలీసు స్టేషన్‌ను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఒ, ఎస్‌ఐలు స్టేషన్ ఏరియా పరిధిలో తిరగాలని డిసిపి సూచించారు. ఏరియాలో మహిళా భద్రత, సైబర్ నేరాలు, మాదకద్రవ్య దుర్వినియోగ వ్యతిరేకత, ట్రాఫిక్ నియమాలు, సిసిటివి కెమెరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని దీంతో పాటు క్రీడలు వంటి కార్యకలాపాలను చేపట్టడం ద్వారా యువత పాల్గొనేలా చేయాలని డిసిపి శిల్పవల్లి ఆదేశించారు. దోమల్‌గూడ పోలీసు స్టేషన్‌లో డిసిపి రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులపై కూడా ఆరా తీశారు. డిసిపి పోలీసు స్టేషన్‌లోని సిబ్బందితో సంభాషించారు. గణేష్ నిమజ్జన్ బందోబస్త్ సమయంలో దోమల్‌గూడ పిఎస్ సిబ్బంది చేసిన మంచి పనిని అభినందించారు. న్యాయమైన స్నేహపూర్వక పోలీసింగ్ గురించి ఫిర్యాదుదారుల పట్ల సానుభూతి, వేగవంతమైన ప్రతిస్పందన, కమ్యూనిటీ పోలీసింగ్, ప్రోయాక్టోవ్ పోలీసింగ్ విధుల నిర్వహణలో అదనపు మైలుగా సిబ్బందికి కమిషనర్ ఇచ్చిన సందేశాన్ని పునరుద్ఘాటించారు. అనంతరం పోలీసు స్టేషన్ ఏరియాలో శిల్పవల్లి తిరిగి స్థానికులతో సంభాషించారు.ఈ కార్యక్రమంలో గాంధీనగర్ ఎసిపి ఎ.యాదగిరి, ఎస్‌హెచ్‌ఓ అంజాద్ అలీ, డీఐ సుధాకర్, ఎస్‌ఐలు సిబ్బంది ఉన్నారు.



## బిసిల రిజర్వేషన్లు అడ్డుకుంటున్న బిజెపి

సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి శ్రీనివాస్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసిల న్యాయమైన 42 శాతం రిజర్వేషన్‌లను బిజెపి అడ్డుకొని ద్రోహం చేస్తుందని సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ అన్నారు. సికింద్రాబాద్ అడ్డగుట్టలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కాంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్‌ల బిల్లుకు బిజెపి కట్టుబడి ఉందని ఒక వైపు మాట్లాడుతూనే మరోవైపు కోర్టులో కేసులు వేస్తూ, కేంద్రంలో బిజెపి రిజర్వేషన్‌ల బిల్లును ఆమోదించకుండా అడ్డుకుంటూ డ్రామాలాడుతుందన్నారు. బిజెపికి బిసిల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న 42 శాతం రిజర్వేషన్‌ల బిల్లుకు తక్షణం ఆమోదం తెలిపి, రిజర్వేషన్‌ల పెంపును తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. ఒక వైపు స్థానిక సంస్థలు ఎన్నికల నిర్వహించ పోవడంతో గ్రామాలలో పాలన కుంటుపడిందన్నారు. దీంతో ప్రజలు తీవ్రమైన అవస్థలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిసి బిల్లును అడ్డుకుంటున్న బిజెపికి వ్యతిరేకంగా సామాజిక న్యాయం కోరే ప్రజాస్వామిక లౌకిక శక్తులు ఉధృతంగా పోరాటాలకు సిద్ధమవుదామన్నారు. సమావేశంలో సిపిఐ సికింద్రాబాద్ నాయకులు కొమురెల్లి బాబు, గౌరీ నాగరాజ్, పాకాల యాదగిరి, సత్యనారాయణ, కొండల్, శ్రీనివాస్, సుదర్శన్, నాగ భూషణం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతపై అవగాహన




**ప్రజాపక్షం/హైదరాబాద్:** బాల్య వివాహాల నిరోదానికి, పౌష్టికాహారం, ఆరోగ్యం తదితర అంశాలపైన మహిళల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని మదర్లవ్ ఆర్గనైజేషన్ ఫర్ అవేర్‌నెస్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (మోర్డ్) ఛైర్మన్ డాక్టర్ ఆండేకర్ శ్రీనివాస్ తెలిపారు. మహిళల సాధికారత, బాలల సంక్షేమానికి సంబంధించి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ మహిళలలను చైతన్య పరుస్తున్నామని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు గ్రామాల్లో పర్యటించి,నాటకాలు, స్థానిక భాషా బోధన, అనుభవ కథనాల ద్వారా ప్రజలలో చైతన్యం పెంచుతున్నామని పేర్కొన్నారు. మోర్డ్ సంస్థ ద్వారా ఇప్పటికే వివిధ జిల్లాల్లో కుట్టు మిషన్‌శిక్షణ, డిజిటల్ లిటరసీ శిక్షణ కేంద్రాలను స్థాపించామని, 25 సంవత్సరాల కాలంలో రెండు వేలకు పైగా యువతకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించామని ఆయన వివరించారు.

## బిసి రిజర్వేషన్లకు ‘బిఆర్‌ఎస్, బిజెపి అడ్డు

**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** రాజకీయ లబ్ధి కోసమే బిసి రిజర్వేషన్లను బిఆర్‌ఎస్, బిజెపిలు అడ్డుకొన్నాయని తెలంగాణ బిసి–ఎ కులాల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు ప్రొఫెసర్ భాగయ్య ఆరోపించారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో హైకోర్టు న్యాయవాది సుదర్శన్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లను బిసి కులాల దామాషా ప్రకారం కేటాయించాలన్నారు. సమావేశంలో కంటె రాంచందర్, గడప శ్రీహరి, అంబటి సుధాకర్, రామానందస్వామి పాల్గొన్నారు.

### రాజకీయ క్రీడగా బిసి రిజర్వేషన్లు

రాష్ట్రంలో కాంగ్రెస్, బిఆర్‌ఎస్, బిజెపిలు బిసి రిజర్వేషన్లను రాజకీయ క్రీడగా మార్చారని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్ లిబర్టీలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల బిల్లును రాష్ట్ర బిజెపి నేతల ఒత్తిడితోనే గవర్నర్ ఆమోదించడం లేదని స్పష్టంగా కనపడుతుందన్నారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలయ్యేవరకు ఆప్ పోరాడుతుందని తెలిపారు. సమావేశంలో ఆప్ రాష్ట్ర నేతలు బుర్ర రాము గౌడ్, విజయ్ మల్లంగి, అబ్దుల్ ముక్తదీర్, ఎండి మజీద్, మౌనిక పాల్గొన్నారు

## ప్రజల ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలి : డిఎంహెచ్‌ఒ

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** వైద్యసిబ్బంది ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధవ్షహించి మెరుగైన వైద్య సేవలు అందించడం తోపాటు సేవా భావంతో మెలగాలని రంగారెడ్డి జిల్లా వైద్యా,ఆరోగ్య శాఖఅధికారి డాక్టర్ కె లలితాదేవి అన్నారు. శుక్రవారం బండ్లగూడ జాగీర్ లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీలు చేశారు. పట్టణ ఆరోగ్య కేందర్ం సిబ్బందికి తగు సూచనలు చేశారు. అక్కడ అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు తదితర విషయాలను పరిశీలించారు. ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి,మెరుగైన వైద్య సేవలు అందించాలని, రోగుల పట్ల సేవా భావంతో మెలగాలని సిబ్బందికి సూచించారు. అదేవిధంగా జిహెచ్‌ఎంసి, మున్సిపల్ సిబ్బంది సహకారంతో పారిశుద్ధం పట్ల ప్రజలకు అవగాహన కల్పించి కీటక జనిత వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గర్భిణీలు, చిన్నపిల్లలకు టీకాలు సకాలంలో వేయించాలని సూచించారు. అదేవిధంగా బిపి షుగర్ వంటి వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కలిగించాలని సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రాకేష్, జిల్లా అధికారి ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శిభ, రూరల్ హెల్త్ సెంటర్ నార్సింగి వైద్యాధికారిని సత్యరత్నతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



### పల్స్ పోలియోకు అన్ని ఏర్పాట్లు

అక్టోబర్ 12న పల్స్ పోలియోకు కలెక్టర్ పర్యవేక్షణలో అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు డిఎంహెచ్‌ఒ డాక్టర్ లలితాదేవి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అక్టోబర్ 12న సబ్ నేషనల్ ఇమినైజేషన్ దినోత్సవంలో భాగంగా, పల్స్ పోలియో నిర్వహణ మనరాష్ట్రంలో ఐదు జిల్లాలలో ఏర్పాటు చేస్తున్నారు. వాటిలో హనుమకొండ,హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్గిరి, సంగారెడ్డి తోపాటు రంగారెడ్డి జిల్లాలో ఈ పోలియో దినోత్సవం జరుపుతున్నారు. ఇందుకుగాను పట్టణ ప్రాంతంలో 422, గ్రామీణ ప్రాంతంలో 1129 పోలియో చుక్కల కేంద్రాలు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

## సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

మండల విద్యాధికారి పాండురంగారెడ్డి

యాచారంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**ప్రజాపక్షం/యాచారం :** సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందని యాచారం మండల విద్యాధికారి పాండురంగారెడ్డి అన్నారు. శుక్రవారం యాచారం మండల కేంద్రంలోని సాయిశరణం గార్డెన్‌లో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి కీలక భూమిక పోషిస్తున్నారని కొనియాడారు. ప్రతి ఉపాధ్యాయుడు తమ పాఠశాలలో విద్యాప్రమాణాలు పెంపొందించుకోవడానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉత్తమ ఉపాధ్యాయలుగా అవార్డు పొందిన ఉపాధ్యాయుల బాధ్యత మరింతగా పెరిగిందన్నారు .విద్యార్థులను క్రమశిక్షణగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో యాచారం స్కూల్ కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ నరసింహ్మా, మేడిపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు ఉదయశ్రీ, చింతపట్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభాదేవి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తిరుమలేశ్ గౌడ్, యాదగిరి, అంజయ్య, ధన్‌రాజ్, బాలకృష్ణ, విజేంధర్‌రెడ్డి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ అభివృద్ధికి హెచ్‌ఎండిఎ నిధులు



షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** మున్సిపాలిటీని అభివృద్ధి చేసేందుకు హెచ్‌ఎండిఎ నుండి రూ.10కోట్ల నిధులు మంజూరు చేయించడం జరిగిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ సునీత, సంబంధిత శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కొత్త కాలనీలను ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు ప్రజలు, అధికారులు సహకరించాలని కోరారు. పదికోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. మున్సిపల్ పరిధిలోని కొత్త కాలనీల్లో సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఎమ్మెల్యే అదేశాల మేరకు కొత్త కాలనీల్లో సిసి రోడ్లుతోపాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు చెన్నయ్య, శ్రీకాంత్‌రెడ్డి, బస్వం, బాల్‌రాజ్ గౌడ్, చెంది తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

# రీల్



## 'డ్యూడ్' ట్రైలర్ విడుదల

లవ్ టుడే, డ్రాగన్‌లతో రెండు వరుస హిట్‌లను అందించిన యూత్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ డ్యూడ్‌తో దీపావళికి ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంతో కీర్తిశ్వరన్ డైరెక్టర్ గా పరిచయం అవుతున్నారు. 'ప్రేమలు'అద్భుతమైన విజయం తర్వాత ప్రదీప్ సరసన మమిత బైజు నటించగా, శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా సాంగ్స్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ చేశారు. సాంప్రదాయ ప్రేమ కథల కంటే భిన్నంగా 'డ్యూడ్' కథ ఒక యువకుడి జీవితం, ప్రేమతో మొదలవుతుంది. తాను అన్నీ అర్థం చేసుకున్నానని అనుకునే ఒక పక్కా రొమాంటిక్. అతని ప్రేమ జీవితం పర్‌ఫెక్ట్‌గా సాగుతున్నట్టు అనిపిస్తుందంతే కానీ, ఒక్కసారిగా నిజ జీవితం తలకిందులు అవుతుంది. అతని లవ్ దూరమవడం అతని మనసులో భావోద్వేగ తుఫాను తెచ్చిపెడుతుంది. అదే సమయంలో మరో అమ్మాయి అతని జీవితంలోకి అడుగు పెట్టడం, తాళి అనే అంశానికి కొత్త మీమింగ్ జోడిస్తుంది. ప్రదీప్ తన నేచురల్ హ్యూమర్, ఎమోషన్స్ అదరగొట్టాడు. మమితా బైజు తన పాత్రలో కట్టిపడేసింది. నేహా శెట్టి ప్రెజెన్స్ ఇంట్రస్టింగ్‌గా వుంది. శరత్‌కుమార్, రోహిణి మొల్లెట్టి, హృదు హారూన్, ద్రవిడ్ సెల్వం లాంటి నటులు కథకు మరింత బలాన్ని జోడించారు.అక్టోబర్ 17న తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమంలో నటుడు శరత్ కుమార్, ప్రొడ్యూసర్ రవిశంకర్, మైత్రి డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి పాల్గొన్నారు.

## 17 నుంచి జీ5లో కిష్కిందపురి స్ట్రీమింగ్



బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్, మకరంద్ దేశ్‌పాండే ప్రధాన పాత్రల్లో నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ చిత్రం 'కిష్కింధపురి'. కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వం ఈ హారర్‌థ్రిల్లర్ థియేటర్లో సంచలన విజయాన్ని నమోదు చేసిన సంగతి తెలిసిందే. అందరికీ థియేటర్లో ఇది సీట్ ఎడ్జ్ థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందించింది. జీ5లోకి రాబోతోంది ఈనెల 17న సాయంత్రం 6 గంటల నుండి 'కిష్కింధపురి'ని స్ట్రీమింగ్ కానుంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రంలో థియేటర్లలో బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకుని ఇక ఇప్పుడు డిజిటల్ ఫ్లాట్‌ఫాంలోకి అడుగు పెడుతోంది.

## 'దక్కన్ సర్కార్' పోస్టర్ విడుదల



తెలంగాణ ఉద్యమకారుడు ప్రముఖ రచయిత కళా శ్రీనివాస్ నిర్మించిన 'దక్కన్ సర్కార్' సినిమాకి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి ఈ పోస్టర్ ని ఆవిష్కరించడం జరిగింది..ఈ కార్యక్రమంలో మరో సీనియర్ ఉద్యమకారుడు, కళాకారుల జేఏసీ అధ్యక్షుడు మురళీధర్ దేశ్ పాండే, చిత్ర హీరో చాణక్య, మౌనిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయశాంతి మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం నుండి ఇలాంటి మరిన్ని చిత్రాలు రావాలని దానికి ప్రభుత్వం కూడా సహకరిస్తుందని తెలపడం జరిగింది. మురళీధర్ దేశ్ పాండే మాట్లాడుతూ తెలంగాణ అస్తిత్వానికి అద్దం పట్టే ఇలాంటి సినిమాల నిర్మాణం జరగాలని..ప్రభుత్వం తెలంగాణ సినిమాలను, కళాకారులను ప్రోత్సహించాలని కోరుతూ చిత్ర యూనిట్ ను అభినందించారు. చిత్ర దర్శకుడు, నిర్మాత కళా శ్రీనివాస్ మాట్లాడుతూ ఇది ప్రజల జీవన స్థితిగతుల కథ అని, సహజ సంఘటనలను బేస్ చేసుకొని సహజ సిద్ధంగా నిర్మించిన చిత్రం అని, 2 సంవత్సరాలు కష్టపడి ఎన్నో ఒడుదొడుకులు తట్టుకొని పూర్తి చేశామని, ఈ సినిమాని తన అభిమాన తార విజయశాంతి ప్రమోషన్ చెయ్యడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. నటి మౌనిక మాట్లాడుతూ.. ఈ సినిమాలో నాకు అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుండి వచ్చిన సుమారు 40 మంది కళాకారులు పాల్గొన్నారు

## బ్రహ్మానందంపై పాట అనుకోకుండా తీశాం

### నిర్మాతలు కళ్యాణ్ మంథిన, భాను ప్రతాప



ప్రియదర్శి, నిహారిక ఎన్‌ఎం హీరో హీరోయిన్లుగా విజయేందర్ దర్శకత్వంలో బీవీ వర్క్స్ బ్యానర్ మీద బన్నీ వాస్ సమర్పణలో కళ్యాణ్ మంథిన, భాను ప్రతాప, డా. విజేందర్ రెడ్డి తీగల నిర్మించిన చిత్రం 'మిత్ర మండలి'. ఈ మూవీ అక్టోబర్ 16న రిలీజ్ కాబోతోంది. ఈ క్రమంలో నిర్మాతలు కళ్యాణ్ మంథిన, భాను ప్రతాప మీడియాతో ముచ్చటించారు. వారు చెప్పిన విషయాలు, విశేషాలు. ఈ కథతో చాలా ఏళ్లుగా ట్రావెల్ అవుతున్నారు. ఓ సారి మా ఇద్దరినీ ఈ కథ వినమని చెప్పారు. కళ్యాణ్ ఎక్కువగా వ్యాపారాల్లో బిజీగా ఉంటారు. మేం ఇద్దరం ప్రొడక్షన్ కంపెనీ స్టార్ట్ చేయాలని అనుకున్నాం. ఆ టైంలో ఈ కథను విన్నాం. ఈ మూవీతో పాటుగా మరో రెండు ప్రాజెక్టుల్ని కూడా స్టార్ట్ చేశాం. విజయేందర్ మంచి దర్శకుడు. అనుదీప్, 'మ్యాడ్ కళ్యాణ్, ఆదిత్య హాసన్‌లతో విజయేందర్ పని చేశాడు. పూర్తి స్క్రిప్ట్‌తోనే మా వద్దకు వచ్చాడు. కథను ఎంత అద్భుతంగా రాసుకున్నాడో.. అంతే అద్భుతంగా తీశాడు. కొత్త దర్శకుడిలా, మొదటి సినిమాలా అనిపించలేదు. మేం రైటర్స్‌తో కలిసి రైటింగ్ రూం‌ని ముందుగా ప్రారంభించాం. అక్కడ పుట్టిన కథలతోనే 'ఆయ్', 'తండేల్' బయటకు వచ్చాయి. అందుకే మేం ఆ చిత్రాలకు కో ప్రొడ్యూసర్స్‌గా వ్యవహరించాం. స్క్రిప్ట్ ఓ లెవెల్ వచ్చే వరకు మేం అందులో ఇన్వాల్వ్ అవుతాం. 'మిత్ర మండలి'లో బ్రహ్మానందం పాత్ర చాలా ఆసక్తికరంగా ఉంటుందన్నారు.

## 'దోచావే నన్నే' సాంగ్ విడుదల



ప్రియదర్శి ప్రస్తుతం రానా దగ్గుబాటి సమర్పణలో పుస్కూర్ రామ్ మోహన్ రావు, జాన్వి నారంగ్ నిర్మాణంలో రిఫ్రెషింగ్ రొమాంటిక్ కామెడీ మూవీ ప్రేమంటేతో రాబోతున్నారు. ఆనంది హీరోయిన్ గా నటిస్తోంది. సుమ కనకాల ఒక ముఖ్యమైన పాత్ర చేస్తున్నారు. నవనీత్ శ్రీరామ్ డైరెక్టర్‌గా అరంగేట్రం చేస్తున్నారు. 'థ్రిల్‌యు ప్రాప్తిరస్తు!' అనేది ట్యాగ్‌లైన్. దివంగత నారాయణ్ దాస్ నారంగ్ వారసత్వాన్ని కొనసాగిస్తూ శ్రీ వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్ నిర్మిస్తోంది. స్పిరిట్ మీడియా సమర్పిస్తుంది. ఈ సినిమా మ్యూజిక్ ప్రమోషన్స్‌లో భాగంగా ఫస్ట్ సింగిల్ 'దోచావే నన్నే'ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ పాటను నాని లాంచ్ చేశారు.


## రొమాంటిక్ స్టొరీస్ అంటే ఇష్టం

### చిట్ చాట్‌లో శ్రీనిధి శెట్టి



పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నుంచి వస్తున్న మ్యూజికల్ రొమాంటిక్ ఎంటర్టైనర్ 'తెలుసు కదా'. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, రాశి ఖన్నా హీరోయిన్స్. ప్రముఖ స్టైలిస్ట్‌ఫిల్మ్ మేకర్ నీరజా కోన దర్శకత్వంలో టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. అక్టోబర్ 17న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ శ్రీనిధి శెట్టి మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. తెలుసు కదా సినిమాలో చాలా హ్యాపీగా ఉంది. కేజిఎఫ్, హిట్ త్రీ యాక్షన్, చాలా బ్లడ్ బాత్ ఉన్న సినిమాలు. తెలుసు కదా ఒక లైట్ హార్టెడ మూవీ చాలా కొత్తగా ట్రై చేశాం. ఇద్దరు అమ్మాయిలు, అబ్బాయి వున్నప్పుడు ట్రై యాంగిల్ లవ్ స్టొరీ అనుకుంటారు. కానీ తెలుసు కదాలో ఒక యూనిక్ పాయింట్ ని టచ్ చేశాం. అది ఇప్పుడు రివిల్ చేయకూడదు. సినిమా చూసినప్పుడు మీరు ఖచ్చితంగా సర్ ప్రైజ్ అవుతారు. నాకు రొమాంటిక్ స్టొరీస్ చేయడం ఇష్టం. తెలుసు కదాలో మంచి రొమాంటిక్ ఎంటర్టైన్మెంట్ వుంది. హిట్ 3కి ముందే ఈ కథ విన్నాను. కథ చాలా నచ్చింది. అయితే ముందుగా హిట్3 రిలీజ్ అయ్యింది. తెలుసు కదాలో లవ్ ఎమోషన్ లాఫ్ సాంగ్స్ అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ వుంటాయి. సినిమా చూసిన తర్వాత ఆడియన్స్ మంచి రొమాంటిక్ డ్రామాని ఫీల్ అవుతారు. నీరజ చాలా పాషన్ తో సినిమా చేశారు. నీరజ విజన్ ఆడియన్స్‌కి ఖచ్చితంగా కనెక్ట్ అవుతుంది. ఇది మంచి ఫీల్ గుడ్ ఎంటర్టైనర్. ఇందులో చాలా కొత్త పాయింట్ వుంది. ఇందులో మూడు క్యారెక్టర్స్ ఆడియన్స్‌కి కనెక్ట్ అవుతాయి. థియేటర్స్‌లో చూస్తున్నప్పుడు ఎంజాయ్ చేస్తారు. సిద్ధు గారి క్యారెక్టర్ ని చాలా ఎంజాయ్ చేస్తారు. సిద్ధుకి అన్నీ డిపార్ట్మెంట్స్‌లో చాలా నాలెడ్జ్ వుంటుంది. ఒక యాక్టర్‌కి అన్ని విభాగాలపై పట్టు వుండటం అదృష్టం. రాశి ఖన్నా చాలా క్రమశిక్షణ గల నటి. తన డైట్, వర్క్ అవుట్ అన్నీ పద్ధతిగా వుంటాయినాకు మొదటి నుంచి తెలుగు ఇష్టం. కాలేజ్ డేస్ లో తెలుగు ఫ్రెండ్స్ వుండేవాళ్ళు. అప్పటి నుంచి తెలుగు మాట్లాడటం అలవాటైయింది.వెంకటేష్ , త్రివిక్రమ్ సినిమాలో అవకాశం రావాలని కోరుకుంటున్నాను.

## 'ఫంకీ' టీజర్ విడుదల



కథానాయకుడు విశ్వక్ సేన్, హాస్య చిత్రాలకు చిరునామాగా మారిన దర్శకుడు కె.వి. అనుదీప్ కలయికలో రూపొందుతోన్న చిత్రం 'ఫంకీ'. ఈ చిత్ర టీజర్ తాజాగా విడుదలైంది. ఈ చిత్రంలో విశ్వక్ సేన్ దర్శకుడి పాత్రను పోషిస్తుండటం విశేషం. ఇందులో విశ్వక్ సరికొత్తగా కనిపిస్తున్నారు. కథానాయిక కయాదు లోహార్ తన అందంతో కట్టిపడేశారు. వీరి జోడి కొత్తగా, ఉత్సాహంగా కనిపిస్తూ.. తెరకు మరింత అందాన్ని తీసుకొచ్చింది. టీజర్ లో భీమ్స్ సిసిరోలియో సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తనదైన నేపథ్య సంగీతంతో ప్రతి షాట్‌ను మరో స్థాయికి తీసుకెళ్ళారు. మొత్తానికి టీజర్ మళ్ళీ మళ్ళీ చూడాలి అనిపించేలా ఉండటమే కాకుండా, సినిమా పట్ల ప్రేక్షకుల ఆసక్తిని రెట్టింపు చేస్తోంది.దర్శకుడు అనుదీప్ శైలి ప్రత్యేక వినోదం టీజర్ లో అడుగడుగునా కనిపించింది.

## ఓటీటీలోకి 'త్రిబాణధారి బార్బరిక్'




బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా నటించిన త్రిభాణ ధారి బార్బారిక్ సినిమా ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్, సన్ నెక్స్ ఫ్లాట్ ఫాంలో అక్టోబర్ 10 నుంచి అందుబాటులో ఉంటుంది. సత్య రాజ్, వశిష్ట ఎన్ సింహా, ఉదయ భాను, సాంచీ రాయ్, క్రాంతి కిరణ్ వంటి వారు నటించిన ఈ మూవీకి ఇన్ ఫ్యూజన్ బ్యాండ సంగీతాన్ని అందించింది. టెక్నికల్‌గా మూవీ హై స్టాండర్డ్స్‌లో ఉందని అందరూ ప్రశంసించిన సంగతి తెలిసిందే. మేకర్ మోహన్ శ్రీవత్సకు, నిర్మాత విజయ్ పాల్ రెడ్డికి 'త్రిబాణధారి బార్బరిక్' అయితే మంచి పేరును తెచ్చి పెట్టింది. అందరినీ ఆకట్టుకునే ఈ హోల్ సమ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌ను తప్పకుండా చూడండి.




## రూ.10వేలు లంచం (మొదటి పేజీ తరువాయి)

పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే మధురానగర్ గ్రామ పంచాయతీకి సంబంధించిన ఇందిరమ్మ ఇంటి బిల్లు కోసం గ్రామ కార్యదర్శి నెల రోజుల నుంచి డబ్బుల కోసం పది వేలు డిమాండ్ చేయడంతో బాధితుడు రూ.10వేలు ఇస్తుండగా ఏసిబి అధికారులు ప్రణాళికతో కార్యదర్శి లంచం స్వీకరిస్తున్న సమయంలో పట్టుకున్నారు. పంచాయతీ కార్యదర్శిని అదుపులోకి తీసుకుని కరీంనగర్ ఏసిబి డీఎస్పీ విజయ్ కుమార్ పంచాయతీ కార్యదర్శి అనిల్‌ను లంచం తీసుకున్న మొత్తం, సంబంధిత పత్రాలు, రికార్డులు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. ఏసిబి డిఎస్‌పి విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, దీపావళి పండుగ సంధర్భంగా టపాసుల దుకాణాల పర్మిషన్ విషయంలో, ఇతర గవర్నమెంట్ అధికారులు లంచం అడిగితే ఏసిబి టోల్ ఫ్రీ నెంబర్ 1064కు ఫోన్ చేయాలన్నారు.

## ఓటరు జాబితా సవరణ (మొదటి పేజీ తరువాయి)

ఎస్‌ఐఆర్‌ను ప్రారంభించే పని జరుగుతోందని, దాని అమలుపై ఎన్నికల కమిషన్ తుది నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రకటన కోసం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, జూన్ 24న బిహార్ ఎస్‌ఐఆర్‌ను ప్రారంభిస్తున్నప్పుడు ఇసి పాన్‌ఇండియా ఎస్‌ఐఆర్ కోసం తన ప్రణాళికను ప్రకటించిందని కుమార్ చెప్పారు. ప్రక్రియ కొనసాగుతోందని, వివిధ రాష్ట్రాలు తమ తమ ఎస్‌ఐఆర్‌ను ప్రారంభించే తేదీలను నిర్ణయించడానికి ముగ్గురు కమిషనర్లు సమావేశమవుతారని ఆయన అన్నారు. కాగా, ఈనెల ప్రారంభంలో ఢిల్లీలో జరిగిన సమావేశంలో ఇసి ఉన్నతాధికారులు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారులను (సిఇఒలు) రానున్న 10నుండి15 రోజుల్లో ఎస్‌ఐఆర్ అమలుకు సిద్ధంగా ఉండాలని కోరారు. చాలా రాష్ట్రాలు 2002–2004 మధ్య ఓటరు జాబితాలో చివరి ఎస్‌ఐఆర్‌ను కలిగి ఉన్నాయి. రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంతం (యుటి)లోని చివరి ఎస్‌ఐఆర్ ప్రకారం ప్రస్తుత ఓటర్లను ఓటర్లతో మ్యాపింగ్ చేయడం చాలా రాష్ట్రాలు దాదాపు పూర్తి చేశాయి.










Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com